పుప్పజాన్ మహమ్మద్ ఖదీర్ బాబు 01 జనవరి
2004 14B 3864

# పుప్పుజాన్ కతలు

పిల్లల జానపద సంపద



మహమ్మద్ ఖదీర్‌బాబు



phuppujaan kathalu * mohammad khadeer babu

copyright with writer

All rights reserved; no part of this publication may be reproduced or transmitted by any means, electronic, mechanical, photocopying or otherwise, without the prior permission of the writer

First published: September 2004
by Asmita
resource centre for women
Teachers colony, West Marredpally,
Secunderabad,
Andhra pradesh,
India.

Cover and Illustrations:
Mohan

Cover design:
Ramana GV

Type setting:
Ramu, Venugopal

Layout:
M.Venkat Reddy

Printed at: Navya, Hyderabad

For Copies Asmita and all leading book stalls

Price: Rs.100/-

# పుష్పజాన్ కతలు

పిల్లల జానపద సంపద

మహమ్మద్ ఖదీర్‌బాబు

అస్మిత సమర్పణ



ఎండి. గౌసున్నీసా

# ఈ కతలన్నీ మా దాదీకి...

చిన్నప్పుడు మా అమ్మ తలకు బోస్తానని వస్తే దడుసుకొని చచ్చేవాణ్ణి బయంతో. ఎందుకంటే మా అమ్మ తలకు బోస్తే సబ్బేసి కసాబిసా రుద్ది ఊపిరాడనీకుండా చేసేది మొరటుగా. అట్లాగే అన్నం తినిపించాలన్నా అంతే. నోట్లో ఒక ముద్ద ఉండగానే యింకో ముద్ద లట లటా కూరి గుడ్లు తేలేసేలా చేసేది.

కానీ మా దాదీ అలా కాదు. ఏ పని చేసినా అమిత మితవ. అమిత తమీజు. ఆమె పిలకాయలకి స్నానం చేయించిందంటే ఎంతసేపైనా చేయించుకోవాలనిపించేది. తలకు బోశాక టవలు పెట్టి తుడిచిందంటే ఎంతసేపైనా తుడిపించుకోవాలనిపించేది.

మా యింట్లో తక్కినోళ్లంతా ఒక జట్టు. మా దాదీ నేనూ ఒక జట్టు. తోకలాగా తిరగతా ఉండేవాణ్ణి వెనక.


మా నాయన మా యిల్లు కట్టించినప్పుడు కొయ్య మిగిలుంది కదా అని ఉత్త డైనింగ్ టేబులే యింత ఎత్తున యింతపొడవున తయారు చేయించాడు. కానీ దానికి కుర్చీలు తయారు చేయించడానికి డబ్బులు లేక పాలుమారాడు. అప్పుడా డైనింగ్ టేబుల్‌ని వృదాపోనించడం దేనికని నేనూ మా దాదీ దాని మీద పడుకునేవాళ్లం. రాత్రయితే చాలు మా దాదీ దానిపైన బొంతపరిచి ఆ పైన దుప్పటి పరచి అటొకటి ఇటొకటి దిండ్లు పెట్టి ఎంత బాగా పక్కేసేదంటే సగం ఆ పక్కను చూడగానే నిద్ర కమ్ముకొచ్చేది. మిగిలిన సగం మా దాదీ చెప్పే కతలకి.

మా దాదీ ఎప్పుడు చూసినా ఉర్దూ అరబ్బీ పుస్తకాలు చదవతా ఉండేది. వాటిలో నుంచి బలే బలే కతలు నాకు చెప్తా ఉండేది. ఆమె చెప్పిన 'సెబ్బాష్ రాజుగారు' అనే కత ఒక్కటే యిందులో రాయగలిగాను. మిగిలినవి గుర్తులేవు.

'నీ ఎడమ బుజంలో ఒక ఫరిష్త (దైవభటుడు) ఉంటాడు. నువ్వు తప్పు పనులు చేస్తే ఎప్పటికప్పుడు నోటు చేస్తా ఉంటాడు. అలాగే కుడి బుజంలో యింకో ఫరిష్త ఉంటాడు. నువ్వు మంచి పనులు చేస్తే ఎప్పటికప్పుడు నోట్ చేస్తా ఉంటాడు. ఆఖరున నువ్వు పైకి పోయాక అల్లా ఈ ఇద్దరు ఫరిష్తాలు ఇచ్చిన పుస్తకాలని ముందర పెట్టుకొని ఏ పనుల లిస్టు ఎక్కువుంటే ఆ పనులకు తగినట్టుగా దోజఖ్‌గానీ, జన్నత్‌గానీ నీకు కేటాయిస్తాడు. కాబట్టి జాగ్రత్తగా ఉండు' అని మా దాదీ చిన్నప్పుడు నాకు బయం చెప్తా ఉండేది.

ఈ కతలను మా దాదీకి అంకితం యిచ్చి నేను చేసిన ఈ పనిని నా కుడిబుజంలోని ఫరిష్త నోటు చేస్తాడనే అనుకుంటా ఉన్నా.

-ఖదీర్



# ముందుమాట

సాహిత్యానికి సంబంధించి అందులోనూ స్త్రీవాద, దళిత, మైనారిటీ సాహిత్యాల గురించి అస్మిత పదమూడు సంవత్సరాల నుంచీ కృషి చేస్తోంది. "నీలి మేఘాలు" కవితా సంకలనం ఒకటే అస్మిత పేరుతో వచ్చినప్పటికీ అనేకమంది స్త్రీవాద రచయిత్రులకు, దళిత మైనారిటీ రచయితలు, రచయిత్రులకు వాళ్ళ రచనలు ప్రచురించుకునేందుకు అవసరమైన ఆర్థిక, నైతిక సహాయ సహకారాలను అస్మిత అందిస్తోంది. దానితోపాటు సాహిత్య కళారంగాలలో మరుగున పడిన, వెలుగుకు నోచుకోని అంశాలను ఎవరైనా ఆసక్తితో శ్రద్ధతో పరిశీలించి వెలికి తీసుకొస్తామంటే వారికి ఆ పని చేయటానికి కావలసిన వనరులను అస్మిత అందించి ఆ పనికి తోడ్పడుతూ వస్తోంది. అమ్మతల్లులనే గ్రామదేవతల గురించి వేమన వసంతలక్ష్మి చేసిన ఆసక్తికరమైన పరిశోధనకు అస్మిత సహకరించింది. ఇంద్రగంటి జానకీబాల సినీ గాయనీమణుల గురించిన సమాచారాన్ని సేకరించి ప్రచురించటానికి అస్మిత కారణమైంది. అలాగే ఇప్పటి, ఖదీర్‌బాబు పుప్పుజాన్ చెప్పిన కథలకు కూడా.

ఖదీర్ ఈ ప్రాజెక్టు తాను చేస్తానని చెప్పగానే అస్మితలో అందరూ దాని ప్రాముఖ్యాన్ని

గుర్తించారు. అంగీకరించారు. తెలుగులో బాల సాహిత్యం కొరత ఉన్నదనేది అందరూ అంగీకరించే విషయమే. ఇక ఒక కమ్యూనిటీలోని పిల్లలు చెప్పుకునే కథలు మరొక కమ్యూనిటీకి అందటం చాలా అరుదు. పైగా ఇప్పటి ఆధిపత్య సంస్కృతిలో సిండరిల్లా, స్నోవైట్, ఎలీస్ వంటి పాత్రలు తప్ప మన పేదరాసి పెద్దమ్మలూ, మన నేలలో పుట్టిన పాత్రలూ, మనమెరిగిన మనస్తత్వాలూ కనిపించటమే లేదు. చెప్పేవారూ అరుదైపోయారు. తల్లిదండ్రులకు తీరిక దొరకదు. ఒకోసారి పిల్లలు కూడా దొరకరు టి.వీలకు అతుక్కుపోయి. ఇలాంటి నేపథ్యంలో పిల్లలకు ఈ కథలు అందటం ఎంతో బాగుంటుంది.

మైనారిటీ కమ్యూనిటీ గురించి ఎన్నో అపోహలు చిన్నతనంలోనే పిల్లల మనసులను విషపూరితం చేస్తున్న రోజులివి. మనం వేరు- వాళ్ళు వేరు అనే భావనను సమాజం కుటుంబాలూ పిల్లల మనసుల్లో నాటుతున్నాయి. అలాంటి సమయంలో ఒకరి సంస్కృతి ఒకరి సాహిత్యం ఒకరి జీవన విధానం మరొకరికి తెలియటం అవసరం.

ఒక ప్రాంతంలో నివసిస్తున్న రెండు మతాల ప్రజలు ఒకరినొకరు ఎంతో ప్రభావితం చేసుకుంటారు. భాష, మనస్తత్వాలు, రుచులు, అభిరుచులు, నీతులు, రీతులూ వీటన్నిటినీ ఇచ్చి పుచ్చుకుంటూ ఉంటారు. ఆ ఇచ్చి పుచ్చుకోవటాలు ఎంత ఎక్కువ జరిగితే ప్రజలకంత మంచిది. ఒక తరంలో జరిగిన సాంస్కృతిక ఆదాన ప్రదానాలు మరొకతరం వారికి అందించటం చాలా అవసరం. అలా అందకపోవటం వల్లా ఆధిపత్య సంస్కృతి అయిన వలస సంస్కృతి అన్నింటినీ మింగేయటం వల్లా మనం ఒకరికొకరం చాలా ఎడమయ్యాము. ఆ ఎడం ఇప్పటి పిల్లల విషయంలో ఇంకా పెరిగింది. ఆ ఎడాన్ని తగ్గించి ఒక వారధి నిర్మించటానికి ఇలాంటి ప్రయత్నాలు చాలా అవసరం. ఖదీర్‌బాబు దర్గామిట్ట కథలు, పోలేరమ్మ బండ కథలు ఆ పని చేశాయి. ఈ కథలు ఆ పనికి మరింత బలం చేకూరుస్తున్నాయి.

పెద్దవాళ్ళు కథలు చెప్పే అలవాటు క్రమంగా తగ్గుతున్నపుడు ఈ కథలు పూర్తిగా మరుగున మరపున పడటం తప్పదు. దానిని గమనించి ఈ కథలను అచ్చువేసి రక్షించాడు ఖదీర్. ఇది తెలుగు చదవగలిగిన అందరికీ మంచి కానుక. ఐతే ఇవి ఉర్దూలో, హిందీలో వస్తే మరింత మంచిది. ఇంగ్లీషులో వస్తే మంచిదే గానీ ఇంగ్లీషు పుస్తకాలు చదివే పిల్లలకు వీటి మీద ఎంత ఆసక్తి ఉంటుందనేది అనుమానమే. పైగా ఈ ప్రాంతీయతనూ, మాండలిక సౌందర్యాన్నీ ఇంగ్లీషులోకి తీసుకురాగలిగిన అనువాదకులు దొరకాలి.

త్వరలో ఇది ఉర్దూలోకి అనువాదమై ప్రాచుర్యం పొందాలని కోరుకుంటూ...

-ఓల్గా

# కతల ముందరి కథ

'పెద్దవాళ్లు జరిగిన సంగతులని కతల్లాగా చెప్తారు. కతలని జరిగిన సంగతుల్లాగా చెప్తారు. అదో విద్య' అన్నాడు ఉదయగిరిలో ఇబ్రాహీం అనే ఒక ముసలాయన.

ఆయన చాలాకాలం పాటు లారీడ్రైవర్‌గా పనిచేసి ఒంట్లో ఓపిక సన్నగిల్లాక యింటిపట్టునే ఉంటూ కూరగాయలు పండిస్తూ ఉన్నాడు.

ఒకప్పుడు ఆయన వారం రోజుల పాటు చెప్పిన కత మళ్లా చెప్పకుండా చెప్పేవాడంట.

'అన్ని కతలు వచ్చునాకు. డ్రైవర్‌ని కదా... దారిలో చాలామంది కలస్తా ఉండేవాళ్లు. పాతకాలం మనుషులం. కతలు కాకుండా యింకేం చెప్పుకునేవాళ్లం... కానీ ఇప్పుడు చాలామటుకు వాటిని మర్చిపోయానే' అన్నాడు దిగులుగా.

ఆ దిగులు కాసేపే. ఆ కాసేపటి తర్వాత పుంజుకొని, చాయ్ తాగి 'దాల్‌గోట్నీ దెబ్బ' కత మొదలుపెట్టాడాయన. ఆ తర్వాత 'జోమ్‌పూర్‌ఖాజీ', ఆ తర్వాత 'నిద్రనేది ఒకటి ఉంది కదా'... కతలు ఒక దాని కొనకు మరొకటి అంటుకుని రవ్వలు చిందుతూ ఉంటే ఆయన మొకంలో సంతోషం నవ్వు పరవశం...

ఆ ఊరిలోనే 'దేవల్‌గడ్డ' దగ్గర ఆడవాళ్లందరూ చుట్టు మూగినప్పుడు వాళ్ల మొకంలో కూడా మొదట దిగులే.

'ఇప్పుడెవరు చెప్పుకుంటున్నారు కతలు? అన్నీ మర్చిపోతిమే'... అని.

'ఫలానా ముసలామె... మొన్నటి దాకా బతికున్నింది. చాలా కతలు తెలుసు. ఆమె గనక ఉండుంటేనా'... అని నిట్టూర్పులు.

కానీ మరి కాసేపటి తర్వాత ఒకామె నెమ్మదిగా, బిడియం వదిలిపెడుతూ.. 'ఉత్‌రో ఉత్‌రో సావల్‌రాణి ఉత్‌రో ఉత్‌రోనా' అనే పాటను మొదలుపెట్టింది.

సముద్రంలో అలలు పుట్టిన కత అది.

ఆ తర్వాత తలా ఒక కత అందుకున్నారు.. సంతోషంగా చిన్నప్పుడంత సంబరంగా.

'మన ఇళ్లల్లో పిల్లలకు చెప్పుకునే కతలు కావాలి' అని నేను కావలికి వెళ్లి అడిగినప్పుడు చాలామంది ఆడవాళ్లు యిలాగే మొదట దిగులునూ ఆ తర్వాత సంతోషాన్నీ అనుభవించినవారే.

'ఇలా కతలు అడిగేవాళ్లుంటారా?' అని వాళ్లకు ఆశ్చర్యం.

'అవన్నీ పుస్తకంగా వస్తాయి. ఆ తర్వాత ఎవరూ మర్చిపోకుండా కొన్నయినా పడి ఉంటాయి' అని చెప్తే, అది వాళ్ల పని అన్నట్టుగా ఎంత హడావిడి చేశారో చెప్పలేను.

మా పుప్పు నజీర్‌బీ, మా పెదమ్మ కరీమున్ మొదట ఈ పనికి రెండు స్తంబాల్లాగా నిలబడ్డారు.

ఆ తర్వాత మా చెల్లెలు గౌహర్ అప్ష, నెల్లూరులోని మా మేనత్త కూతురు హమ్‌రాజ్, మా అమ్మకి చెల్లెలి వరస అయ్యే రోషన్, కసాబ్‌గల్లీలో మేము పక్క పక్కనే ఉండొచ్చిన ఖుర్షీద్ ఆపా... ఉదయగిరి, బిట్రగుంట, నెల్లూరు, గూడూరులలో ముక్కూ మొకం ఎరగని ఆడవాళ్లు... ఎందరో ఈ పనికి హుషారుగా ముందుకొచ్చి ఈ పుస్తకం కోసం కలిసి పని చేశారు. ఈ కతలను మూటగట్టి

ుచ్చారు. ఇది వాళ్ల పెన్నిధి.

ఈ కతలను సేకరించడానికి పెద్ద నేపథ్యం ఏమీ లేదు.

నాకు కతలంటే ఆసక్తి ఉండటం వల్ల, పిల్లలంటే యిష్టం ఉండటం వల్ల, ఆదివారం ఆంధ్రజ్యోతి పిల్లల పేజీలో పిల్లలు వచ్చీరాక రాసి పంపిన కతలు చాలా వాటిని నేను రీరైట్ చేయడం వల్ల నాకు పిల్లలు ఏ కతలు చదువుతున్నారో వాళ్లకు ఏ కతలు తెలుస్తున్నాయో చూచాయగా తెలిసేది.

చాలామటుకు పంచతంత్రం, తెనాలి రామలింగని కతలు, అక్బర్-బీర్బల్ కతలు, నసీరుద్దీన్ కతలు లేదా బహుళ ప్రాచుర్యంలో ఉన్న ఇతరేతర కతలు తరచూ నాకు కనిపించేవి.

'ఇలాంటి కతలే మా యిళ్లల్లో కూడా చెప్పుకునేవారు కదా. వాటిని ఎవరూ రాసి పంపరే' అనుకునేవాణ్ణి.

ఆ ఆలోచన నుంచి పుట్టినదే ఈ ప్రయత్నం.

ముస్లింలు ఈ దేశ పౌరులు. ఈ మట్టి బిడ్డలు. ఈ దేశ సాంస్కృతిక సంపదని దానితోపాటు ప్రపంచ సాంస్కృతిక సంపదని, జానపద సంపదని వాళ్లు కూడా వాళ్లకు చేతనైన పద్ధతిలో పదిలపర్చుకుంటూ వస్తుంటారు.

కానీ జానపద పరిశోధనా రంగంలో, ముఖ్యంగా తెలుగులో 'ముస్లింలను కూడా ఈ విషయంలో కన్సిడర్ చేయాలి' అనే ప్రయత్నం కనిపించదు.

తెలుగులో ఆయా జిల్లాల నుంచి జరిగిన 'జానపద కథా సేకరణ'ల్లో ముస్లింల గడప తొక్కి కతలు అడిగిన వారు ఉన్నారని నేను అనుకోను. కనీసం నా తక్కువ పరిజ్ఞానంలో, నేను పరిశీలించిన గ్రంథాలలో అలాంటి ప్రయత్నం నేను చూడలేదు. అలాంటి పని ఇకముందైనా జరుగుతుందో లేదో తెలియదు.

చిన్నప్పుడు మా దాదీ చెప్పిన కతలు, ఆమె కడుపున పుట్టిన మా పుప్పు (మేనత్త) వాటిని గుర్తుపెట్టుకొని చెప్పిన కతలు, మా పెదమ్మ చెప్పిన కతలు, యింకా మా యిళ్లల్లో మా ఆడవాళ్లు పిల్లలకు చెప్పే కతలు... అన్నింటినీ గమనిస్తే నాకొక సంగతి అర్థమయ్యింది.

మా యిళ్లల్లో యీ కతలు మాత్రమే చెప్పుకుంటారు. బయట ఎంత ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ కొన్ని కతలు పొరపాటున కూడా చెప్పుకోరు.

'ఒక రాజుకి ఏడుగురు కొడుకులు. వారు వేటకు వెళ్లారు. చేపలు తెచ్చారు. ఒక చేప ఎండలేదు'... ఈ కత మొత్తం మా జిల్లాలో మా యిళ్లల్లో ఒక్కరు కూడా ఎత్తరు. 'ఆవు-పులి' కత అస్సలు చెప్పరు. అల్లావుద్దీన్, బాగ్దాద్ గజదొంగ, ఆలీబాబా... ఇలాంటి మాటలు కూడా వినిపించవు.

కత చెప్పమంటే 'ఏక్ గావ్ మే ఏక్ బాషా థా' అని మొదలుపెడతారు.

ఈ పుస్తకంలో నలభై పై చిలుకు కతలు వున్నాయి. వీటికి రకరకాల వెర్షన్‌లు, మార్పుచేర్పులు విన్నాను తప్ప... వేరే కొత్త కతలు నేను వినలేదు. కొందరు మాత్రం కొన్ని నిషిద్ధ (టబూ) కతలు చెప్పారు. కొందరు అన్యమతస్తులపై సరదాగా జోకులు వేసే కతలు చెప్పారు. మరికొందరు ఆడవాళ్లు మాత్రమే ఒకరికొకరు చెప్పుకోవాల్సిన కతలు చెప్పారు. వాటిని నేను యిక్కడ రాయలేదు. కొందరు హాస్యం-అసభ్యతా కలగలిసిన కథలు చెప్పారు. వాటిని కూడా రాయలేదు. అవన్నీ మరో పాతిక ముప్ఫయి ఉన్నాయి. సుదీర్ఘమైనవి వేరే.

నేను పరిశోధకుణ్ణి కాను. తులనాత్మక విమర్శకుణ్ణి అంతకన్నా కాను. కాబట్టి ఈ కతల మూలాలను, ఈ కతల ఉనికిని, ఇవి మాత్రమే మా దగ్గర ఎందుకు ఉన్నాయన్న కారణాలను తెలుసుకోవాలని పెద్దలను కోరుతున్నాను. ఇవి బయట ఉన్న కతలకు ఏ మేరకు భిన్నమో, ఒకవేళ భిన్నం కాకపోతే ఏ విధంగా అడాప్ట్ అయ్యాయో, ఏవి ఉమ్మడిగా ఉన్నాయో, ఏవి లేవో, ఎందుకు లేవో తెలుసుకోవడం కూడా అవసరమే అని నాకు అనిపిస్తోంది.

ఈ కతల సేకరణలో కొన్ని గమ్మత్తు అనుభవాలు ఉన్నాయి.

కతలకూ, వయసుకూ సంబంధం లేదని నేను మొదట తెలుసుకున్న పాఠం. ఎంత ముసలివాళ్ల దగ్గరకు వెళ్లి అడిగినా 'కతలా? అవి పెద్దవాళ్లకి తెలుసు. మనకేం తెలుసు?' అనేవారు. వాళ్లకంటే పెద్దవాళ్లెవరో నాకు అర్థమయ్యేది కాదు. కానీ మన పక్కనే ఉండే పిల్లలు కొందరు టకామని కతలు చెప్పేయడం చూశాను. నెల్లూరు వెంకటేశ్వరపాలెంలో కతల కోసం తిరుగుతున్నప్పుడు ఒక పదేళ్ల పాప వచ్చి 'ఎవరు పైల్వాను' కత చెప్పేసి పోయింది. ఆ పాప లేకపోతే ఈ సంకలనంలో అంత మంచి కత ఉండుండేది కాదు.

కతలు ఎవరికి తెలుసు? అని కనిపెట్టడం కూడా కష్టమే. మనం ఊరూరా తిరుగుతూ ఉంటాం కాని చాటెడన్ని కతలు తెలిసిన మనిషి మన పక్కింట్లోనే ఉండొచ్చు. ఇదో పెద్ద ఇబ్బంది. పండితులంటే ఇంటి బయట బోర్డు రాసుకొని ఉంటారు. కానీ కతలు తెలిసిన మహా మహా జానపద పండితులు ఎక్కడో సైకిల్‌షాపున పంక్చర్లు వేసుకుంటూ, వంట చేసుకుంటూ, పూలు కోసుకుంటూ ఉండి- ఉంటారు. వాళ్లను చేరినప్పుడే ఇటువంటి ప్రయత్నాలకు ధన్యత.

నిజానికి ఈ పనిని మరోసారి ఎవరైనా ఆడవాళ్లు చేస్తే మరికొన్ని కతలు బయటపడతాయని నాకు అనిపిస్తూ ఉంది. ఎందుకంటే నేను ముస్లింనే అయినా, కుర్రవాడినే అయినా చాలామంది దాదీలు, నానీలు నన్ను వాళ్ల యిళ్లల్లోకి రానివ్వలేదు. గోషా వల్ల, మగవాడి ముందుకొచ్చి కతలు చెప్పడం అంత మంచి పద్ధతి కాదనుకోవడం వల్ల వాళ్ల దగ్గర ఉన్న కతల అష్రఫీలతో ఈ సంకలనానికి మరింత విలువను తీసుకురాలేకపోయాను.

ఇది పెద్ద లాస్. నన్ను బాధపెట్టిన సంగతి. మరికొన్ని చోట్ల భార్యలు కతలు చెప్పకుండా వాళ్ల భర్తలు అడ్డం పడ్డారు పాపం ఆ ఆడవాళ్లు ఎంత ఉత్సాహంగా ఉన్నా సరే.

ఈ చిన్న చిన్న యిబ్బందులలో నుంచి, నాకున్న కుతూహలంలో నుంచి ఈ కతలను సేకరించి ఈ సంకలనానికి రూపుదిద్ది మీ ముందుకు తీసుకువస్తున్నాను.

కతలు చెప్పినప్పుడు వింటాం. రాసినప్పుడు చదువుతాం. రాసిన కతలు చదవడానికి అనుకూలంగా ఉండాలన్నది నా అభిప్రాయం. పెద్దలు చెప్పింది చెప్పినట్టు రాయడం అసాధ్యం. ఎంత మంచి రచయిత అయినా వారి కాలిగోటికి సరికాడు. కత చెప్పేటప్పుడు వాళ్ల గొంతు, అభినయం, ధ్వని, చమత్కారం రాయడంలో ఎవ్వరూ తీసుకొని రాలేరు. అందువల్ల ఆ కతల సారాంశం, రూపం వీలైనంత చెడకుండా చదవడానికి అనువుగా తీసుకొని వచ్చినప్పుడే అవి అందరికీ అందుతాయన్న దృష్టితో ఈ కతలను రాశాను.

మేము ఉర్దూలో మాట్లాడుకుంటాం కాబట్టి మా కతలను ఉర్దూలోనే చెప్తారు కాబట్టి వాటిని తెలుగులో రాయడం మరో పెద్ద చిక్కు. ముస్లిం పదాలు మధ్య మధ్యన పెట్టి సినిమా ముస్లిం భాషను వాడడం నాకు పెద్దగా యిష్టం ఉండదు. అందుకని ఎక్కువ తెలుగునే వాడాను.

వీటి నిజమైన అందం సౌందర్యం వీటిని మౌఖిక ఉర్దూలో/ పామర ఉర్దూలో రాసినప్పుడు, విన్నప్పుడు తెలుసుకోగలరు.

ఈ సేకరణ, సంకలనం తొలిసారిగా తెలుగులో జరిగినదంటే అందుకు అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ కారణం. ఆంధ్రజ్యోతి ఆగిపోయినప్పుడు, ఆ తర్వాత నేను పనిచేసిన నీహార్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ మూలపడినప్పుడు ఏర్పడిన ఖాళీని నిరుద్యోగాన్ని తొమ్మిది నెలల ఈ ప్రాజెక్టు ఇచ్చి, ఖర్చులు భరించి, ఈ సంతోషకరమైన పనిని నాచేత చేయించి భర్తీ చేశారు అస్మిత వాళ్లు. ఒక రచయితకు ఇంతకంటే మంచి అవకాశం ఏం కావాలి? ఇందుకు నేను వారిని మర్చిపోలేను.

అలాగే మోహన్‌ని కూడా.

ఈ పుస్తకాన్ని ఈ కతలను ఆయన బొమ్మలు లేకుండా ఊహించలేము.

ఇంకా చాలామంది మిత్రులు ఉన్నారు. మొదట్లో వీటిని చదివి సూచనలు, సలహాలు ఇచ్చిన దగ్గరివాళ్లు ఉన్నారు. పేరు పేరున గుర్తు చేసుకోవాల్సిన వాళ్లు ఉన్నారు. వారందరికీ సలాములు తెలియచేసుకుంటున్నాను.

ఈ మొదటి ప్రయత్నాన్ని - నెల్లూరు జిల్లా ముస్లిం స్త్రీలు, పిల్లలు, యువతీ యువకులు, వృద్ధులు, అస్మిత, నేను, మోహన్ కలిసి చేసిన ఈ పనిని సహృదయంతో పరిశీలించి ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

పిల్లలకు ఈ కతలు చేరినప్పుడు, మరిచిపోయిన ఇలాంటి కతలు పెద్దవారి పెదాల మీద పలికినప్పుడు 'జరిగిన సంగతులను కతలుగా, కతలను జరిగిన సంగతులుగా చెప్పే విద్యకు' కాసింత భరోసా దొరుకుతుందని ఆశిస్తాను.

సలాములతో

మహమ్మద్ ఖదీర్‌బాబు

11 ఆగస్టు 2004





# కతల ఖజానా


బకాణీరాజుది బలే తమాషా ✦ 12
జింకమ్మా జింకమ్మా ✦ 15
సెబ్భాష్ రాజుగారు ✦ 17
సుబుర్ బాషా ✦ 18
గుత్తి వంకాయ కూర ✦ 22
నిద్రనేది ఒకటి ఉందిగదా ✦ 24
అల్లాకె నామ్ పె ఖైరాత్ కర్ ✦ 26
దే పెత్నీ ✦ 29
నక్కసాయెబు - నక్క బీబీ ✦ 34
నక్టామామూ ✦ 36
ఆకలి - ఆపిల్ పండు ✦ 40
ఫలాతున్ పిచుక కథ ✦ 43
హమ్‌న హలాల్ తుమ్‌న హరామ్ ✦ 44
మూడు ఖర్చులు ✦ 47
తైమూరు రాజు - చీమ ✦ 48
యా బలఖ్ యా బాషా ✦ 50
ఎంత చేసుకుంటే అంత ✦ 53
భర్రున ఎగిరిపోయిందోచ్ ✦ 54
మనుషుల కథ పిల్లినే అడగాలి ✦ 56
ఎక్కడి నుంచి రాకడ? ఎక్కడికి పోకడ? ✦ 59
మఛిలీ బందర్ బాషా ✦ 60
ఎవరు పైల్వాను? ✦ 64
షర్ఫుద్దీన్ ✦ 67
మిర్జారాజా ✦ 68
కొంచెం అంటే ఎలా కుదురుతుంది ✦ 72
భాయ్ ఖీర్ ✦ 74
ఖలీఫా గారికి ఒకటవ పాఠం ✦ 76
ఏడుగురు అన్నలకు ఒకే చెల్లెలు ✦ 78
ఖలీఫా గారికి రెండవ పాఠం ✦ 81
షారమ్మ ✦ 82
చార్ ఖస్‌రత్ కె ఇన్‌సాన్ ✦ 85
దాల్‌గోట్నీ దెబ్బ ✦ 86
ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి ✦ 88
హసన్ హబ్బాల్ ✦ 91
నెత్తిమీద గట్టిగా మూడు మొట్టు ✦ 94
పరేస్తాన్ కా పరా ✦ 96
తెలివి కతలు ✦ 101
ముందు పనసకాయ ఇలా లేదు ✦ 102
అమ్మ ఇంటి బూడిద ✦ 104
ప్రవక్త చెప్పిన కథ ✦ 106
కాన్ కరేలా ✦ 108
రెండోపిట్ట ✦ 110
బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్ ✦ 112
జోమ్‌పూర్ ఖాజీ ✦ 114



# బఠాణిరాజుది బలే తమాషా

ఒకడు పరమ సోంబేరి, పరమ పనిదొంగ, కూటికి కూడా గతిలేని పరమ బికారి.

వాడు ఒకరోజు ఒక ఊరి నుంచి యింకో ఊరికి పోతూ వున్నాడు. ఆ పోవడం కూడా చాలా బాధగా పోతూ వున్నాడు. బాధ ఎందుకంటే ఆ ఊరికి వెళ్ళి పని చెయ్యాలి. పనంటే ఎవరికైనా బాధే గదా.

ఆ బాధతో దిక్కులు చూస్తా పోతా ఉంటే దారిలో వాడికి ఒక పచ్చి బఠాణిగింజ దొరికింది. వంగి దానిని తీసుకున్నాడు. పరీక్షించి చూసి ఆలోచనలో పడ్డాడు.

ఇంక వాడు ముందుకు కదల్లేదు. ఆలోచనలు మాత్రం చాలా దూరం కదిలాయి.

"యిప్పుడు పక్కూరికి వెళ్లి ఒకరి కింద పని చేయడం ఎందుకు? అది కూడా చిల్లర డబ్బులకి? యిప్పుడు యీ బఠాణిగింజ మన దగ్గర ఉంది. దీన్ని తీసుకెళ్లి భూమిలో నాటుతాను. అది పెరిగి పెద్దదయ్యి యింకెన్నో బఠాణి గింజలనిస్తుంది. వాటన్నింటిని కలిపి మళ్లీ నాటుతాను. మళ్లీ కాపొస్తుంది. ఆ కాపుని మళ్లీ పంట వేస్తాను. యింక అలా కాపు మీద కాపు, కాపు మీద కాపు, కాపు మీద కాపు వేసీ వేసీ వేసీ వందల వేల లక్షల బస్తాల బఠాణి గింజల్ని చేస్తాను. వాటితో వ్యాపారం చేస్తాను. విదేశాలకు ఎగుమతి చేస్తాను. అవును... విదేశాలకు ఎగుమతి చేస్తే యింకా ఎక్కువ డబ్బులు వస్తాయి. కానీ ఎగుమతి చేయాలంటే మనకు ఓడలు కావాలి. సరే యింత వ్యాపారం అన్నాక ఓడలు కొనకపోతే ఎలా? ఓడలు కొందాం. ఎన్ని కొందాం? ఒక అరడజను. నిజానికి అవి సరిపోవుగానీ ప్రస్తుతానికి అరడజను చాలు. కానీ ఓడలు ఎక్కడ ఉంటాయి? రాజుగారి దగ్గర. ముందే ఓడలు మాట్లాడుకుంటే మంచిది. తీరా రేపు కాపు చేతికొచ్చాక ఓడలు దొరకాలంటే దొరక్కపోవచ్చు. దొరక్కపోతే సరుకు పాడయ్యి నష్టం వస్తుంది. అమ్మో నష్టం వస్తే యింకేమైనా ఉందా. వెంటనే వెళ్లి రాజుగారి దగ్గర ఓడలకు ఆర్డరు యివ్వాలి" అని వెళ్లాల్సిన ఊరి సంగతి పక్కన పెట్టి, జేబులో బఠాణి గింజ వేసుకొని ఉత్తపుణ్యాం వ్యాపారానికి గబగబా రాజుగారి దగ్గరకు బయలుదేరాడు.

'జహాపనా. నా సత్తాకు మీ సత్తానే తగును. నా వ్యాపారానికి మీ సరంజామే సమఉజ్జీ. నాకు అర్జెంటుగా అరడజను ఓడలు కావాలి. చెప్పండి. ఎన్ని రోజుల్లో యివ్వగలరు? ఎంతకు యివ్వగలరు? రేటు నన్ను చెప్పమంటారా? మీరు చెబుతారా? డబ్బులు యిప్పుడు తీసుకుంటారా? తర్వాత యిమ్మంటారా? ఎట్లయినా సరే. ఎలాగయినా సరే. అర్జెంట్' అన్నాడు.

రాజుగారు బిత్తరపోయారు. అంత పెద్ద రాజుగారి దగ్గరే ఒక్క ఓడ వుంది. అట్లాంటిది అరడజను ఓడలు కావాలంటున్నాడంటే వీడెంత



పెద్ద వ్యాపారస్తుడో, వీడు ఏ దేశపు ధనవంతుడో అని రాజుగారికి కంగారు పుట్టింది. మరోవైపు వాడి చిరిగిన బట్టలు, రేగిన జుట్టూ, మాటా, వాలకం చూసి అనుమానం కూడా వచ్చింది.

మంత్రిని పిలిచి గుసగుసగా 'ఏమయ్యా. వీడి వాలకం చూస్తే నాకు అనుమానంగా ఉంది. కానీ ఆ సంగతి పైకి అడిగితే, వాడు నిజమైన పెద్ద వ్యాపారస్థుడైతే మన బేరం చెడుతుంది. ఏం చేద్దాం' అన్నాడు.

'జహాపనా. కొందరు బాగా డబ్బున్నోళ్లు యిలాగే పిచ్చివాళ్లులాగా ఉంటారు. వాళ్లు తిండికీ గుడ్డకూ పెద్దగా విలువ యివ్వరు. చూడబోతే యితను చాలా ఐశ్వర్యవంతుడిలా ఉన్నాడు. కొన్నాళ్లు మన దగ్గర ఆతిథ్యం యిచ్చి సంగతి కనుక్కుందాం' అన్నాడు మంత్రి.

రాజుగారు అలాగే అనేసి, 'మిత్రమా. ఓడల సంగతి తర్వాత ఆలోచిద్దాం. ముందు మీరు మా ఆతిథ్యం స్వీకరించండి' అన్నారు బఠాణీవాడితో.

'అలాగే. కానీ ఓడల సంగతి త్వరగా తేలాలి. అవతల ముఖ్యమైన పనులున్నాయి' అని పరిచారికలతో విడిదికి వెళ్లిపోయాడు బఠాణీవాడు.

ఆ రాత్రి రాజుగారికి మంత్రి మంచి ఉపాయం చెప్పాడు.

'జహాపనా. యివాళ వ్యాపారస్తుడి పక్కను కఠినంగా వేద్దాం. చింకిచాప మీద పాతగుడ్డ పీలికలని పరుద్దాం. వాడు నిజమైన ఐశ్వర్యవంతుడైతే అలాంటి పక్క మీద నిద్రపట్టదు. రాత్రంతా మెలకువగానే ఉంటాడు' అన్నాడు.

రాజుగారు 'భేష్' అని మెచ్చుకున్నారు మంత్రిని. చెప్పినట్లే ఏర్పాట్లు జరిగాయి.

ఆ రాత్రి బఠాణీవాడొచ్చి అలా చింకిచాప మీద వాలాడో లేదో వాడి జేబులో నుంచి బఠాణీగింజ ఎక్కడో జారిపోయింది. యిన్ని లక్షల, యిన్ని కోట్ల వ్యాపారానికి కీలకం అదేగదా. అది పోతే ఎలా అని కంగారుపడిపోయి రాత్రంతా పక్క కెలుకుతూ, గుడ్డపీలికలను విదిలిస్తూ వెతుక్కుంటూనే ఉండిపోయాడు బఠాణీవాడు.

భటులు యిదంతా గమనించి 'ప్రభూ. వాడు నిజంగానే ఐశ్వర్యవంతుడు. రాత్రంతా కంటి మీద రెప్పే మూయలేదు' అన్నారు మంత్రితో.

మంత్రి సంతోషించి ఎందుకైనా మంచిదని మరో ఉపాయం పన్నాడు.

మరుసటిరోజు పట్టు పరుపుల పక్క ఏర్పాటు చేసి 'జహాపనా. వీడు నిజంగా పేదవాడైతే పట్టు పరుపుల మీద చంపి పడేసినా నిద్రపోలేడు' అన్నాడు రాజుగారితో.

శబ్బాష్ అన్నారు రాజుగారు మళ్లీ.

కానీ ఆ ముందురోజు రాత్రంతా మనవాడు బఠాణీగింజను వెతుక్కుంటూ అలసిపోయి ఉన్నాడు గదా, అందుకని ఆ రోజు అది పట్టుపరుపా, రాతి నేలా అనేది చూడకుండా దన్‌మని వాలగానే నిద్రపోయాడు.

అది చూసి 'చూశారా మహారాజా. వీడెంత ఐశ్వర్యవంతుడు కాకపోతే పట్టుపరుపు మీద వాలగానే పండుకుండిపోతాడు' అన్నాడు మంత్రి.

యింక పరీక్షలు కట్టిపెట్టాలి అని లెంపలేసుకున్నారు యిద్దరూ.

ఆ మరుసటిరోజు రాజుగారు బఠాణీవాణ్ణి నిండు కొలువులో సన్మానించి 'మిత్రమా. మీలాంటి మహానుభావులు, గొప్పవారు, సామ్రాజ్యాలను కొనగల ఐశ్వర్యవంతులు మా ఆతిథ్యం స్వీకరించడమే మా అదృష్టం. వియ్యానికైనా కయ్యానికైనా సమఉజ్జీ ఉండాలంటారు పెద్దలు. నేను మీకు సమఉజ్జీని కాకపోయినా నా కుమార్తెను మీకిచ్చి కట్టబెట్టాలని అనుకుంటున్నాను. నా కోరికను కాదనక ఈ పేదవాణ్ణి కనికరించండి' అని వేడుకున్నాడు.


వేడుకోవడమే గాదు, ఆలస్యమైతే బఠాణీవాడి మనసు ఎక్కడ మారుతుందోనని అప్పటికప్పుడు నిఖా కూడా జరిపించేశాడు.

యింక అప్పటి నుంచి బఠాణీవాడు ఓడల సంగతి మరిచి హాయిగా రాజుగారు పెట్టింది తింటూ జల్సా చేస్తూ ఉండిపోయాడు.

రాజుగారికి కొన్నాళ్లకు అనుమానం వచ్చి 'అల్లుడుగారూ. మీరేదో వ్యాపారం అన్నారు. ఓడలు అన్నారు. ఆ సంగతి మరిచి యిక్కడే ఉంటే వ్యాపారం ఏంగాను?' అన్నారు.

'యింకేమి వ్యాపారం మామగారూ. ఆ అవసరం లేదు. నాకో బఠాణీగింజ దొరికింది. దానితో కాపు మీద కాపు, కాపు మీద కాపు, కాపు మీద కాపు వేసి లక్షల వేల ఎకరాలలో పంట పండించి వ్యాపారం చేద్దామనుకున్నాను. కానీ యిదంతా దేనికోసం? డబ్బుకోసం. మీ అమ్మాయిని చేసుకున్నాక ఆ అవసరం తీరిపోయింది. యింక నాకు వ్యాపారం అవసరం లేదు. యిదిగోండి కావాలంటే ఆ వ్యాపారం మీరు చేయండి' అని జేబులో ఉన్న బఠాణీ గింజని రాజుగారి చేతిలో పెట్టాడు బఠాణీవాడు.

పాపం రాజుగారు.



# జింకమ్మా జింకమ్మా

ఒక జింకమ్మకు చూలు వచ్చి నెలలు నిండాయి. నెలలు నిండాక కాన్పుకు సిద్ధం కావాలి గదా. అందుకని జింకమ్మ అడవిలో నుంచి కాస్త బయటికొచ్చి బాట మీద నిలబడింది. దూరంగా ఒక రైతు చెరుకు గడలని బండి మీద వేసుకొని వస్తూ కనిపించాడు.

అది చూసి జింకమ్మ బాటకు వెళ్లి అడ్డంగా పడుకుంది. అది చూసి రైతు, కడుపుతో వున్న జింకమ్మతో -

'జింకమ్మా జింకమ్మా నా బండి తగిలేనూ నీ పొట్ట పగిలేనూ

నాకు పాపమంటేనూ తప్పుకో తప్పుకో'.. అన్నాడు.

అప్పుడు జింకమ్మ 'నేను తప్పుకోవాలంటే నాకు నాలుగు చెరుకుగడలు యివ్వు' అంది.

సరే అని యిచ్చాడు రైతు.

కాసేపటికి మళ్లీ ఆ బాట గుండా ఒక చాకలోడు చాకలిగుడ్డలు వేసుకొని బండి మీద వస్తున్నాడు. అది చూసి జింకమ్మ బాటకు వెళ్లి అడ్డంగా పడుకుంది. అప్పుడు చాకలోడు, కడుపుతో వున్న జింకమ్మతో -

'జింకమ్మా జింకమ్మా నా బండి తగిలేనూ నీ పొట్ట పగిలేనూ

నాకు పాపమంటేనూ తప్పుకో తప్పుకో' అన్నాడు.

అప్పుడు జింకమ్మ 'నేను తప్పుకోవాలంటే నీ దగ్గరున్న నాలుగు గుడ్డముక్కలు యివ్వు' అంది.

సరే అని యిచ్చాడు చాకలోడు.

ఆ చెరుకుగడలతో, ఈ గుడ్డముక్కలతో నేరుగా అడవిలోకి పరిగెత్తింది జింకమ్మ. పరిగెత్తి నాలుగు చెరుకుగడలను నాలుగు వైపులా పాతి, నాలుగు గుడ్డముక్కలను నాలుగు దిక్కులా చాటు కట్టి యిల్లు చేసుకుంది. చేసుకొని హాయిగా లోపల కూర్చుంది. కాసేపయ్యాక దానికి నొప్పులొచ్చాయి. పండంటి యిద్దరు మగబిడ్డలు కలిగారు.

పుట్టగానే వాటికై అవి వెళ్లి ఆహారం తెచ్చుకోలేవు కదా. అందుకని బాలింతరాలైన జింకమ్మ బిడ్డల ఆహారం కోసం బయటకు

బయలుదేరింది. వెళుతూ వెళుతూ బిడ్డలతో 'నాయనలారా. రోజులసలే మంచివిగావు. పుణ్యాత్ములను మింగే పాపాత్ములుంటారు. ఎవరికి పడితే వాళ్లకు తలుపులు తీయబాకండి. నేనొచ్చి పాట పాడుతాను. ఆ పాట వింటేనే తలుపు తీయండి' అని చెప్పింది.

'ఏం పాట?' అని అడిగాయి బిడ్డలు.

'చెరుకుగడలే గుంజలు

చాకలిగుడ్డలే పైకప్పు

టిప్పుసుల్తాన్ తలుపుతియ్యి... యిదీ పాట. ఈ పాట వింటేనే తలుపు తీయండి' అని వెళ్లిపోయింది జింకమ్మ.

ఇదంతా చాటుగా వింటున్న ఒక నక్క దొరికిందిరా చాన్సు అనుకొని జింకమ్మ అటుపోంగానే ఆమె యింటి దగ్గరకు చేరింది. చేరి -

'చెరుకుగడలే గుంజలు

చాకలిగుడ్డలే పైకప్పు

టిప్పుసుల్తాన్ తలుపు తియ్యి' ... అని పాడింది.

ఆ పాట విని 'అమ్మొచ్చింది అమ్మొచ్చింది' అని తలుపు తీయబోయింది ఒక బిడ్డ.

అప్పుడు యింకోబిడ్డ ఆపింది.

'ఒరే. యిది అమ్మ గొంతులా లేదు. ఎవరో మాయావి. తలుపు తీస్తే మనం అయిపోతాం. వద్దురా' అంది.

అప్పుడు ఆ బిడ్డ 'నీ మొహం. ఈ పాట అమ్మకు తప్ప యింకెవ్వరికీ తెలియదు. తప్పుకో తప్పుకో' అని తలుపు దగ్గరకు వెళ్లి గడియ తీసీ తీసే లోపు జపక్‌మని దానిని నోట కరిచి పారిపోయింది నక్క. పారిపోయి నేరుగా యింటికి తీసుకెళ్లింది ఆ బిడ్డను. తీసుకెళ్లి కమ్మగా తినబోయింది.

అప్పుడా బిడ్డ తెలివి తెచ్చుకొని 'నక్కమ్మా నక్కమ్మా. నాతోపాటు పుట్టిన నా సోదరుడొకడున్నాడు. వాడు ఉత్త అమాయకుడు. వాణ్ణి కూడా నువ్వు పట్టుకొని రా. యిద్దరం కలిసి పుట్టాము. యిద్దరం కలిసి చస్తాము' అంది నక్కతో.

అయితే సరే అని నక్క మళ్లీ జింకమ్మ యింటికి వచ్చింది. వచ్చి -

'చెరుకుగడలే గుంజలు

చాకలి గుడ్డలే పైకప్పు

టిప్పుసుల్తాన్ తలుపు తియ్యి' అని పాడింది.

అప్పటికే తమ్ముడికోసం ఆలోచన చేస్తున్న రెండో బిడ్డ ఆ పాట విని, ఓహో నక్కమ్మ మళ్లీ వచ్చింది అనుకొని ఏమీ ఎరగనట్టుగా వెళ్లి తలుపు తీసింది. అది అట్లా తీసీ తీయగానే మళ్లా జపక్‌మని పట్టి తీసుకెళ్లిపోయింది నక్క.

యిప్పుడు అన్నదమ్ములిద్దరూ ఒకచోట చేరారు. చేరి, నక్కతో 'నక్కమ్మా నక్కమ్మా. నీకు మేము ఏమి చాలుతాం? నిన్నగాక మొన్న పుట్టిన పసిగుడ్డులం. నీకు మా మాంసం మజ్జిగకూడుతో సమానం. అసలు భోజనం అంతా మా అమ్మే గదా. మా అమ్మను కూడా పిలుచుకొచ్చినావంటే కమ్మగా మా ముగ్గురినీ ఆరగించవచ్చు. అప్పుడు లెక్క సరిగా ఉంటుంది' అన్నాయి.

సరే అని చెప్పిన నక్క జింకమ్మను వెతుక్కుంటా పోయి 'నీ బిడ్డలు నా దగ్గర వున్నాయి. మర్యాదగా లొంగావంటే సరే సరి. లేకుంటే చూడు' అని బెదిరించింది.

అప్పటికే బిడ్డల మనసులో మర్మం తెలుసుకున్న జింకమ్మ నక్కతో పాటు నక్క యింటికి బయలుదేరింది. వాళ్లు వచ్చేలోపు పసిజింకలు బాగా కాళ్లూ చేతులూ కూడదీసుకుని ఆ గడ్డీ ఈ మేత నమిలి శక్తి తెచ్చుకుని కాచుకోని ఉన్నాయి. తల్లిని చూడగానే యింకేం భయం లేదు అనుకొని నక్క మీదకు ఒక్క దూకు దూకాయి. వెనుక నుంచి తల్లి కూడా ఒక్క కుమ్ము కుమ్మింది నక్కను. మూడూ కలిసి దానిని కుమ్మి కుమ్మి ప్రాణాలు తీశాయి. తీసి -

'చెరుకుగడలే గుంజలు చాకలి గుడ్డలే పైకప్పు

అడివంతా మా యిల్లు టిప్పుసుల్తాన్ మా రాజు'... అని పాడుకుంటూ వెళ్లిపోయాయి.



# సెబ్భాష్ రాజుగారు

ఒక రాజున్నాడు. దగ్గడు తుమ్మడు. జ్వరం వచ్చిందనేసి నాలుగు రోజులు ముసుగు తన్నడు. రాజనేవాడు చెడీబడీ తింటాడు... వేటకనీ యుద్ధాలకనీ తిరుగుతుంటాడు... అయినాగానీ ఒక్కసారి కూడా రోగమూ రొష్టూ అనడు... ఏందబ్బా అని అందరికీ బలే ఆశ్చర్యం.

రాజుని పుట్టినప్పటి నుంచి చూస్తున్న మంత్రి యింక ఉండబట్టలేక 'మహారాజా, ఏమి ఈ వింత? మీది ఒళ్లా? వజ్రమా? మన దర్బారులో ఎందరికో ఎన్నో రోగాలు వస్తుంటాయి పోతుంటాయి. కాని మీరు జీవితంలో ఒక్కసారైనా తలనొప్పి అని కూడా అనరు. ఈ రహస్యం ఏమిటి? నాకు చెప్పరా?' అని అడిగాడు.

అప్పుడు రాజు నవ్వి 'ఏం లేదు మంత్రిగారూ. యిందులో రహస్యం ఏమీ లేదు. నువ్వు రాజ్యాలు ఏలు. సింహాసనాల మీద కూర్చో. లేకుంటే కూలి పని చెయ్యి. కాకుంటే యింకే పనైనా చెయ్యి. కాని వేళకు యింత తినేస్తే రోగం నీవైపు చూడదు. యిప్పుడు నేనున్నాను గదా. పొద్దున్నే లేస్తా. ఫలానా టైములో నాష్టా చేస్తా. మధ్యాహ్నం దర్బారు ముగిస్తా. ఫలానా టైములో భోజనం చేస్తా. రాత్రికి మంతనాలు చాలిస్తా. ఫలానా టైములో తిని నిద్రపోతా. పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి ఈ నియమాన్ని ఒక్కరోజు కూడా తప్పలేదు. ఎంత రాచకార్యం వున్నా వేళకు భోజనం చెయ్యాలి. అదే ఆరోగ్యం' అన్నాడు.

మంత్రిగారికి మనసులో చిన్న తమాషా చేద్దామనిపించింది. ఈయన వేళకు తింటాడు గదా ఒక్కపూట ఆ వేళను తప్పిద్దాం ఏమవుతుందో చూద్దాం అనుకున్నాడు.

ఆ మరుసటిరోజు మధ్యాహ్నం పరిచారికలకు చెప్పి స్నానానికి వేడినీళ్లు ఆలస్యమయ్యేట్టు చేశాడు. స్నానాల గదికి చేరుకున్న రాజుగారు "ఏమిటి ఆలస్యం? అవతల భోజనానికి వేళవుతోంది?" అని కేకలు పెడుతున్నారు.

'అయిపోయింది మహారాజా. అయిపోయింది మహారాజా' అని కావాలని పరిచారికలు యింకాస్త ఆలస్యం చేసి గదిలో వేడినీళ్ళు పెట్టారు.

స్నానాల గదిలోకి రాజు వెళ్లేసరికి సరిగ్గా ఒంటిగంట. రోజూ ఆ టైముకి ఆయన స్నానం చేసేసి భోజనాల గదిలో వుంటారు. యిప్పుడేం చేయాలి? భోజనానికి ఐదు నిమిషాలు ఆలస్యమయ్యేట్టుందే అనుకున్న రాజు చాలా కంగారుపడి చుట్టూ చూశాడు.

ఉన్నట్టుండి ఆయన కంగారు తగ్గింది. ఆ తర్వాత హాయిగా స్నానం చేసి బయటకు వచ్చేశాడు. రెండు వారాలు గడిచాయి. యిదిగో జబ్బున పడతాడు, అదిగో జబ్బున పడతాడు అని ఎదురుచూసిన మంత్రి చివరకు విసిగిపోయి 'మహారాజా వేళకు ఆహారం తీసుకుంటే ఆరోగ్యం చెడదని మీరన్నారు. కానీ ఫలానా రోజున మధ్యాహ్నం పూట మీరు వేళతప్పి భోజనం చేశారు. మీరు చెప్పిన ప్రకారం ఈపాటికి మీ ఆరోగ్యం చెడాలి. చెడలేదు. అంటే మీరు చెప్పిందంతా అబద్ధమేనా?" అని అడిగాడు.

ఆ మాటకు రాజు నవ్వి 'భలేవాడివే మంత్రి. ఆ రోజు నేను వేళ ఎక్కడ తప్పాను? స్నానాల గదిలో నాకోసం మేలిమి రకమైన సున్నిపిండిని సిద్ధం చేసి వుంచారు గదా. నేను టయానికి ఆ సున్నిపిండిని తాగేశా. యింకేంది?' అన్నాడు.

ఆ సంగతి విని మంత్రి ఎంతో ఆశ్చర్యపోయాడు.

'అయితే మహారాజా మిమ్మల్ని ఆ దేవుడు కూడా ఏమీ చేయలేడు సెబ్భాష్' అని మెచ్చుకున్నాడు.



# సుబుర్ బాషా

ఒక రాజుగారికి ఏడుగురు కుమార్తెలు. వారి ఆలనాపాలనా అచ్చటా ముచ్చటా అంతా రాజుగారే దగ్గరుండి చూసుకునేవారు.

ఒకరోజు రాజుగారు ఆ ఏడుగురినీ పిలిచి, కబుర్లు చెబుతా, గారాబం చేస్తా 'ఏమ్మా. మీ అందరినీ యింత బాగా చూసుకుంటున్నది ఎవరు? మీరు కోరిందే తడవుగా కొండ మీది కోతినైనా దించి పెడ్తున్నది ఎవరు? మీరు తినడానికి పంచభక్ష్య పరమాణ్ణాలు వండిపెట్టిస్తున్నది ఎవరు? మీ ఒంటిని పట్టుబట్టలతో వజ్ర వైఢూర్యాలతో అలంకరించుకునే ఏర్పాటు చేసింది ఎవరు?' అని అడిగారు.

'మీరే గదా అబ్బాహుజూర్. మీరే మమ్మల్ని చూసుకుంటున్నది. మీరే మాకు తిండి పెడుతున్నది' అని ఏడుగురిలో మొదటి ఆరుగురూ సమాధానం చెప్పారు.

కానీ ఏడో కుమార్తె మాత్రం 'అదేమిటి అబ్బాహుజూర్. యిదంతా అల్లా యిచ్చింది. అల్లా సృష్టించింది. పైవాడు యివ్వకపోతే మీకు ఎక్కడిది. పైవాడు దయ చూపకపోతే మేము ఎక్కడి వాళ్లం. మీరు చేసినా చూసినా యిచ్చినా తీసుకున్నా అంతా పైవాడి దయవల్లే. అందువల్ల నన్ను పెంచుతున్నది మీరు కాదు అల్లా' అంది.

రాజుగారికి యింత పొడుగు వచ్చింది కోపం. వెంటనే భటుల్ని పిలిచి 'ఈ అమ్మిని తీసుకెళ్లి నట్టడవిలో విడిచిరండి. తినడానికి ఒక బస్తా రాగులు పడేసిరండి. చూద్దాం ఆ అల్లా ఈమెను ఎలా పెంచుతాడో' అన్నాడు.

భటులు వెంటనే ఏడో కుమార్తెని తీసుకెళ్లి అడవిలో వదిలేశారు.

అక్కడే ఆ కుమార్తె ఒక గుడిసె వేసుకొని, మూడు పూటలా రాగిరొట్టెలు తింటా, అయిదు పూటలా నమాజు చేసుకుంటా దేవుని ప్రార్థనలో రోజులు గడుపుతా ఉంది.

ఒకసారి రాజుగారు వర్తకానికి విదేశాలకు వెళ్లాల్సి వచ్చింది. వెళ్తా వెళ్తా ఆరుగురు కుమార్తెలను పిలిచి 'మీకేం తేవాలి? మీకేం తేవాలి?' అని అడిగి, వాళ్లు చెప్పినవి రాసుకుని బయలుదేరారు. అయితే ఆయన ఎక్కిన ఓడ ఎంతకీ లంగరు ఎత్తడం లేదు.

ఆ రోజుల్లో ఎవరైనా ఏదైనా మరిచిపోతే ఓడ లంగరు ఎత్తేది కాదంట. నేనేమైనా మరిచిపోయానా అని గుర్తు తెచ్చుకున్నారు రాజుగారు. ఆయనకు ఏడో కుమార్తె గుర్తుకొచ్చింది.

'ఓహో. నా ముఖానికి అదొకతి ఉంది గదా' అనుకొని నౌకర్లను పిలిచి 'ఆ ఏడోదాని కొంపకెళ్లి దానికి ఏం తేవాలో అడిగిరండి' అని పంపించాడు. నౌకర్లు ఆదరాబాదరాగా అడవికి వచ్చారు. అప్పుడు ఏడో కుమార్తె దైవప్రార్థనలో ఉంది.



నౌకర్లు గుడిసె బయట నుంచి 'అమ్మా. మీ అబ్బాహుజూర్ వర్తకానికి విదేశాలు వెళుతున్నారు. మీకు ఏం తెమ్మంటారో అడిగి రమ్మన్నారు' అన్నారు.

అప్పటికి ఏడో కుమార్తె సగం ప్రార్థనలో ఉంది. అందుకని 'సుబుర్' అంది ('కాస్త ఆగండి చెబుతాను' అని అర్థం).

'ఓహో! ఈమెకు సుబుర్ కావాలేమో' అని నౌకర్లు రాజుగారి దగ్గరకు వచ్చి 'మహారాజా. అమ్మాయిగారికి సుబుర్ కావాలంట' అని చెప్పారు. వెంటనే లంగరు ఎత్తింది. ఓడ బయలుదేరింది.

వర్తకంలో రాజు ఎక్కడెక్కడో తిరిగి ఆరుగురు కుమార్తెలకు కావలసినవన్నీ కొన్నాడుకానీ ఏడో కుమార్తె అడిగిన 'సుబుర్' మాత్రం ఆయనకు ఎక్కడా దొరక లేదు. ఎవర్ని అడిగినా 'సుబుర్ ఏంది? సుబుర్ ఏంది?' అని ఆశ్చర్యపోతున్నారు. అప్పుడాయనకు పాతకర్రల వ్యాపారం చేసుకుంటున్న ఒకతను కనిపించాడు.

రాజు వాడి దగ్గరకు పోయి 'నీ దగ్గర సుబుర్ ఉందా?' అని అడిగాడు. ఆ మాట విన్న వ్యాపారి రాజువంక చూసి వీడెవడో తిక్కలోడులాగున్నాడు అనుకొని ఒక పాత బెత్తాన్ని తీసి 'యిదే సుబుర్ అంటే. తీసుకెళ్లండి' అని యిచ్చాడు.

రాజు వెనక్కి తిరిగి వచ్చాడు. ఎవరి వస్తువు వారికి పంపించాడు. ఏడోకుమార్తెకు 'సుబుర్' యిచ్చి వెళ్లారు నౌకర్లు. ఆమె దాన్ని చూసి నవ్వుకొని మూల పడేసింది.

ఒకరోజు ఒక మేకల మంద అటుగా వచ్చి ఏడో కుమార్తె గుడిసె మీదపడి తాటాకులు తినబోయింది. అది చూసి వెరె వెరె అనుకున్న ఏడో కుమార్తె అనుకోకుండా మూలనున్న సుబుర్ బెత్తాన్ని తెచ్చి మేకల్ని బాదింది. బాదగానే ఆ బెత్తం రెండుగా విడిపోయి ఒక విసనకర్ర బయటపడింది. దాన్ని యిలా ఊపగానే కళ్లు మిరుమిట్లు గొలిపే ఒక అందగాడు ప్రత్యక్షమయ్యాడు.

ఆ పరాయి మగవాణ్ణి చూడగానే గోషాలోకి వెళ్లిపోయింది ఏడో కుమార్తె.

'సిగ్గుపడకు. నేను నీవాణ్ణి. నా పేరు సుబుర్ బాషా. మాది పరేస్తాన్ (గంధర్వదేశం)' అన్నాడు ఆ అందగాడు ఏడో కుమార్తెతో.

'నువ్వు ఈ విసనకర్రను యిలా ఊపితే ప్రత్యక్షమవుతాను. అలా ఊపితే వెళ్లిపోతాను' అని ఆమెకు చెప్పాడు.

అప్పటి నుంచి వాళ్లిద్దరూ అక్కడ ఆకూ పిందెలాగ కలిసిపోయి కాపరం చేస్తూ వున్నారు. వారి కాపురం వల్ల, ఆ గంధర్వుడి రాకపోకల వల్ల వాళ్లుంటున్న గుడిసెకు ఒక వింత వెలుగు వచ్చేసింది. అది అడవిలో ఛక్‌ఛక్‌మని మెరస్తా ఉంది.

ఇది యిట్లా వుండగా, ఒకనాడు రాజుగారి ఆరుగురు కూతుళ్లు మహల్ మీద నిలబడి అడవిలోకి చూశారు. చూస్తే ఏముందీ ఏడో చెల్లెలి గుడిసె ధగధగమని మెరిసిపోతా కనిపించింది.

'ఏమిటి ఈ వింత. ఈ ఏడోదాని కథేంటో కనుక్కుందాం పాండి' అని ఆరుగురు అక్కాచెల్లెళ్లూ ఒకరోజు సింగారించుకుని సవారించుకొని ఏడో చెల్లెలి దగ్గరకు వచ్చారు. వచ్చి ఆ మాట ఈ మాట చెప్పి, ఆ ప్రేమ ఈ ప్రేమ చూపి, ఆ ఏడుపూ ఈ ఏడుపూ ఏడ్చి 'చెల్లెలా. ఎలా ఉండేదానివి ఎలా అయిపోయావమ్మా' అని పొద్దుపోయినా కదలకుండా ఉండిపోయారు.

సరే అని వాళ్లకు పక్కలేసి, వాళ్లు నిద్రపోయారనుకుని, తన గదిలోకి వెళ్లి విసనకర్ర ఊపింది ఏడో చెల్లెలు. సుబుర్‌బాషా వచ్చాడు. వాళ్లిద్దరూ నవ్వుకుంటూ కబుర్లు మొదలెట్టారు.

యిదంతా చాటు నుంచి చూసిన ఆరుగురు అక్కచెల్లెళ్లకు కడుపులు కాలిపోయాయి.

'యింతటి అందగాణ్ణి మొగుడిగా చేసుకున్న ఈ ఏడోదాన్ని నాశనం చేయాలి' అనుకొని మరుసటి రోజు మహలుకు తిరిగి వెళుతూ, వాళ్ల చేతుల్లోని గాజులన్నీ పగలగొట్టి, నూరి, విషం కలిపి, సుబుర్ బాషా పడుకునే పక్కంతా పూసి వెళ్లిపోయారు. పాపం యిదంతా ఏడో చెల్లెలికి తెలియదు.

ఆ రాత్రి సుబుర్‌బాషా వచ్చి పక్కమీద మేను పరచగానే వళ్లంతా కచకచమని గాజు పలుకులన్నీ గుచ్చుకుపోయాయి. విషం ఎక్కిపోయింది. అల్లాడిపోయాడు సుబుర్‌బాషా.

'త్వరగా విసనకర్ర విసురు. మా దేశం వెళ్లిపోతాను' అనేసరికి విసనకర్ర విసిరింది భార్య. సుబుర్ బాషా ముక్కుతూ మూల్గుతూ వెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఎన్నిసార్లు విసనకర్ర ఊపినా రాలేదు. రావాలంటే ఎలా వస్తాడు? తీవ్రంగా జబ్బుపట్టి చావుబతుకుల్లో ఉంటే.

ఏడో కుమార్తె చూసీ చూసీ సుబుర్ బాషా కోసం మగాడి వేషం కట్టి దేశాటనకు బయలుదేరింది. ఆమె తిరిగీ తిరిగీ ఒకసారి ఒక చెట్టుకింద పడుకుంది. అప్పుడు ఆ చెట్టు కొమ్మమీద రెండు గువ్వలు వాలాయి.

'ఒసే ఒసే. జరిగింది చెప్పనా. జరిగేది చెప్పనా' అంది ఒక గువ్వ.

'జరిగింది అందరికీ తెలుసు. జరగబోయేది చెప్పు' అన్నది రెండో గువ్వ.

'యిదిగో ఈ చెట్టు కింద ఒక మగాడు పడుకొని వున్నాడే వాడు మగాడు కాదు. ఫలానా దేశపు రాజు ఏడో కుమార్తె. పరేస్తాన్ రాజకుమారుడైన సుబుర్ బాషాను పెళ్లి చేసుకుంది. కానీ ఈ మహాతల్లికి ఆరుగురు అక్కచెల్లెళ్లు వున్నారు. వాళ్ల పుణ్యామా అని సుబుర్‌బాషాకు ఒళ్లంతా విషం ఎక్కి పొట్టు లేచింది. వాణ్ణి వెతుక్కుంటూ ఈవిడ బయలుదేరింది' అన్నది మొదటి గువ్వ.

'మరి దానికి విరుగుడు' అంది రెండో గువ్వ.

'దానికి లోకంలో మందు లేదు. మన రెట్టే మందు. ఎప్పుడైతే మన రెట్టను తీసుకెళ్లి పూస్తారో అప్పుడే దానికి విరుగుడు' అని చెప్పి, రెట్ట వేసి అక్కడి నుంచి ఎగిరెళ్లిపోయాయి గువ్వలు.

యిదంతా మేల్కొని వింటున్న ఏడో కుమార్తె ఆ రెట్టని సేకరించుకుని కొంగులో చుట్టుకొని పరేస్తాన్‌కి బయలుదేరింది.

అక్కడకు చేరి, దాసరోళ్ల వేషం కట్టి 'మొండిరోగాలకు వైద్యం చేస్తాం. మొండి విషాలకు విరుగుడు యిస్తాం' అని కేకలేస్తూ తిరుగుతూ రాజమహలుకు చేరుకుంది.

అప్పటికే పరేస్తాన్‌లో ఎందరెందరో సుబుర్‌బాషా జబ్బు విరుగుడి కోసం ప్రయత్నించి ఓడిపోయి ఉన్నారు.

అందువల్ల ఏడో కుమార్తెతో 'నువ్వు గనక నా కుమారుని రోగం నయం చేయకపోతే నీ తల తెంచి కోటగుమ్మానికి వేలాడదీస్తాను' అన్నాడు పరేస్తాన్ రాజు.

'సరే మహారాజా' అని, లోపలికి వచ్చి, చావుబతుకుల మధ్య వున్న భర్తని చూసుకొని కన్నీళ్లు పెట్టుకుంది ఏడో కుమార్తె.

పెట్టుకొని, ఆమె దగ్గరున్న గువ్వ రెట్టని కోడి ఈకలో తీసుకొని సుబుర్ బాషా వళ్లంతా పూసింది. ఎప్పుడైతే పూసిందో ఒంటిమీది పొట్టంతా జలజలమని రాలిపోయి విషం గిషం దిగిపోయి తేటగా లేచి నిలబడ్డాడు సుబుర్ బాషా.

అది చూసి సంతోషం పట్టలేక 'అమ్మా. ఏం కావాలో కోరుకో' అన్నాడు పరేస్తాన్ రాజు.

'నాకు నా భర్త కావాలి. ఇప్పించండి' అంది ఏడో కుమార్తె అప్పటివరకూ తను కట్టిన దాసరి వేషం తీసేస్తూ.


సగం పాపిట వెంట్రుకలు బంగారం, సగం పాపిట వెంట్రుకలు వెండి, నాభి నక్షత్రం, నుదురు వైఢూర్యంగా వున్న ఆ అతిలోక సౌందర్యవతిని చూసి రాజుగారు ఎంతో ముచ్చటపడ్డారు. నా కుమారునికి తగిన కోడలు దొరికింది అని సుబుర్ బాషాను ఆమె చేతిలో పెట్టారు.

ఆ భర్తను తీసుకొని, ఏడు పల్లకీలు ఎక్కి, యిరవై ఆరుమంది పరిచారికలను తీసుకొని, అంతులేని సంపదలను వెంటబెట్టుకొని ఏడో కుమార్తె యింటికి వచ్చేసరికి ఏముంది రాజుగారికి రాజ్యం పోయింది. కళ్లు పోయాయి. ఆరుగురు అక్కాచెల్లెళ్లు అడుక్కు తింటున్నారు.

ఏడో చెల్లెలి చెడు కోరుకున్నందుకు గాను వారు గుడ్డ కడితే కాగితంలా చిరిగిపోతోంది. కూడు తింటే బెల్లంలా ముద్దకడుతోంది.

చేసిన తప్పుకు ఖర్మ అనుభవిస్తున్నాం అని వాళ్లందరూ ఏడో కుమార్తె కాళ్ల మీద పడ్డారు. ఆమె వారిని క్షమించి తన దగ్గర ఉంచుకుంది. అప్పటి నుంచి వాళ్లందరూ హాయిగా భోగభాగ్యాలతో కలకాలం జీవించారు.

అప్పట్లో ఈ వింత విని, ఆ రాజ్యం చూడడానికి ఎవరైనా వెళితే చీర, రవికె, గాజులు పెట్టి పంపించేవారు. ఈ కథ చెప్పిన మా పెద్దమ్మ కూడా చూద్దామని వెళితే ఆమెకు కూడా చీరె రవికె పెట్టి పంపారు.



# గుత్తివంకాయ కూర

ఒక చిన్నపిల్ల. చాలా చిన్నది. పాపం ఆ పిల్ల సొంత తల్లి చనిపోయేసరికి మారుతల్లి వచ్చింది. ఆమె వచ్చినప్పట్నించి ఆ పిల్ల బాధలు బాధలు గావు. కూర్చుంటే తప్పు. నిలుచుంటే తప్పు. లేస్తే తప్పు. పడుకుంటే తప్పు.

పసిదని కూడా చూడకుండా వీపు మీద కట్టె విరిగేలా బాదుతుండేది ఆ మహాతల్లి.

ఒకరోజు ఆవిడ ఈ పిల్లకు ఒక పావలా యిచ్చి 'బజారుకెళ్లి ఫలానా వస్తువు తీసుకురా' అని చెప్పింది.

పాపం చిన్నపిల్ల గదా అంగడికి పోతూ పోతూ పావలాను పోగొట్టుకుంది. పోగొట్టుకోగానే ఆ పిల్లకు అమితమైన భయం పట్టుకుంది. ఇప్పుడేం చేసేది యింటికి వెళితే మారుతల్లి కొట్టి చంపేస్తుంది గదా అని ఏడుస్తూ యిల్లు చేరింది. లోపలికి అడుగుపెట్టకుండా బయటనే నిలబడి తల్లిని పిలిచింది.

'అమా అమా. నా చేత పొరపాటు జరిగిపోయింది. పావలా పోగొట్టాను. నన్ను కొట్టొద్దమ్మా. యింకెప్పుడూ పోగొట్టనమ్మా. యింట్లోకొస్తే కొట్టొద్దమ్మా' అని ఏడ్చింది.

ఆ మాటకి మారుతల్లి బుస్సున బుసకొట్టి నేరుగా యింట్లోకి వెళ్లి కారండబ్బా తీసుకొచ్చి నిలబడింది.

'నువ్వు రా దరిద్రపుదానా. నువు చేసిన పనికి యివాళ నీ కళ్లల్లో చెవుల్లో ముక్కులో నోట్లో కారం కూర్చకపోతే నేను నీ మారుతల్లినే కాదు' అని శపథం చేసింది.

ఆ శపదానికి చిన్నపిల్ల యింకా దడుచుకొని గుమ్మానికే అతుక్కుపోయింది.

బయట ఆ పిల్ల ఏడ్వను. లోపల ఈ మారుతల్లి శపథాలు చేయను.

ఏడ్చి ఏడ్చి వెక్కిళ్లకు వచ్చేసింది చిన్నపిల్ల.

యిదంతా చూసీ చూసీ ఆ యింటి ఆరుబయట వున్న ఒక వంగ మొక్కకి మాటలు వచ్చేశాయి.

'తల్లీ. ఏందిది? నీకు దయా జాలీ అనేవి ఏమైనా వున్నాయా? ఆ పసిదాన్ని ఎందుకు అట్లా రాచి రంపాన పెడ్తున్నావు. ఆ పిల్ల చేసిన తప్పుకు కళ్లల్లో నోట్లో ముక్కుల్లో చెవుల్లో కారం కూర్చాలని నీకు ఉబలాటంగా వుంది కదా. ఆ కారమేదో నాకు కూరు. ఆ బాధేదో నేను పడ్తాను. పాపం పసిదాన్ని క్షమించి వదిలేయ్' అని బతిమిలాడింది.

అపుడా మారుతల్లి శపథాలు చాలించి, ఆ చెట్టు వంకాయలు కోసి, వాటిలో కారం కూరి కూరి కూర వండింది.



అదే గుత్తి వంకాయ కూర. అట్లా ఆ కూర పుట్టింది.

అయితే యిట్లా వంకాయ చేసిన త్యాగం అల్లాకు తెలుస్తుంది గదా. అందుకు ఆయన ఎంతో సంతోషించి 'ఒసే వంకాయ. యివాల్టి నుంచి నిన్ను కూరగాయల్లో రాజుని చేస్తున్నాను. నీ నెత్తిన కిరీటం పెడ్తున్నాను. యిక నుంచి నిన్ను పేదోడు యిష్టపడతాడు. ఉన్నోడు యిష్టపడతాడు. వండి తిననివాడు పాపాత్ముడు. అంతేకాదు యివాల్టి నుంచి నీ కూర లేనిదే అది విందు భోజనం అనిపించుకోదుపో' అని వరం యిచ్చాడు.

యింక అప్పట్నించి రాజా, మహారాజాల విందు భోజనాల్లో కూడా గుత్తివంకాయ కూర వడ్డన చోటుచేసుకుంది.

✪ ఇది మా నజీర్ పుప్పు చెప్పిన కత. ఆమె చెప్తుంటే వినడం అదో భాగ్యం.



# నిద్రనేది ఒకటి ఉందిగదా

ఒకూర్లో ఒక ముసల్ది. ఆ ముసల్దాని కొడుకూ వున్నారు. ముసల్ది గుడ్డిది. కొడుకు పైల్వాను.

ఒకరోజు పైల్వాను పక్కూరికి కుస్తీపోటీకి వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ 'అమ్మా. తలుపులూ గిలుపులూ జాగ్రత్తగా వేసుకో. నేను రేపు సాయంత్రం దాకా రాను' అని చెప్పేసి వెళ్లాడు.

రాత్రయ్యాక ముసల్ది అన్నం గిన్నం తిని, తలుపులు గిలుపులు వేసుకొని పడుకొంది. మంచి నడిజాముకాడ పెద్ద గజదొంగ వచ్చాడు. కన్నంవేసి యింట్లో వున్నవన్నీ మూటగట్టుకుంటూ అలికిడి చేశాడు. ముసల్దానికి మెలకువ వచ్చి 'ఎవర్రా అదీ?' అంది గట్టిగా.

'నేను దొంగని' అన్నాడు దొంగ.

ముసల్ది గతుక్కుమంది. వెంటనే గుండె సంబాళించుకుని 'ఒరే దొంగోడ. నువ్వేం మొగోడివిరా. నేను చూస్తే కళ్లు లేని గుడ్డిదాన్ని. నా కొడుకేమో యింట్లో లేడు. యిట్టాంటి టైములో వచ్చి ప్రతాపం చూపిస్తావా? యిది మగతనమా? మొనగాడు దొంగ చేయాల్సిన పనేనా? రేపు నా కొడుకుంటాడు. వాడు పైల్వాను. నీకు దమ్ముంటే అప్పుడొచ్చి దోచుకొని వెళ్లు' అని సవాలు చేసింది.

దొంగకి పౌరుషం వచ్చింది. 'సరేగానీ. గజదొంగ తల్చుకుంటే పైల్వాన్లు ఆపగలరా? రేపు నీ కొడుకు వుండగానే దోచుకొని వెళతాను కాసుకో' అని సవాలు చేసి, దోచుకున్నవన్నీ అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు.

మరుసటిరోజు సాయంత్రం కొడుకు వచ్చాడు. వాడికి వేణ్ణీళ్లు పెట్టి, స్నానం చేయించి, అన్నం పెట్టి ముందు కూర్చుంది ముసల్ది. ఆవిడ వాలకం చూసి 'ఏమ్మా. అట్లా ఉన్నావు' అని అడిగాడు కొడుకు.

'రాత్రి గజదొంగ వచ్చాడు నాయనా. నేనేమో కళ్లకి గుడ్డిదాన్ని. నా కొడుకు యింట్లో లేడు. నీకు దమ్ముంటే నా పైల్వాను కొడుకు యింట్లో వుండగానే వచ్చి దోచుకెళ్లు అని సవాలు చేశాను' అంది ముసల్ది.

కొడుకు తింటా తింటా వుండే అన్నంలో చేయికడిగి, మూలకెళ్లి ముఖం చిన్నగా పెట్టుకొని కూర్చున్నాడు.

'ఏం బేటా. అలా అయిపోయావు?' అని అడిగింది ముసల్ది.


'అమ్మా. నువ్వు ఆ దొంగతో అలా ఎలా సవాలు చేశావమ్మా? నేను పైల్వాన్నే. పగటి వెలుగులో పదిమంది ఎదురొస్తే మట్టి కరిపించగల మొనగాణ్ణే. కానీ నువ్వు సవాలు చేసింది దొంగతో గదమ్మా. వాడు రాత్రిపూట వస్తాడు. చాటుగా వస్తాడో, మాటుగా వస్తాడో తెలియదు.



ముందు నుంచి పొడుస్తాడో వెనక నుంచి పొడుస్తాడో తెలియదు. పైగా మనిషికి నిద్రనేది ఒకటి ఉంది గదమ్మా. నిద్రపోయిన మనిషి ప్రాణం పోయిన మనిషితో సమానం గదా. నేను నిద్రపోయాక ఎవర్ని తన్నగలను? ఎవర్ని ఎదిరించగలను? ఏందమ్మా నువ్వు యిలా చేసిపెట్టావు' అన్నాడు బాధగా.

చాటుగా వుండి యిదంతా వింటున్న దొంగ 'శబ్బాష్' అన్నాడు యివతలికి వచ్చి.

'మంచి మాట చెప్పావు. నువ్వే గనక మీ అమ్మ మాట విని పొడిచేస్తాన్ నరికేస్తాన్ అని ప్రగల్బాలు పలికి ఉంటే, యిదిగో యీ కత్తి చూశావా నిన్ను నిద్రపోనిచ్చి ఒక్క వేటుతో నీ తల నరికుండేవాణ్ణి. నీకు మనిషి బలం తెలుసు. మనిషి బలహీనత తెలుసు. అందుకనే మీ అమ్మా కొడుకులని క్షమించి వదిలేస్తున్నా. అంతేగాదు నా దగ్గర ఉన్న సొమ్ములన్నీ మీకే యిస్తున్నా' అని, వాడి దగ్గర వున్న మణులు, మాణిక్యాలు అన్నీ యిచ్చి వెళ్లిపోయాడంట దొంగ.



# అల్లాకె నామ్ పే ఖైరాత్ కర్

## దేవుడి పేరున దానం చెయ్యి

ఒక ఊళ్లో ఒక అవ్వా మనవడూ ఉన్నారు. మనవడు పొద్దునంగా పోయి కష్టం చేసి సాయంత్రానికి సంపాదిచ్చిందంతా తెచ్చి అవ్వ చేతిలో పోస్తాడు. ఆ సంపాదనలో నుంచి అవ్వ వాళ్లిద్దరికీ అవసరమైనంత మాత్రమే వాడుకొని తక్కినదంతా అల్లా పేరున ఖైరాత్ (దానం) చేసేది.

యిలాగే రోజులు గడుస్తా ఉన్నాయి. ఒకసారి మనవడికి జ్వరం వచ్చింది. నాలుగైదు రోజులదాకా పనికి పోయే వీలులేదు.

'అవా అవా. నాకు జ్వరం వచ్చింది గదా. నువు దాచిపెట్టిన డబ్బుల్ని బయటకు తియ్యి వాడుకుందాం' అన్నాడు మనవడు.

'ఏం డబ్బులు బేటా? నా దగ్గర యాడివి? నువ్వు సంపాదించింది తెస్తావు. అందులో మనకు అవసరం లేనిది నేను అల్లా పేరున ఏరోజుకారోజు దానం చేసేస్తాను. దానం చేయమని దేవుడు చెప్పాడు కదా. ఆ సొమ్ము ఎక్కడికీ పోదులే' అంది అవ్వ.


మనవడికి చాలా కోపం వచ్చేసింది. 'కష్టపడి సంపాదిచ్చిందంతా ఊరోళ్లకి దానం చేయమని ఏ అల్లా చెప్పాడు. అసలు అట్టాంటి అల్లా ఎలా అల్లా అవుతాడు. నేను అల్లాని అడిగొస్తానుండు' అని మూటాముల్లె సర్దుకొని అల్లా కోసం అడవిలోకి బయలుదేరాడు.

అడవిలో కొంచెం దూరం పోయాక వాడికి ఆకలేసింది. దప్పిక కలిగింది. దూరంగా ఒక మామిడి చెట్టు, ఒక నీళ్ల బావి కనిపించాయి. మామిడి చెట్టుకి పండ్లు విరగగాసున్నాయి. నీళ్ల బావిలో నీళ్లు నిండుగా తొణికిసలాడుతున్నాయి. పోయి గబగబా నాలుగు మామిడిపండ్లు కోసుకొని నోట్లో పెట్టుకున్నాడు. చేదూ చేదూ చేదంటే చేదుగా వున్నాయవి. ఎన్ని కోసినా చేదే. సరే నీళ్లన్నా తాగుదామని బావిలోకి దిగితే అవి కూడా చేదు. ఒక్క గుక్క కూడా గొంతు దిగలేదు.

'ఏమిరా ఈ మాయ' అని అనుకుంటా వుంటే మామిడి చెట్టుకీ, బావికీ మాటలు వచ్చి 'నాయనా, నువ్వెవరు? ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాయి.

'నేను ఫలానా ఊరి అబ్బాయిని. అల్లాని చూడ్డానికి వెళుతున్నాను. దానం చేయమని ఎందుకు చెప్పాడో కనుక్కుందామని వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'నాయనా. నీ ముక్కతోపాటు మా ముక్క కూడా కనుక్కో. ఈ దారిన యింతమంది పోతుంటారుగానీ ఒక్కరు కూడా ఈ మామిడి పండ్లు తినరు. ఒక్కరు కూడా ఈ మంచినీళ్లు తాగరు. అందరికీ అంత చేదైపోయాము మేము. మాకెందుకీ శాపమో కనుక్కో' అని అడిగాయి మామిడిచెట్టు, నీళ్ల బావి.



'అలాగే' అని బయలుదేరాడు మనవడు.

కాస్త దూరం వెళ్లాక ఒక పన్నెండడుగుల పాము నడుములు విరిగిపోయినట్టుగా కదల్లేక మెదల్లేక పడుకొని కనిపించింది. దారిన పోతున్న మనవడిని చూసి 'నాయనా. ఎవరు నువ్వు? ఎక్కడికి పోతున్నావు?' అని అడిగింది.

'నేను అల్లాని చూడ్డానికి వెళుతున్నాను. ఖైరాత్ అంటే అర్థం ఏమిటో కనుక్కుందామని వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'బేటా. నీ ముక్కతోపాటు నా ముక్క కూడా కనుక్కో. ఎన్నో ఏళ్లుగా నేను కదల్లేక మెదల్లేక పడుకొని వున్నాను. ఎందుకో నా తల చాలా భారంగా వుంటోంది. దీనికి కారణం ఏమిటో కనుక్కో' అంది పాము.

'అలాగే' అని బయలుదేరాడు మనవడు.

యింకాస్త దూరం వెళ్లాక ఒక ఊరు వచ్చింది. ఆ ఊర్లోని జనం విచారంగా వున్నారు. ఆ ఊరి నవాబు కూడా విచారంగా వున్నాడు.

ఆ నవాబు ఈ మనవడి సంగతి విని 'బాబూ. నీ ముక్కతోపాటు నా ముక్క కూడా కనుక్కో. మా ఊర్లో మేమొక మసీదు కడుతున్నాము. దానికి పగలు పొద్దస్తం మినార్లు కడతాము. కాని సాయంత్రమయ్యేసరికి అవి కూలిపోతున్నాయి. ఈ మాయ ఏమిటో కనుక్కో' అన్నాడు.

కాస్త దూరం పోయాక మనవడికి ఒక ఫకీర్ కనిపించాడు. 'ఎక్కడికి బాబు. ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాడు.

'నేను అల్లాని చూడడానికి వెళుతున్నాను. నా సందేహాలు తీర్చుకోవడానికి వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'యీమాత్రం దానికి అల్లాదాకా ఎందుకులే నాయనా. నేను తీర్చగలనేమో చూస్తా' అన్నాడు ఫకీరు.

'సరే అయితే. ఫలానా చోట ఫలానా మామిడిచెట్టు ఉంది. దాని మామిడికాయలు చేదంటే చేదుగా వున్నాయి. అక్కడే ఒక మంచినీళ్ల బావి వుంది. దాని నీళ్లు కూడా చేదుగా వున్నాయి. దానికి కారణం ఏంది?' అని అడిగాడు మనవడు.

'బాబూ. ఆ మామిడిచెట్టు పూర్వజన్మలో ఖైరాత్ చేయలేదు. అలా చేయకపోవడం వల్ల దాని దగ్గర డబ్బులు పేరుకుపోయాయి. పేరుకుపోయిన డబ్బుని పేదవాళ్లకు అప్పు యివ్వాలనిపించింది. అప్పు ప్రస్తావన వచ్చేసరికి వడ్డీ తినాలనిపించింది. మన ఇస్లాంలో వడ్డీ ఎంత హరామో (నిషిద్ధమో) నీకు తెలుసుగదా. వడ్డీ తిన్నోళ్ల బతుకు అంతే. అందుకని ఈ జన్మలో ఎవరూ దాని ముఖం చూడటం లేదు. యింక ఆ నీళ్ల బావి సంగతి. అది పూర్వ జన్మలో ఒకరికి ఒక సాయం చేయకుండా, ఒకరికి కనీసం ఒక లోటా మంచినీళ్లు కూడా యివ్వకుండా బతికింది. అందుకని ఈ జన్మలో దాని నీళ్లు ఎవ్వరూ ముట్టడం లేదు' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుకు మనవడు చాలా తృప్తిపడ్డాడు.

'ఫలానా చోట ఒక పన్నెండడుగుల పాము ఉంది. చాన్నాళ్లుగా దాని తల భారమైపోయి కదల్లేక పోతోంది. దాని సంగతేంది?' అని అడిగాడు.

'దాని తల మీద ఒక మణి ఉంది. ఆ మణి కింద పెద్ద ఖజానా ఉంది. ఆ ఖజానాని దించితే దాని తలభారం తీరిపోతుంది. నీ కష్టార్జితం నుంచి మీ అవ్వ బీదవాళ్లకి రోజా ఖైరాత్ చేసేదిగదా. దానికి ఫలితంగా అంతపెద్ద ఖజానా ఆ పాము పడగ మీద నీ పేరున ఉంది. వెళ్లి తీసుకో. అది నీదే' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుకు కూడా మనవడు చాలా తృప్తి పడ్డాడు.

'ఫలానా ఊర్లో ఫలానా నవాబుగారు మసీదును కడుతున్నారు. పగలు కట్టిన మినార్లు సాయంత్రానికి కూలిపోతున్నాయి. దీనికి కారణమేమి?' అని అడిగాడు.

'బాబూ. ఎవరైనా సరే ముందు యింటి సంగతి చూసుకొని తర్వాత లోకం సంగతి చూసుకోవాలి. ఆ నవాబుగారికి పన్నెండేళ్ల కూతురుంది. ఈడొచ్చిన ఆ పిల్లకి పెళ్లి సంగతి ఆలోచించకుండా ఆ నవాబు మసీదులూ మీనార్లు అని తిరుగుతున్నాడు. ఆ పిల్ల సందేళ అయ్యేసరికి మేడ మీదకొచ్చి ఒక్క నిట్టూర్పు విడుస్తా ఉంది. ఆ దెబ్బకు ఆ మినార్లు పడిపోతున్నాయి. పెళ్లీడు వచ్చిన పిల్లకు కల్యాణం జరిపిస్తే వచ్చే పుణ్యం పది మసీదులు కట్టినా రాదు' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుతో తృప్తిపొందిన మనవడు ఆ ఫకీరుకి సలాములు చెప్పి నేరుగా నవాబు దగ్గరకు వెళ్లాడు. సంగతి చెప్పాడు. 'నాయనా. నా కూతురికి నీకంటే యోగ్యుడెవరు?' అని తన కూతుర్ని యిచ్చి ధూంధాంగా నిఖా జరిపించాడు నవాబు. ఆ తర్వాత మనవడు నేరుగా పాము దగ్గరకు వెళ్లి సంగతి చెప్పాడు.

'బతికించావు తండ్రీ. ముందు ఆ మణీ, ఖజానా తీసుకొని నా నెత్తిబరువు దించు' అంది పాము. మనవడు ఆ మణినీ, అంతులేని ఖజానానీ తీసుకున్నాడు.

ఆ తర్వాత మామిడి చెట్టు, నీళ్ల బావి దగ్గరకు వెళ్లాడు. 'పూర్వజన్మలో మీరు చేసిన పాపాలు ఈ జన్మలో మిమ్మల్ని పట్టి పల్లారుస్తా ఉన్నాయి. యింక మీ బతుకు యింతే. అనుభవించండి' అని చెప్పాడు.

చివరికి సొంతూరికి పోయి, అవ్వని కలిసి 'అవా. నువ్వు చెప్పింది సత్యం. దేవుడి పేరున దానం చెయ్యాలి. ఆ సొమ్ము ఎక్కడికీ పోదు' అని వాటేసుకున్నాడు.



# బీ ఫిత్నీ

ఒక పర్వతాన ఒక ఆడపిచ్చుక, ఒక మగపిచ్చుక ఉన్నాయి. ఒకనాడు ఆ పర్వతానికి నిప్పంటుకుంది. ఎక్కడ చూసినా మంటలు మింగుకుంటా వస్తా ఉన్నాయి. వాటిని చూసి గబగబా గూటికి ఎగిరొచ్చిన మగపిచ్చుక 'అడవికి నిప్పంటుకుంది. పద పద మనం ఎట్లైనా ఎగిరెళ్లిపోదాం' అంది ఆడపిచ్చుకతో.

'మరి మన బిడ్డలు' అంది ఆడపిచ్చుక.

'యిట్టాంటి వేళ యింక బిడ్డలేంది గిడ్డలేందీ. నువ్వూ నేనూ సలామత్‌గా ఉంటే యిట్టాంటి బిడ్డల్ని ఎంతమందినైనా కనొచ్చు. పద పద. ఆలస్యమైపోయింది' అంది మగపిచ్చుక.

ఆడపిచ్చుకకి మనసొప్పలేదు. యింకా కళ్లయినా తెరవని ఆ పసికూనల్ని వదిలి పారిపోబుద్ధి కాలేదు.

'అయ్యా. నా మాట విను. మనకున్నది యిద్దరు బిడ్డలు. నువ్వొకదాన్ని తీసుకో. నేనొకదాన్ని తీసుకుంటా. యిద్దరం ఎగిరెళ్లిపోవచ్చు' అంది మగపిచ్చుకతో.

'ఛీ... చెప్పిన మాట వినవుగదా. యాడైనా సావు' అనేసి ఆడపిచ్చుకనీ, యిద్దరు బిడ్డల్నీ, గూటినీ వదిలి దాని మానాన అది ఎగిరెళ్లిపోయింది మగపిచ్చుక.

యింకేమి చేస్తుంది ఆడపిచ్చుక? గబగబా ఒడిలో ఒక బిడ్డను జవురుకొని పర్వతం కిందకి దిగివచ్చి, దాన్ని ఒకచోట భద్రంగా దాచి, రెండో బిడ్డ కోసం మళ్లీ పర్వతానికి ఎగిరింది. కానీ అప్పటికే మంటలు చుట్టుముట్టి పాపం ఆ పసిబిడ్డ చనిపోయింది.

'యా అల్లా' ఎంతపని చేశావు అని కాసేపు ఏడ్చుకొని, పోనీలే ఒక బిడ్డయినా దక్కింది గదా అనుకొని, సాక్కుంటా ఉంది ఆడపిచ్చుక.

కొన్నాళ్లకి మగపిచ్చుక రెండో పెళ్లి చేసుకుని పెళ్లాంతోపాటు ఆడపిచ్చుక దగ్గరకు వచ్చింది. తల్లి ఒడిలో ఆడతా పాడతా కువకువమని తిరుగుతున్న తన బిడ్డను చూసేసరికి దానికి ఆశబుట్టింది. 'నా బిడ్డను నాకిచ్చెయ్' అని తకరారుకు దిగింది.

'ఇదేం న్యాయం. వదిలెళ్లిపోయింది నువ్వు. అక్కరలేదనుకుంది నువ్వు. కన్నది నేను. తెచ్చి సాక్కుంటున్నది నేను. యిప్పుడొచ్చి బిడ్డ కావాలంటే ఎవరిస్తారు పోపో' అంది ఆడపిచ్చుక.

మగపిచ్చుక దాని జుట్టు పట్టుకొని ధభీధుభీమని బాది 'పద రాజుగారి దగ్గరకు న్యాయానికి పోదాం' అంది.

'సరే. పా' అంది ఆడపిచ్చుక ఏడ్చుకుంటూ.

రాజుగారు అంతా విన్నారు. విని 'అక్షుల్లో అయినా పక్షుల్లో అయినా మనుషుల్లో అయినా పశువుల్లో అయినా బిడ్డల మీద తండ్రికే హక్కు. నీ దగ్గరున్న బిడ్డను మర్యాదగా నీ మొగునికి అప్పగించు' అని తీర్పు చెప్పారు.

ఆ తీర్పు విన్న వెంటనే ఆడపిచ్చుక స్పృహ తప్పి పడిపోయింది. కాసేపటికి తేరుకొని ఏడ్చుకుంటా ఏడ్చుకుంటా ఎగురుకుంటా ఎగురుకుంటా వెళ్లి మంత్రిగారి యింటి మీద వాలింది. అక్కడ చూస్తే మంత్రిగారి భార్య కూడా యిదే తీరున ఏడుస్తా ఉంది. కారణం ఏమిరా అంటే ఆమెకు బిడ్డలు కలగడం లేదు. గొడ్రాలుదానా అని లోకమంతా వేలెత్తి చూపతా ఉంది. సంగతి తెలుసుకున్న ఆడపిచ్చుక 'చూడమ్మా మంత్రిగారి పెళ్లామా. బాధపడబాక. నన్ను కోసుకొని తిను. నీకో ఆడపిల్ల పుడుతుంది. దానికి బీఫిత్నీ అని పేరుపెట్టు' అని చెప్పింది.

ఆ మాటలకి సంతోషపడి, కళ్లు తుడుచుకొని ఆడపిచ్చుకని కోసి కూర చేసుకుని తినింది మంత్రిగారి భార్య.

వెంటనే ఆమెకి గర్భం నిలిచి తొమ్మిది నెలలు నిండి ఒక ఆడపిల్ల పుట్టింది. ఆడపిచ్చుక చెప్పినట్టే ఆ పిల్లకు 'బీ ఫిత్నీ' అని పేరు పెట్టారు మంత్రి, మంత్రిగారి భార్య.

బీఫిత్నీకి పన్నెండేళ్ల వయసు వచ్చింది. ఒకరోజు తండ్రి దగ్గరకు వెళ్లి 'అబ్బా అబ్బా. నాకు రెండు పోతుగుర్రాలు కావాలి. తెచ్చిపెట్టండి' అంది. అలాగేనని రెండు పోతుగుర్రాలని తెచ్చిపెట్టాడు మంత్రి.

బీఫిత్నీ వాటిని తీసుకెళ్లి రాజుగారి గుర్రపుశాలలో వదిలిపెట్టింది. ఆ పోతుగుర్రాల వల్ల గుర్రపుశాలలోని పెంటిగుర్రాలకు బిడ్డలు పుట్టాయి. పుట్టాక ఒకరోజు బీఫిత్నీ వెళ్లి ఎన్ని గుర్రాలు పుట్టాయో అన్నింటినీ తోలుకొని యింటికి తెచ్చి కట్టుకుంది. ఈ సంగతిని కాపలావాళ్లు గలబా గలబా చేసి రాజుగారికి చెప్పారు.

'యిదేమిటి. నా గుర్రపుశాలలో పుట్టిన బిడ్డలు బీఫిత్నీవి ఎలా అవుతాయి?' అని ఆమెను పిలిపించాడు రాజు.

'అవును రాజా. ఆ గుర్రపు పిల్లలు నావే. నా పోతుగుర్రాల వల్ల పుట్టినవి నావి కాకుండా మీవి అవుతాయా?' అని అడిగింది బీఫిత్నీ.

'అదేమిటి బీఫిత్నీ? గుర్రపుశాల నాది. గుర్రాలు నావి. నీ పోతుగుర్రాలు వచ్చి రెండునాళ్లు కాపరం చేసినంత మాత్రాన పుట్టిన గుర్రాలన్నీ నీవి ఎలా అవుతాయి?' అని ఆశ్చర్యపోయాడు రాజు.

'మరి యీ బుద్ధి ఆనాడు ఏమైంది మహారాజా. వదిలెల్లిపోయింది వాడు. మంటల్లో పడేసి వెళ్లింది వాడు. అట్టాంటివాడికి నా బిడ్డను అప్పగించమని పిచ్చుకల తగవులో తీర్పు చెప్పారే. నా గుండెలు ఎట్లా మండిపోయి ఉండాలి మహారాజా' అంది బీఫిత్నీ.

నిండు సభలో ఆమె అలా నిలదీసే సరికి రాజుగారికి చాలా అవమానం అయిపోయింది. అమ్మో యిది నా మీదే పగ తీర్చుకోవడానికి మళ్లీ పుట్టినట్టుంది అని మనసులో అనుకుని అప్పటికి క్షమాపణలు చెప్పి గుర్రపు పిల్లలని బీఫిత్నీకే అప్పగించాడు రాజు.

ఆ మరుసటిరోజే మంత్రిని పిలిచి 'నా ఆరోగ్యం ఏమీ బాగలేదు. కర్రెద్దు (నల్లటి ఎద్దు) పాలు తాగితే తగ్గుతుందంటున్నారు వైద్యులు. నువ్వెళ్లి కర్రెద్దు పాలు తీసుకురా. లేకుంటే నీ మెడ మీద తల ఉండదు' అన్నాడు రాజు.

మంత్రిగారి గుండెల్లో రాళ్లు పడ్డాయి. నా కూతురి మీద కోపాన్ని నా మీద తీర్చుకోదలిచావా అనుకొని విచారంగా యిల్లు చేరాడు. తండ్రి వాలకం చూసి 'ఏం అబ్బాజాన్. ఏం అలా ఉన్నారు?' అని అడిగింది బీఫిత్నీ.

'ఏం చెప్పమంటావమ్మా. రాజుగారు నన్ను కర్రెద్దు పాలు తెమ్మన్నారు. అసలు కర్రెద్దులు ఎక్కడుంటాయి? ఉన్నా అవి పాలు ఎందుకిస్తాయి. నాకు చావు మూడిందమ్మా' అన్నాడు కూతురితో.

'ఊరుకోండి అబ్బాజాన్. యింత చిన్న విషయానికి గాబరా పడితే ఎలా? నేను చూసుకుంటానులెండి' అని మరుసటిరోజు కొన్ని మాసిన గుడ్డలూ సబ్బూ గిబ్బూ తీసుకొని రాజుగారి స్నానాల కొలను దగ్గరకు వెళ్లి వాటిని ఉతుకుతా కూర్చుంది బీఫిత్నీ.

రాజుగారు వచ్చి బీఫిత్నీని చూసి 'ఏం బీఫిత్నీ యిక్కడేం ఉతుకుతున్నావ్?' అని అడిగారు.

బీఫిత్నీ లేచి నిలబడి, భయం నటిస్తా 'మన్నించండి మహారాజా. మా అబ్బాజాన్‌కి ప్రసవం జరిగింది. మైలగుడ్డలు ముట్టుగుడ్డలు అనేకం పడ్డాయి. బయటికెళ్లి వాటిని శుభ్రం చేసుకోలేక మీ కొలను దగ్గరకు వచ్చి శుభ్రం చేసుకుంటున్నాను' అంది.

రాజుగారు ఆశ్చర్యపోయారు.

'అయ్ బీఫిత్నీ. ఎక్కడైనా మగాడికి కాన్పు జరుగుతుందా?' అని అడిగారు.

'అయ్ బాషా జహాపనా. మరి ఎక్కడైనా కర్రెద్దు పాలు యిస్తుందా?' అని అడిగింది బీఫిత్నీ.

రాజుగారి ముఖాన నీళ్లు దిగిపోయాయి. తలదించుకుని యింటికి వెళ్లిపోయారు.



ఆ మరుసటి రోజు మంత్రిని పిలిచి 'మంత్రీ. నువ్వు ఎలా చేస్తావో ఎప్పుడు చేస్తావో నాకు తెలియదు. వెంటనే మన రాజ్యంలో గట్టులేని చెరువుని ఒకదాన్ని తవ్వించు. లేకుంటే నీ మెడ మీద తల ఉండదు' అన్నారు.

మళ్లీ మంత్రి దిగులు ముఖం వేసుకొని యిల్లు చేరాడు. 'ఏంది అబ్బాజాన్. ఏం అలా ఉన్నారు?' అని అడిగింది బీఫిత్నీ.

'ఏం చెప్పమంటావమ్మా. నేనిప్పుడు చెరువు కట్టాలంటా. అయితే దానికి గట్టుకానీ, కట్టగానీ ఉండకూడదంట. కట్టలేని చెరువు ఎక్కడుంటుంది?' అన్నాడు మంత్రి.

'దానికే యింత కంగారుపడిపోవాలా? నేను చూసుకుంటాలేండి' అని మరుసటిరోజు పూసలదాని వేషం వేసుకొని, జోలె నిండా ముత్యాలు పోసుకొని 'ముత్యాలు ముత్యాలు. అణాకు అర్ధశేరు ముత్యాలు' అని అరుచుకుంటా బయలుదేరింది.

అది విన్న జనం ఆశ్చర్యపోయారు. అణాకు అర్ధశేరు ముత్యాలేంది ఈ అమ్మికి ఏమైనా పిచ్చా చాదస్తమా అని నోరెళ్లబెట్టి చూశారు. ఈ

వార్త రాజుగారికి తెలిసింది. పిలిపించండి ఆ సంగతేందో చూద్దాం అన్నాడు.

బీఫిత్నీ సభలోకి వచ్చి 'రాజా. అణాకు అర్ధశేరు ముత్యాలు' అంది.

'సరే యివ్వు' అన్నారు రాజుగారు.

వెంటనే బీఫిత్నీ శేరుని బోర్లావేసి దాని మీద ముత్యాలు పోసింది. ముత్యాలన్నీ కిందపడిపోయి ఒకటీ అరా నిలిచాయి. వాటినే రాజుగారికి యిచ్చింది.

రాజుగారు ఆశ్చర్యపోయారు. 'ఏమమ్మా... బోర్లేసి కొలిచిన కొలత కొలతవుతుందా?' అని అడిగారు.

'మరి మహారాజా. గట్టులేని చెరువు చెరువు అవుతుందా?' అని అడిగింది బీఫిత్నీ.

'అమ్మా నువ్వా' అనుకున్న రాజుగారు యింక దీనిని ఉపేక్షించకూడదని మంత్రిని పిలిచి 'నీ కూతుర్ని నాకిచ్చి పెళ్లి చేయ్' అని హుకుం జారీ చేశాడు.

'నేను కూడా యిందుకే చూస్తున్నా కానివ్వండి' అంది బీఫిత్నీ.

ఒకవైపు పెళ్లి ఏర్పాట్లు జరుగుతూ వుంటే మరోవైపు మహల్లో బందీఖానాను కట్టే పని మొదలెట్టాడు రాజు. మంత్రికి ఈ సంగతి తెలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకుని వచ్చి కూతురికి చెప్పాడు.

'అమ్మా. ఆ కంజాత్‌గాడు నిన్ను హింసించడానికే ఈ పెళ్లి చేసుకుంటున్నాడు. పెళ్లయిన వెంటనే నిన్ను ఖైదుఖానాలో పడేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు' అన్నాడు.

బీఫిత్నీ నవ్వింది.

'అదేమిటి అబ్బాజాన్. ఈ రాజ్యానికి మంత్రి మీరు. మహల్‌లో పనులు చూడాల్సింది మీరు. మీరు తల్చుకుంటే ఈ ముప్పుని తప్పించగలరు. మరేం లేదు. ఆ ఒంటిగది బందీఖానా నుంచి మన యింటికి రహస్యంగా ఒక సొరంగం తవ్వించండి. ఇది రాజుగారికి తెలియకూడదు. నన్ను అందులో పడేసినా మనింటికి వస్తూ పోతూ హాయిగా వుంటాను' అంది బీఫిత్నీ.

అలాగే అని చెప్పి మంత్రి తన మనుషులను పెట్టుకుని బందీఖానాతోపాటు అక్కడి నుంచి తనింటి వరకు రహస్యంగా సొరంగం కూడా తవ్వించి సిద్ధం చేశాడు.

పెళ్లయింది. ఆ రాత్రి బీఫిత్నీని బందిఖానాలో వేయడమూ అయ్యింది.

ఆ మరుసటిరోజు నిద్రలేచిన రాజు ఒక బొచ్చెలో రెండు మిరపకాయలు, అర్ధశేరు రాగిపిండి ఉంచి బందిఖానాలో తోశాడు.

తోసి 'ఏం బీ ఫిత్నీ. ఎట్టున్నావు?' అన్నాడు హేళనగా.

'మీరు ఎట్లా వేశారో అట్లానే వున్నాను మహారాజా' అంది బీఫిత్నీ లోపలి నుంచి. ఆ తర్వాత 'మహారాజా. నాదొక సవాలు' అంది.

'ఏంటి?' అన్నారు రాజుగారు.

'రాజుగారి పుణ్యాన యిద్దరు మగబిడ్డల్ని కంటాను.

రాజుగారి చేత నా కాళ్లు కడిగిన నీళ్లు తాగిస్తాను

రాజుగారి వీపు మీద పచ్చడి నూరి తింటాను. ఇది నా సవాలు' అంది బీఫిత్నీ.

రాజుగారు నవ్వి 'నీ ముఖం' అనుకుని వెళ్లిపోయారు.

రోజులు గడుస్తున్నాయి. రోజూ రాజుగారు బీఫిత్నీకి పచ్చిమిరపకాయలు, రాగిపిండి యివ్వడం 'ఏం బీఫిత్నీ ఎట్టున్నావు?' అని అడగడం 'మీరు ఎట్లా వేశారో అట్లే వున్నాను మహారాజా' అని బీఫిత్నీ సమాధానం యివ్వడం జరిగిపోతా ఉంది. మరోవైపు రాజుగారు అలా దర్బార్‌కి వెళ్లగానే బీఫిత్నీ సొరంగం గుండా యింటికి వచ్చి, హాయిగా స్నానాలు గీనాలు చేసి కమ్మగా అంత తిని మళ్లీ బందిఖానాకు చేరుతూ ఉంది.

ఒకనాడు రాజుగారు శిస్తుల వసూలుకు బయలుదేరారు.

'అమ్మా. రాజుగారు ఫలానా ఊరికి శిస్తుల కోసం బయలుదేరే ఏర్పాట్లలో వున్నారు' అని చెప్పాడు మంత్రి బీఫిత్నీతో.

'అయితే ఆయనకన్నా ముందు నన్ను అక్కడికి చేర్చండి అబ్బాజాన్' అంది బీఫిత్నీ.

అనుకున్నట్టుగానే రాజుగారి కన్నా ముందే అక్కడికి చేరి గానాబజానా ఆడేదానిలాగా వేషం కట్టి, గుడారం వేసుకుని కూర్చుని వుంది బీఫిత్నీ.

రాజుగారు అక్కడికి వచ్చారు. బీఫిత్నీని చూశారు. 'అబ్బా. ఎవరీ అందగత్తె. యింత సుందరంగా కనబడతా వుందే' అన్నారు మంత్రితో.

'ఎవరో గానాబజానా ఆడది మహారాజా. కావాలంటే మీరు వెళ్లి ఆమె గానాబజానా చూడొచ్చు. ఆమెతోనే ఉండొచ్చు' అన్నాడు మంత్రి.

రాజుగారు ఆమె గుడారంలో దూరారు. బీఫిత్నీతో కాపరం మొదలుపెట్టారు. ఆమె ప్రేమ, మాటలు, కాపరం చేసే తీరు చూసి పిచ్చోడైపోయాడు రాజు. ఎంత పిచ్చోడయ్యాడంటే ఒకసారి కైపు తలకెక్కి ఆమె పాదాలు కడిగి ఆ నీళ్లు తాగేశాడు. అట్లా బీఫిత్నీ మొదటి సవాలు పూర్తయ్యింది.

కొన్నాళ్ల తర్వాత తన గుర్తుగా ఒక రత్నాల హారాన్ని బీఫిత్నీకి యిచ్చి రాజుగారు వెళ్లిపోయారు. ఆయన వల్ల బీఫిత్నీకి గర్భం నిలిచింది. బందీఖానాకు చేరి రహస్యంగా మగబిడ్డకు జన్మనిచ్చింది.

మళ్లీ కొన్నాళ్లకు రాజు శిస్తులకు బయలుదేరారు. మళ్లీ బీఫిత్నీ ఆయనకంటే ముందు అక్కడ చేరి వడ్డెరోళ్ల స్త్రీ వేషం కట్టి, గుడారం వేసుకొని బండలు పగలకొడ్తూ కూర్చుని వుంది.

రాజుగారు వచ్చి ఆమెను చూశారు. చూసి, 'ఆహా, ఏమి ఈ రాళ్లలోని అందం' అన్నారు మంత్రితో.

'మీరు తలచుకుంటే ఈ అందాన్ని అందుకోవచ్చు మహారాజా' అన్నాడు మంత్రి.

మళ్లీ రాజుగారు గుడారంలో చేరి బీఫిత్నీతో కాపరం మొదలెట్టారు. బీఫిత్నీ వండే ఆ వంటా, ఈ వంటా తిని ఆ కమ్మదనానికి పిచ్చోడైపోయాడు రాజుగారు. 'ఇంత రుచి నీకెలా వచ్చింది' అని రాజుగారు అడిగితే-

'యిదేమి రుచి మహారాజా. మీ వీపు వుంది గదా. దాని మీద పచ్చిమిరపకాయల పచ్చడి నూరితే దాని రుచికి మీ అబ్బ దిగిరావాలి' అంది బీఫిత్నీ.

'అట్టయితే నూరు' అన్నాడు రాజు.

దొరికావురా అనుకున్న బీఫిత్నీ రాజుగారి వీపు మీద పచ్చడి నూరి తాను తిని, రాజు చేత కూడా తినిపించింది. అట్లా బీఫిత్నీ రెండో సవాలు పూర్తయ్యింది.

కొన్నాళ్లకి తన గుర్తుగా రాజుగారు బీఫిత్నీకి పొన్నుకర్ర యిచ్చి వెళ్లిపోయారు. ఆయన వల్ల బీఫిత్నీకి మళ్లీ గర్భం నిలిచింది. రహస్యంగా రెండో మగబిడ్డకు జన్మనిచ్చింది బీఫిత్నీ.


ఆ యిద్దరు బిడ్డలు మంత్రిగారి యింట్లో రాజభోగాలతో పెరిగి ఏడెనిమిదేళ్ల వయసువాళ్లయ్యారు. రంజాను పండుగ వచ్చింది. బీఫిత్నీ మంత్రి యింటికి చేరి బిడ్డలకు తలస్నానం చేయించి, పట్టుబట్టలు కట్టి, టోపీలు తొడిగి, ఒకడి మెడలో రత్నాల హారం వేసి, యింకొకడి చేతిలో పొన్నుకర్ర యిచ్చి, వాళ్లను ఏనుగు అంబారీ ఎక్కించి రాజుగారి కంటే ముందు ఊరేగింపుకు పంపించింది.

రాజుగారు యీ సంగతి విని నోర్లెళ్లబెట్టారు. నాకంటే ముందు ఊరేగే హక్కు ఎవరికి ఉంది అని కోట బయటకు వచ్చారు. వస్తే ఏముంది రాజకళ ఉట్టిపడుతున్న యిద్దరు మగబిడ్డలు, పక్కనే బీఫిత్నీ.

'రాజుగారి పుణ్యాన యిద్దరు మగబిడ్డల్ని కంటాను
రాజుగారి చేత నా కాళ్లు కడిగిన నీరు తాగిస్తాను
రాజుగారి వీపు మీద పచ్చిమిరపకాయల పచ్చడి నూరతాను' అని బీఫిత్నీ చేసిన సవాలు గుర్తొచ్చింది రాజుగారికి.

బీఫిత్నీ తెలివికి, ధైర్యానికి, తెగింపుకి సాగిలపడ్డాడు రాజు. ఓడిపోయానని అంగీకరించి భార్యనీ పిల్లల్నీ దగ్గరకు తీసుకున్నాడు. అప్పట్నించి వాళ్లు సంతోషంగా కాలం గడిపారు.

✪ ఈ కథ మా యిళ్లలో ఎంత ప్రసిద్ధి అంటే యిప్పటికీ ఎవరైనా ఆడామె మంచి తెలివి, చొరవ, తెగింపు చూపిస్తే 'అమ్మో ఆమెతో కాదు. బీఫిత్నీతో సమానం' అని అంటుంటారు.



# నక్కసాయెబు - నక్క బీబీ

ఒక నక్క సాయెబుగారూ నక్క బీబీ అడవిలో కాపురం చేసుకుంటూ వున్నారు.

నక్క సాయెబు గారికి ఏ పనీ రాకపోయినా జాతిబుద్ధి సోకి వాళ్లను ముంచి, వీళ్లని ముంచి మొత్తం మీద బీబీగారు ఏమడిగితే అది తెచ్చిపెడుతూ, ఆమె కళ్లలో కాటుక తడవకుండా చూసుకుంటూ వస్తున్నారు.

బీబీగారు చిన్నమనిషి కాదు. నా మొగుడు సిపాయి, నా మొగుడు పైల్వాను అనుకుంటూ వుండేవారు.

సరే వాళ్లున్న యింటి మీదుగా రోజూ ఒక ఏనుగు దాని మానాన అది కాలువకు స్నానానికి పోతూ వుండేది. ఒకరోజు అది రోజులాగే స్నానానికి పోతూ వుంటే అప్పుడే స్నానానికి సిద్ధమవుతున్న నక్కబీబీగారు దాన్ని చూశారు. ఆ టైములో నక్కబీబీగారి ఒంటి మీద నూలుపోగు లేదు. అందువల్ల ఆవిడ సిగ్గుతో చచ్చిపోయి, గబగబా చీర చుట్టుకొని యింట్లోకి పరుగు తీశారు. ఆ తర్వాత, అలిగి మంచంమీద పడుకున్నారు.

నక్కసాయెబుగారు కంగారుపడిపోయారు.

'బీబీగారూ. ఏం జరిగింది? చెప్పండి. చెప్పండి?' అని సముదాయించారు.

'చూడండి. నాకూ మానం మర్యాదా గోషా పరదా వున్నాయి. పొద్దున లేస్తే మీ పని మీద మీరు వెళ్లిపోతారు. యింట్లో నేనొక్కదాన్నే వుండాలి. ఎవరైనా కన్నేసి ఏదైనా చేస్తే నేనేం కావాలి? యివాళ నీళ్లు పోసుకుంటా ఉంటే ఏనుగు చూసింది. యిప్పుడు యీ పని చేస్తుంటే చూసింది రేపు ఒంటికి పోతా వుంటే రెండుకు పోతా వుంటే చూస్తుంది. అది రోజూ ఈ దోవన పోతుంటే నాకు చచ్చేంత సిగ్గుగా వుంటోంది. మీరు నా మానం మర్యాదలు కాపాడేవాళ్లయితే దాన్ని చంపి దాని రక్తంతో మన యింటి ముందు కళ్లాపి చల్లండి' అంది నక్కబీబీ.

బీబీగారు అంత మాట అన్నాక నక్కసాయెబుగారు వెనక్కి తగ్గితే ఏం బాగుంటుంది?


'నీ కోరిక నెరవేరుస్తా బీబీ' అని చెప్పి మాట యిచ్చి అడవికి వెళ్లారు.

వెళ్లి ఎక్కడెక్కడి నుంచో నారను సేకరించారు. తాడు పేనారు. పేని ఏనుగు వచ్చే దారిలో అక్కడొక ఉచ్చు, ఇక్కడొక ఉచ్చు అమర్చుకుంటూ వచ్చి తాడు కొసను తన నడుముకు కట్టుకున్నారు. ఏనుగుని ఉచ్చులో బంధించి ఆ తర్వాత చంపాలని ఆయన పథకం.

ఎప్పటిలాగే ఏనుగు స్నానానికి బయలుదేరింది. దారిలో వస్తూ వస్తూ నక్క సాయెబుగారి ఉచ్చులో కాలు పెట్టింది. ఆ ఉచ్చు దానికో లెక్కా? చీమతో సమానం. అందుకని తాడును లాక్కుంటూనే అది తన దారిన తాను పోతూ వుంది. తాడు చివరను సాయెబుగారు నడుముకు కట్టుకున్నారు గదా. అందువల్ల ఆయన్ను కూడా లాక్కుపోతూ వుంది ఏనుగు.

ఇది సాయెబుగారు ఊహించలేదు. తాడు చివరను నడుముకు కట్టుకుంటే చాలదా, నా బలానికి ఏనుగు ఆగిపోదా అనుకున్నాడు ఆయన. యిప్పుడు కథ తిరగబడేసరికి బిత్తరపోయి 'ఓలమ్మో ఓరినాయనో' అని గోల మొదలుపెట్టారు. ఆ అరుపులకీ కేకలకీ ధర్మపత్ని అయిన నక్కబీబీగారు యింట్లో నుంచి బయటికొచ్చి చూశారు.

సాయెబుగారిని ముళ్లల్లో పొదల్లో రాళ్లల్లో రప్పల్లో లాక్కుని పోతూ వుంది ఏనుగు. తమాషా ఏమిరా అంటే అసలా ఏనుగుకి ఆ దోవలో



ఒక నక్కబీబీగారు ఒక నక్కసాయెబుగారు కాపురం వుంటున్నారని గానీ, నక్కబీబీ గారు తనని చూసి సిగ్గుపడుతున్నారనిగానీ, తనని చంపడానికి వాళ్లు పథకం వేశారని గానీ, ఉచ్చు పన్నారనిగానీ ఏమీ తెలియదు. మహరాజులకి అల్పసంగతులు పడతాయా? పట్టవు. అందుకే అది పోతూ పోతూ వుంటే వెనుక కుయ్యోమొర్రో అంటున్నారు సాయెబుగారు. ఆయన వెంట బీబీగారు లబోదిబోమంటున్నారు.

'ఓరయ్యో నా మానం పోతే పోయింది మీరు దక్కితే చాలు. ఓరయ్యో నా మర్యాద పోతే పోయింది మీరు దక్కితే చాలు. ఓరయ్యో నా గోషా పోతేపోయింది మీరు దక్కితే చాలు. ఓరయ్యో నా సిగ్గు పోతే పోయింది మీరు దక్కితే చాలు' అని శోకండాలు తీస్తున్నారు బీబీగారు.

ఎన్ని శోకండాలు తీసినా నక్కసాయెబుగారు వెనక్కి వస్తారా? ఏనుగుతోపాటు కాలువలో మూడు మునకలు మునిగి చావుతప్పి కన్ను లొట్టపోయి ఎట్టో బతికి బయటపడి చెంపలు వేసుకున్నారు పాపం.



# నక్టామామూ

## మొర్రి మామ

ఒకూళ్లో ఒకామెకి ఏడుగురు కొడుకులు. ఎందరు? ఏడుమంది.

ఏడుమందికీ పెళ్లిళ్లయ్యాయి. ఏడుగురు కోడళ్లూ వచ్చారు. అయితే వాళ్లల్లో ఆరుగురు కోడళ్లు ఉన్నోళ్లు. చిన్నామె లేనిది.

ఉత్త డబ్బే కాకుండా నా అన్న వాళ్లు ఎవ్వరూ లేని ఆ కోడల్ని కేవలం పిల్ల చాలా అందంగా వుంది కదా అని చేసుకొని తెచ్చుకున్నారు.

తెచ్చుకున్నారనే గానీ అత్తకు ఈ కోడలంటే చులకన. పండగలూ, పబ్బాలూ వస్తాయి గదా అప్పుడు ఆరుగురు కోడళ్ల అమ్మా నాన్నలు వచ్చి ఆ కోడళ్లను పుట్టిళ్లకు తీసుకెళ్లి పాకంపూరీలు, లడ్డూలూ, కారాగీరా యిచ్చి పంపుతారు గదా వాటన్నింటినీ చూసినప్పుడు మాత్రం అత్తకు చిన్నకోడలంటే యింకా కోపం వచ్చేసేది.

'చీరా సారె సంగతి పక్కనపెట్టు. ఆఖరకు పుల్లటి పండుని కూడా నీ ముఖాన కొట్టేవాళ్లు ఎవ్వరూ లేకపాయెనే. నీదీ ఒక బతుకేనా? అయినవాళ్ల రైకగుడ్డకు కూడా నోచుకోని బతుకు?' అని దెప్పిదెప్పి పొడిచి చంపేది.

ఆ దెప్పులను సహించి సహించి యింక వల్లగాక ఒకరోజు ఏడ్చుకుంటూ ఏడ్చుకుంటూ వెళ్లి చెరువు గట్టున కూర్చుంది చిన్నకోడలు.

కూర్చుని 'యా ఖుదా. ఏమి నా రాత యిలా రాసిపెట్టావు. అమ్మా నాన్నను ఎలాగూ మిగల్చకపోతివి. తమ్ముడూ చెల్లెలిను లేకుండా చేస్తివి. ఆఖరుకు ఒక వెర్రి మేనమామనో, మొర్రి మేనమామనో అన్నా యివ్వకపోతివి. నాకే గనక ఒక మేనమామ వుండుంటే యివాళ యిన్ని మాటలు పడాల్సి వచ్చేదా? వాడొచ్చి నన్ను పుట్టింటికి తీసుకెళ్లి చీరా సారె పెట్టి పంపుండేవాడు కదా' అని దేవుడికి మొరపెట్టుకొని యింటికి చేరింది.

యింటికి చేరేసరికి దేవుడు ఆమె మొర విన్నాడా అన్నట్టుగా ఒక 'గ్రహణం మొర్రిమామ' వచ్చేసున్నాడు. వాడు చప్పిడి ముక్కుతో, చీలిన పెదాలతో తత్తపాత్త మాటలు మాట్లాడతా గలాటా గలాటా చేస్తున్నాడు.

'ఎక్కలా? మా అమ్మాయి ఎక్కలా? చీల తెచ్చా. సాలె తెచ్చా. మా అమ్మాయికి బలేబలేతివి తెచ్చా. ఎవలూ లేలనుకుంతున్నారా? మా అమ్మాయికి నేనున్నా. మొల్లిమామని. ఖబల్దాల్' అని దబాయిస్తా ఉన్నాడు.

చిన్నకోడలు బిత్తరపోయింది యిది చూసి. వీడెవడబ్బా, వీణ్ణెప్పుడూ నేనూ చూళ్లేదే అనుకుంది.



వాస్తవానికి వాడెవ్వడ్రా అంటే చెరువు గట్టున కూర్చుని ఈమె దేవుడికి మొరపెట్టుకుంటా వుంటే విన్న తిక్కల షైతాను. పిల్ల బంగారం లాగ వుండేసరికి మేనమామ అవతారం ఎత్తి పెళ్లి చేసుకుందాం అనుకొని దాపురించాడు. ఈ సంగతి ఎవరికి తెలుసు? ఎవ్వరికీ తెలియదు.

మొఱ్ఱిమామ తెచ్చిన కానుకలూ గీనుకలూ అన్నీ చూసి అత్త ఖుష్ ఖుష్ అయిపోయింది. అంతటితో ఆశ తీరక 'ఏనాటి మేనమామో ఈనాడు చూడను వచ్చాడు. వెళ్లమ్మా వెళ్లు. వెళ్లి మీ మేనమామ యింట్లో నాలుగు రోజులు వుండిరా. చీరా సారె తెచ్చుకో పో వెళ్లు' అంది చిన్నకోడలితో.

చిన్నకోడలు అయోమయపడి సరేనని గుఱ్ఱమెక్కి మొఱ్ఱిమామతో బయలుదేరింది.

మొఱ్ఱిమామ గుఱ్ఱాన్ని దౌడు తీయిస్తా, దౌడు తీయిస్తా సగం దారి వెళ్లాక ఒక్క తాపు తన్ని దారి మళ్లించి అడవికి పట్టించాడు. కోడలికి అనుమానం వచ్చేసింది. అయినా భయం భయంగా 'యిదేంది మామూజాన్. యిటు దారి మళ్లించావు?' అని అడిగింది.

'మామూజాన్‌ని కాదు. మొగులని పిలువు. మొగులని పిలువు' అన్నాడు మొర్రిమామ గుర్రాన్ని దౌడు తీయిస్తా.

చిన్నకోడలి గుండెలు చల్లబడిపోయాయి. అయినా ధైర్యం తెచ్చుకొని కూర్చుంది.

మొర్రిమామ నేరుగా అడవిలో వున్న తన యింటికి తీసుకెళ్లాడు చిన్నకోడలిని. అక్కడ బంగారం, వెండీ, జరీ గిరీ అంతా కుప్పలు కుప్పలుగా పడి వున్నాయి.

'ఈ బంగాలం జలీ అంతా నీకే. పెత్తుకో పెత్తుకో, కత్తుకో కత్తుకో' అన్నాడు మొర్రిమామ.

ఆ తర్వాత 'పదా పెళ్లి చేసుకుందాం' అన్నాడు గంతులేస్తా.

అప్పుడు చిన్నకోడలు లోన బితుక్కుమని, పైకి నవ్వి 'మామూజాన్. ఏంది మీరు మాట్లాడేది? ఒక ఆడది ఒక మొగోడు వుంటే పెళ్లి జరిగిపోతుందా? చేసుకోక చేసుకోక చేసుకుంటున్నాం పెళ్లి. ఒక పలావు వండక్కర్లేదా? ఒక తిరగమాత ఉండక్కర్లేదా? మీరు వెళ్లి మాంసం, బియ్యం తీసుకురండి. అన్నీ వండుకుని అంతా సిద్ధం చేసుకుని అప్పుడు చేసుకుందాం పెళ్లి' అంది.

ఆ మాటకి మొర్రిమామ ఎగిరి గంతేశాడు.

'అత్తానే తెత్తాను. అడిగినవన్నీ తెత్తాను' అని రాగాలు తీసుకుంటా గుర్రమెక్కి వెళ్లిపోయాడు.

వాడిని అలా పోనిచ్చి, బతికామురా తండ్రీ అనుకొని, గబగబా దొరికినంత బంగారం, వెండి గిండీ అంతా మూటగట్టుకొని, ఒక పిల్లిని కోసి పొయ్యి మీద వేలాడదీసి, మొర్రిమామ బట్టలు కట్టుకొని, వాడిలాగా వేషం వేసుకొని, గుర్రం ఎక్కి బయలుదేరింది చిన్నకోడలు.

ఆమె యిటువైపు నుంచి బయలుదేరితే వాడు అటువైపు నుంచి మాంసం గీంసం తీసుకుని వస్తున్నాడు.

వాడికి దూరంగా ఈవిడొస్తున్న గుర్రం, గుర్రం మీద మనిషీ కనిపించారు. వాడు అనుమానంగా అటువైపు చూస్తూ -

'ఈ గుల్లం నాది.

ఈ బత్తలు నావి. ఈ బస్తాలు నావి.

మనిషెవలో తెలియడం లేదే' అనుకున్నాడు.

మళ్లీ కొంచెం దూరం వచ్చాడు. ఆమె కూడా గుర్రాన్ని దౌడు తీయిస్తా యింకొంచెం దగ్గరయ్యింది. మళ్లీ కళ్లు చికిలించి చూశాడు. చూసి -'ఈ గుల్లం నాది.

ఈ బత్తలు నావి. ఈ వేషం నాది

మనిషెవలో తెలియడం లేదే' అనుకున్నాడు.

వాడు అసలే పెళ్లి ఆనందంలో వున్నాడు గదా. అందుకని ఆ ఎవరోలే అనుకొని వాడి కళ్ల ముందు నుంచే చిన్నకోడలు పారిపోతున్నా పట్టించుకోకుండా యింటికి చేరాడు.

చేరేసరికి లోపల నుంచి పిల్లి రక్తం బాండిలిలో పడి చుర్రు చుర్రుమని శబ్దం వస్తా వుంది.

ఒక్కో చుక్క చుర్రుమన్నప్పుడల్లా 'అబ్బో. నా పెల్లాం హప్పలు చేస్తా ఉంది' అని గంతులేస్తున్నాడు. యింకో చుక్క చుర్రుమన్నప్పుడల్లా 'అబ్బో. నా పెల్లాం పప్పులు చేస్తా ఉంది' అని గంతులేస్తున్నాడు.

అలా చేసి చేసి లోపలికెళ్లి చూస్తే ఏముంది తల తెగిన పిల్లి!

ఓసి కంత్రీదానా జారుకున్నావా, అని మళ్లీ గుర్రం తీసుకుని బయలుదేరాడు పట్టుకొద్దామని.

అప్పటికి చిన్నకోడలు గబగబా యిల్లు చేరి, తెచ్చిన నగానట్రా అంతా అత్త ముఖాన కొట్టి 'కానుకల పిచ్చిలో పడి నన్ను తీసుకెళ్లి షైతాను చేతిలో పెడతావా? నువ్వు బిడ్డల్ని కన్న తల్లివా యింకేమైనానా?' అని ఏడ్చింది.

అత్త మనసు కరిగిపోయింది. అందరూ చేరి 'ఏమైంది ఏమైంది' అని అడిగారు.

'యిట్టిట్టా సంగతి. యిప్పుడా మొర్రోడు వస్తాడు. ఏం చేస్తారో చేయండి' అంది చిన్నకోడలు.

అందరూ కలిసి గబగబా యింటి ముందు ఏడు నిలువుల గోతి తవ్వి, దాని మీద పుచ్చుదారాల మంచం వేసి దుప్పటి పరిచి ఏమీ

ఎరగనట్టుగా కూర్చున్నారు. కాసేపటికి డూం డాం అంటూ మొర్రిమామ వచ్చాడు.

'ఎక్కల? అమ్మాయి ఎక్కల? యిక్కలకు వచ్చిందా?' అని అడిగాడు.

'అయ్యో రాలేదే. ఎక్కడికి పోయింది. వస్తుందిలేండి. కూర్చోండి' అని మంచం చూపించింది అత్త.

'కూచుంతా. కూచుంతా. అమ్మాయి గనక వస్తే దాని సంగతి చెబుతా' అని మొర్రిమామ ముందూ వెనుకా చూసుకోకుండా వెళ్లి పుచ్చుమంచం మీద కూర్చున్నాడు.


అంతే పుటుక్కున మంచం విరిగి ఏడు నిలువుల గోతిలో పడిపోయాడు.

'ఓలమ్మో ఓలి నాయనో నాకు అమ్మాయి వద్దు యింకెవలూ వద్దు బయటికి తీయండి' అని గోల మొదలుపెట్టాడు.

వాడి మాటను ఎవరు నమ్ముతారు? శుద్ధంగా మట్టిపెట్టి వాడిని కప్పెట్టేశారు.

ఆ తర్వాత హాయిగా ఆ బంగారంతో, వెండితో చిన్నకోడలు సంతోషంగా బతికింది.

✪ ఇది మా యిళ్లల్లో పిల్లలకు చాలా యిష్టమైన కథ. మొర్రిమామను 'నక్టామామూ' అంటారు. వాడు చెప్పిన 'మనిషెవలో తెలియడం లేదే' అనే మాట మా యిళ్లలో చాలా పాపులర్. ఎవరైనా మనిషి దూరం నుంచి ఆనవాలు తెలియకపోతే 'ఆద్మీ చోన్‌కి మాలుమ్‌నీ' (మనిషెవలో తెలియడం లేదు) అంటుంటారు సరదాగా.



# ఆకలి - ఆపిల్ పండు

ఒక పుణ్యాత్ముడు పన్నెండు రోజులుగా పస్తు ఉన్నాడు.

పుణ్యం, పాపం, మేలు, కీడు ఎరిగిన ఆ పుణ్యాత్ముడు న్యాయం, ధర్మం ప్రకారం సంపాదించుకొని తింటూ ఉండేవాడు. అయితే కొన్నాళ్లుగా అతనికి పని లేదు. అందుకని పన్నెండు రోజులుగా పస్తు వున్నాడు. పన్నెండవ రోజున యింక ఆకలికి తాళలేక కాస్త మనసు మళ్లిద్దామని యింటి నుంచి బయటపడి కాలువ వడ్డున నడుస్తున్నాడు.

తెల్లగా జలజలమని పారుతున్న ఆ కాలువలో దూరం నుంచి ఎర్రగా మెరుస్తూ ఒక యాపిల్‌కాయ కొట్టుకొని వస్తూ వుంది. బాగా పండి అల్లంత దూరం నుంచే ఘుమఘుమమని సువాసన వెదజల్లుతున్న ఆ కాయను చూడగానే ఆయనకు నోరూరింది. చేయి సాచి అందుకున్నాడు. ఆకలితో ఉన్నాడు గదా వేరే ఆలోచన లేకుండా తినేసి, ఆ కాలువలోని నీళ్లనే కడుపు నిండుగా తాగాడు. కాని మనసు కాస్త స్థిమితపడ్డాక ఆయనలో ఆందోళన మొదలయ్యింది. ఆ యాపిల్ కాయ ఎవరిది? ఏ పరాయివాని తోటలోనిది? పరుల అనుమతి లేకుండా పరుల సొమ్ము తినడం ఎంత పాపం?

అయ్యో నేనెంత పెద్ద తప్పు చేశాను అనుకుంటూ ఆ కాలువ వెంటే ముందుకు నడిచాడు.

కొంచెం దూరం వెళ్లాక ఆ కాలువకు కారణమైన నది కనిపించింది. ఆ నది వెంట కూడా చాలాదూరం నడిచాడు. అలా నడిచి నడిచి వెళ్లేసరికి ఒకచోట ఒక యాపిల్ తోట కనిపించింది. ఆ తోటలోని ఒక చెట్టు కొమ్మ నదిలోకి వంగి ఉంది. ప్రవాహానికి ఆ కొమ్మకున్న కాయలు రాలి నీళ్లలో పడుతున్నాయి.

'నేను తిన్నది ఈ తోట కాయనే' అనుకున్నాడు పుణ్యాత్ముడు.

తోటమాలి దగ్గరకు వెళ్లి 'అయ్యా. ఈ తోట ఎవరిది?' అని అడిగాడు.

'ఇది రాజుగారిది' అన్నాడు తోటమాలి.

వెంటనే పుణ్యాత్ముడు రాజుగారి కొలువుకి వెళ్లాడు.

'మాలిక్. నావల్ల చాలా పెద్ద తప్పు జరిగిపోయింది. మీరు నాకు దండన విధించకపోతే నా మనసుకు శాంతి లేదు. నా పాపానికి విరుగుడు లేదు' అన్నాడు పుణ్యాత్ముడు.

రాజుగారు కంగారుపడ్డారు.



'ఏం తప్పు చేశావు? ఏం పాపం చేశావు?' అని అడిగారు.

పుణ్యాత్ముడు జరిగిందంతా చెప్పాడు.

'తమరి అనుమతి లేకుండా తమరి సొమ్ము ఆరగించాను. పరుల సొమ్ముని సొంతం చేసుకున్నాను' అన్నాడు పుణ్యాత్ముడు.

రాజుగారు లోలోపల ఎంతో పొంగిపోయారు. యింత మంచివాడు, యింత నీతిమంతుడు తన దగ్గర ఉండక తప్పదు అనుకున్నారు.

'సరే అయితే. మీరు పన్నెండేళ్లపాటు నా దగ్గరే వుండి నాకు సేవలు చేయండి' అన్నారు.

పుణ్యాత్ముడు మారు మాట్లాడకుండా 'మహాభాగ్యం' అన్నాడు.

ఒక్క యాపిల్‌కాయ తిన్నందుకు పన్నెండేళ్ల సేవను అంగీకరించిన ఆ పుణ్యాత్ముణ్ణి దర్బార్‌లో ఉన్నవాళ్లందరూ పిచ్చివాణ్ణి చూసినట్టు

చూశారు.

పన్నెండేళ్లు గడిచాయి.

ఈ పన్నెండేళ్లపాటు ఒక్క మాట కూడా మాట్లాడకుండా, ఒక్క తప్పు కూడా చేయకుండా దర్బార్‌లో వుంటూ సేవలందించాడు పుణ్యాత్ముడు.

పన్నెండేళ్ల తర్వాత 'మాలిక్. నేటితో నేను ఆజాద్‌నయ్యాను. సెలవిప్పించండి' అన్నాడు రాజుగారితో.

'అలాగే. కానీ నువ్వు చేసిన తప్పుకు అనుభవించాల్సిన శిక్ష యింకా ఉంది' అన్నారు రాజుగారు.

'అలాగా. కానివ్వండి' అన్నాడు పుణ్యాత్ముడు.

'నాకో కూతురు ఉంది. అది చూపుకు గుడ్డిది. శబ్దానికి చెవిటిది. మాటకు మూగది. నడకకు కుంటిది. దానిని నిఖా చేసుకోవాలి' అన్నారు రాజుగారు.

పుణ్యాత్ముడు ఆలోచనలో పడ్డాడు. యాల్లా... నా నసీబ్ (తలరాత)లో యిలాంటి అమ్మాయిని రాసిపెట్టావా? సరే కానీ. అవిటిదైన ఒక ఆడపిల్లకు భర్తనై ఆమెకు సేవలు చేయడం కంటే వేరే భాగ్యం వుంటుందా అనుకుని 'తమరి ఆజ్ఞ' అన్నాడు రాజుగారితో.

నిఖా జరిగిపోయింది.

తొలిరేయి గదిలో అడుగుపెట్టి అమ్మాయిని చూశాడు పుణ్యాత్ముడు. చూస్తే ఏముంది అట్లాంటి అప్సరస, సౌందర్యవతి, కన్ను కాలు ముక్కు చెవులూ తీర్చిదిద్దినట్టున్న బొమ్మ మరెక్కడా ఉండదన్నట్టు ఉంది.

పుణ్యాత్ముడు గాబరాపడిపోయాడు. యిదేమిటి వేరే గదిలోకి వచ్చేశానా అనుకొని గబాల్న తలుపులు తెరుచుకొని బయటపడ్డాడు.

రాజుగారు బయటే నిలుచొని ఉన్నాడు.

'నువ్వు వస్తావని నాకు తెలుసు' అన్నారు రాజుగారు.


'మాలిక్. లోపల ఉన్నది మీ అమ్మాయి కాదు. ఎవరో అప్సరస' అన్నాడు పుణ్యాత్ముడు.

'కాదు మా అమ్మాయే' అన్నారు రాజుగారు.

'మరి మీరు చూపుకు గుడ్డిది. శబ్దానికి చెవిటిది. మాటకు మూగది. నడకకు కుంటిది అన్నారు గదా' అన్నాడు పుణ్యాత్ముడు.

'అవును. నా కూతురు చూపుకు గుడ్డిదే. ఇప్పటివరకూ నన్ను తప్ప మరే పరాయి మగాణ్ణి అది కన్నెత్తి చూడలేదు. శబ్దానికి చెవిటిదే. నా మాటలు తప్ప యింకే మగాడి మాటలు అది వినలేదు. మాటకు మూగదే. నాతో తప్ప యింకెవ్వరితోనూ మాట్లాడలేదు. నడకకు కుంటిదే. నా ఆసరాతో తప్ప యింకెవరి భుజానా చెయ్యి వేసి నడవలేదు. నిన్ను పరీక్షిద్దామని అలా చెప్పాను. నా పరీక్షలో నెగ్గి నా వరాలతల్లికి సరైన జోడివి అనిపించావు' అని ఆ పుణ్యాత్ముణ్ణి ఆశీర్వదించి లోపలికి పంపారు రాజుగారు.

అట్లా ఆ పాతకాలం మనిషి ఒక్క యాపిల్‌కాయ తిన్నందుకు శిక్ష అనుభవించబోయి ఆ దేశానికి రాజయ్యాడు.



# ఫలాతున్ పిచుక కథ

ఒక పిచుక వెలగ చెట్టు మీద కూర్చుని వెలగపండు తింటా ఉందంట. ఆ దారిన పోతున్న రాజుగారి కొడుకు పోయే వాడు గమ్మున పోకుండా 'పిచుకా పిచుకా నాకో కాయ కోసి పెట్టవా?' అని అడిగాడంట.

'కాళ్లూ చేతులూ సక్కగా ఉన్న రాజుగారి కొడకా నువ్వే కోసుకో' అందంట పిచుక.

నీ సంగతి యిలా ఉందా అనుకున్న రాజుగారి కొడుకు గులేర్ (క్యాట్‌బాల్/ఉండేలు) తీసుకొని రాయి పెట్టి పట్ మని కొట్టాడంట పిచుకను. ఆ దెబ్బకి టప్‌మని కింద పడింది పిచుక.

రాజుగారి కొడుకు లగెత్తుకొని పోయి 'పిచుకా పిచుకా సచ్చావా?' అని అడిగాడు సంబరంగా.

**'ఆ నేనెందుకు సస్తాను. వెలగ చెట్టు మీద వెలగపండు తిన్నాను.**

**రాజుగారి కొడుకు చేతి గులేర్ దెబ్బ తిన్నాను. నేనెందుకు సస్తాను'** అంది పిచుక.

నీ సంగతి యిలా ఉందా అని చెప్పి దానిని తీసుకెళ్లి కాలే కాలే యిసకలో పాతిపెట్టి 'పిచుకా పిచుకా సచ్చావా?' అని అడిగాడంట.

**'వెలగ చెట్టు మీద వెలగపండు తిన్నాను. రాజు గారి కొడుగు చేతి గులేర్ దెబ్బ తిన్నాను.**

**యిప్పుడు కాలే కాలే యిసుకలో కూర్చుని బటాణీలు కాలుస్తున్నాను. నేనెందుకు సస్తాను?'** అంది పిచుక.

నీ సంగతి యిలా ఉందా అని చెప్పి దానిని తీసుకెళ్లి పచ్చి పచ్చి బురదలో పాతిపెట్టి 'పిచుకా పిచుకా సచ్చావా?' అని అడిగాడంట.

**'వెలగ చెట్టు మీద వెలగ పండు తిన్నాను. రాజుగారి కొడుకు చేతి గులేర్ దెబ్బ తిన్నాను.**

**కాలే కాలే యిసకలో బటాణీలు కాల్చాను. యిప్పుడు పచ్చి పచ్చి బురదలో పడుకొని పల్లీలు నములుతున్నాను.**

**నేనెందుకు సస్తాను'** అంది పిచుక.

నీ సంగతి యిలా ఉందా అని చెప్పి దానిని తీసుకెళ్లి పొయ్యిలో పడేసి 'పిచుకా పిచుకా సచ్చావా?' అని అడిగాడంట.

**'వెలగ చెట్టు మీద వెలగపండు తిన్నాను. రాజుగారి కొడుకు చేతి గులేర్ దెబ్బ తిన్నాను.**

**కాలే కాలే యిసకలో బటాణీలు కాల్చాను. పచ్చి పచ్చి బురదలో పల్లీలు నమిలాను.**

**యిప్పుడు అత్తమ్మతో కలిసి అన్నం వండుతున్నాను. నేనెందుకు సస్తాను?'** అంది పిచుక.

నీ సంగతి యిలా ఉందా అని  కోసి కూర చేసుకొని తిని 'పిచుకా పిచుకా సచ్చావా?' అని అడిగాడంట.

**'వెలగ చెట్టు మీద వెలగపండు తిన్నాను. రాజుగారి కొడుకు చేతి గులేర్‌దెబ్బ తిన్నాను.**


**కాలే కాలే యిసకలో బటాణీలు కాల్చాను. పచ్చి పచ్చి బురదలో పల్లీలు నమిలాను.**

**అత్తమ్మతో కలిసి అన్నం వండాను. యిప్పుడు రాజుగారి కొడుకు పొట్టలో చేరి వాడు తినే పంచభక్ష పరమాణ్ణాలన్నీ కమ్మగా ఆరగిస్తున్నాను'** అంది పిచుక.

రాజుగారి కొడుక్కి యింకేం చేయాలో అర్థంగాక పెళ్లానికి చెప్పి చారు చేయించుకొని, బేది మాత్ర వేసుకొని చారన్నం తిన్నాడు.

వెంటనే బేదిలో నుంచి బయటపడి బుర్రున ఎగిరిపోయింది ఆ ఫలాతూన్ పిచక.

✪ ఈ కతను ఇంకా ఎంత పొడవైనా సాగదీయవచ్చు. అవధానంలాంటి కథ ఇది. ప్రతిసారీ అన్ని పాదాలూ చెప్పాలి.



# హమ్‌న హలాల్ తుమ్‌న హరామ్

## మేము తినదగ్గది మీరు తినకూడనిది

ఇద్దరు ఆడపిల్లలు ఉన్న ఒక యింట్లో పేదరికం తాండవిస్తా ఉంది.

ఒకపూట తినక, ఒకపూట తిని ఆ ఆడపిల్లలు, ఆ పిల్లల తల్లిదండ్రులు ఎలాగో ప్రాణాలు నిలబెట్టుకొని వస్తా ఉన్నారు.

కొన్నాళ్ల తర్వాత అట్లా ఒక్కపూట తినే భాగ్యం కూడా పోయింది. రెండు రోజులు పస్తు వుండేసరికి ఆడపిల్లల ప్రాణాలు లాగతా ఉన్నాయి.

మూడోరోజు వాళ్లల్లో ఒకమ్మాయి తినడానికి ఏదో ఒకటి దొరకకపోదా అని ఆ చెట్లవైపు, ఈ దిబ్బల వైపు వెతుకుతూ తిరిగింది. కొంతసేపు తిరిగాక ఒకచోట ఆమెకు చచ్చి పడున్న ఒక పావురాయి కనిపించింది. ఈ పూటకి యిదే పదివేలు అనుకొని, ఆ పావురాయిని దావ్‌నీ (పవిట)లో భద్రంగా చుట్టుకొని యింటికి చేరింది.

కూతురు తెచ్చిన పావురాయిని చూసి కళ్లనీళ్లు పెట్టుకుంది తల్లి.

ఎంత ఆకలితో ఉంటే ఈ పిల్ల ఈ పని చేసి వుంటుందోగదా అనుకొని, పావురాయిని శుభ్రం చేసి, కాసింత ఉప్పుగల్లు వేసి పొయ్యి మీద పడేసింది.

కాసేపటికి ఆ కూర దబరలో నుంచి యిలాంటి సువాసన వస్తోందంట యిలాంటి సువాసన వస్తోందంట చుట్టుపక్కల ఇళ్లకు కూడా ఆ వాసన గమగమమని సోకిందంట.


వీళ్లున్న యింటి పక్కనే బాగా డబ్బున్న ఒక వర్తకుడి యిల్లు ఉంది.

ఆ యిల్లుగల్లామెకు కూడా ఆ వాసన సోకింది.

ఎప్పుడూ లేనిది వీళ్ల యింటి నుంచి యింత మంచి కూర వాసన వస్తోందేమిటా అనుకుని 'ఏమ్మా? ఏం కూర?' అని అడిగిందామె.

చనిపోయిన పావురాయిని వండుకుని తింటున్నామని చెప్పి గతిలేనితనాన్ని బయటపెట్టుకోవడం ఎందుకుని 'హమ్‌న హలాల్ - తుమ్‌న హరామ్' అంది ఆ ఆడపిల్ల తల్లి.

అంటే 'మేము తినదగ్గది. మీరు తినకూడనిది' అని భావం.



ఆ జవాబుకి వర్తకుడి భార్యకు కోపం వచ్చింది. వాళ్లు తినదగ్గ కూర మేము తినకూడని కూర ఏమై వుంటుంది? ఈ పక్కింటి వాళ్లు ఏదో అవమానం చేయడానికే యిలాంటి మాట అనుంటారు అనుకుని భర్తకు కబురు పంపించింది.

ఆ టైంకు ఆ వర్తకుడు 'హజ్' (మక్కాయాత్ర) కోసం దాచుకున్న డబ్బుని లెక్కపెట్టుకుంటూ ఉన్నాడు.

ఆ డబ్బుతో అతడు ఆ రోజో, ఆ మర్నాడో హజ్‌కు బయలుదేరాలి.

ఈ తగాదా విని 'ఏమిటి సంగతి' అని అడిగాడు యింటికి వచ్చి.

'చూడండి ఆ పక్కింటి వాళ్లకు ఎంత పొగరుగా ఉందో. ఏం కూర అని అడిగితే మేము తినదగ్గది మీరు తినకూడనిది అని జవాబు చెప్పారు. దీని సంగతేందో కనుక్కోండి' అన్నదామె.

వర్తకుడు ఆ ఆడపిల్లల తండ్రిని పిలిచాడు.

'ఏంటయ్యా ఈ గొడవ?' అని అడిగాడు.

'అయ్యా. మరేం లేదు. ఎవడైనా ఏ మాంసాన్నయినా బతికుండగానే జుబా (బిస్మిల్లా) చేసి తినాలి. చనిపోయినవాటిని తినకూడదు. అది మన మతరీతి. కానీ ఆకలితో అల్లాడిపోయే పేదవాళ్లకు ఈ రీతులూ రివాజ్‌లూ లెక్కలోకి వస్తాయా? రెండునాళ్లుగా యింట్లో తినడానికి ఏమీ లేకపోతే నా కూతురు చనిపోయిన పావురాయిని తెచ్చి వంట చేస్తూ వుంది. అట్లాంటి కూర మాబోటి వాళ్లు తినదగ్గదే అయినా మీబోటి వాళ్లు తినకూడనిది కదా. అందుకనే నా భార్య అలా చెప్పింది' అన్నాడు.

ఆ సంగతి విని వర్తకుడికి ఏడుపు వచ్చింది.

ఎక్కడో ఏడు సముద్రాల అవతల ఉన్న మక్కాను చూడాలనుకుంటున్నాను గానీ ఏడడుగుల దూరంలో వున్న పొరుగువారి కష్టసుఖాలు చూడలేకపోతున్నాను గదా. ఇవి చూడనప్పుడు అది చూసి ఫలితమేమి? అనుకొని అప్పటికప్పుడు తన హజ్ డబ్బులన్నీ ఆ పేదవాళ్లకు యిచ్చి - యికమీదట మీ కష్టనష్టాలు నేను పంచుకుంటాను అని మాట యిచ్చాడు. తన హజ్ యాత్ర మానుకున్నాడు.

అతడితోపాటు హజ్‌కు వెళ్లాల్సిన యితర వర్తకులు హజ్‌కు వెళ్లి నమాజ్‌లో నిలుచున్నారు.

కానీ వాళ్ల కళ్లకు ముందు వరుసలో నిలుచుని నమాజ్ చదువుతున్న ఈ వర్తకుడు కనిపించాడు.

వాళ్లు ఆశ్చర్యపోయి ఊరికి తిరిగి వచ్చి, 'ఏమయ్యా పెద్దమనిషి, మాతో హజ్‌కు రానని చెప్పి మాకన్నా ముందువరసలో నమాజ్ చేస్తూ కనిపించావే' అని అడిగారు.

వర్తకుడు ఆశ్చర్యపోయి జరిగింది చెప్పాడు.

పొరుగువారికి సాయపడటం కన్నా అంతిమ పరమార్థం మరొకటి లేదనీ, అందుకనే అతడు హజ్‌కు వెళ్లకపోయినా వెళ్లినంత పుణ్యం దక్కిందనీ వాళ్లు గ్రహించి లెంపలు వేసుకున్నారు.



# మూడు ఖర్చులు

మంచి కరువు కాలాన ఒక పెద్దాయన ఒకచోటు నుంచి యింకోచోటుకు ప్రయాణం పెట్టుకున్నాడు. కరువు రోజుల్లో చుట్టుపక్కలు ఎలా వుంటాయో తెలిసిందే గదా. ఎండిపోయిన పైర్లు. పగుళ్ళిచ్చిన నేలలు. నీళ్లింకిపోయిన చెరువులు. అల్లాడుతున్న జనం. ఆహా కలికాలం వచ్చేసింది గదా అని అదంతా చూసుకుంటూ వస్తున్నాడంట పెద్దాయన.

కొంతదూరం వచ్చాక ఆయనకు ఒక పొలం కనిపించింది. అది పచ్చగా కళకళలాడతా వుంది. ఓర్ని యిదేందిరా సామీ అని చూస్తున్న పెద్దాయనకు కాసేపటికి ఆకాశాన కదిలొస్తున్న ఒక నల్లటి మబ్బు కనిపించింది. అది ఆ పొలం ఎంతవరకు ఉందో అంత వరకే వచ్చి నిలబడింది. నిలబడి ఆ పైరుకు ఎంత వాన కావాలో అంత వానా కురిపించి వెళ్లిపోయింది.

ఇదంతా చూసి పెద్దాయనకు మతిపోయింది. ఆ పొలంలో దిగి పనులు చేసుకుంటున్న రైతు దగ్గరికి వెళ్లి 'ఏమయ్యా. నేను యింతదూరం నుంచి వస్తున్నాను. ఎక్కడా పచ్చి గరిక కూడా మొలిచుండలేదు. నీటిచుక్క కురిసుండ లేదు. నీ పైరేమో విరగపండుతోంది. నీపైనే వాన కురుస్తా వుంది. ఏమి ఈ మాయ? అని అడిగాడు.

'ఏమో సామీ. నాకేమి తెలుసు. నేను యవసాయం చేయడం మొదలెట్టినప్పటి నుంచి ఎవరికి వానలు కురిసినా కురవకపోయినా నా చేనుకి వాన కురస్తానే వుంది. ఎవరికి పండినా పండకపోయినా నా చేను పండుతానే వుంది' అన్నాడు ఆ రైతు.

'కాదు. యిందులో ఏదో మతలబు వుండే వుంటుంది. నీ జమాఖర్చుల సంగతేందో చెప్పు' అన్నాడు పెద్దాయన.

'ఏమి లేదు సామీ. పంట పండించాక వచ్చిన సొమ్ముని నేను మూడు ఖర్చులుగా విడగొడతాను. ఒక ఖర్చు నా యింటికీ సంసారానికీ వుంచుకుంటాను. ఒక ఖర్చుని పంటకీ విత్తనాలకీ పాడికీ పశువుకీ వుంచుకుంటాను. మూడో ఖర్చుని పేదలకీ సాదలకీ పంచిపెడతాను' అన్నాడు రైతు.

'అదీ. అలా చెప్పు. యింక నీకు కురవకపోతే యింకెవరికి కురుస్తుందయ్యా వాన' అని వెళ్లిపోయాడు ఆ పెద్దాయన.

✪ ఈ కతను మా చిన్నపుప్పు భర్త రహిమాన్ పుప్పా చెప్పాడు. ఆయన ఒకప్పుడు రైతు. ఇప్పుడు మసీదులో మౌజన్.



# తైమూరు రాజు - చీమ

తైమూరు మహారాజుకి కాస్త కాలు కుంటి. మనిషి కొంచెం భయస్తుడు కూడా.

ఒకసారి శత్రుదేశం రాజు పెద్దపెద్ద సైన్యంతో దండెత్తి వచ్చేసరికి తైమూరు రాజు భయపడిపోయి మహలు వదిలి దూరంగా కొండల్లోకి పారిపోయాడు. అక్కడ ఒక గుహలో తల దాచుకున్నాడు.

'శత్రువు చాలా బలవంతుడు. నేను వాణ్ణి చంపలేను. యింక నా పని యింతే' అని కుమిలిపోతున్న ఆయనకు దూరంగా ఒక చీమ కనిపించింది.

అది సూది మొనంత ఉంది.

అయితే దానికంటే పదింతలున్న చిక్కుడు గింజను వీపున వేసుకొని రాయెక్కే ప్రయత్నం చేస్తా ఉంది.

అది చూసి నోరు తెరిచాడు తైమూర్‌రాజు.

'యిదింత చిన్నదిగా ఉంది... చిక్కుడు గింజను మోసేది నిజమేనా' అని చూస్తా ఉన్నాడు.

చీమ అష్టకష్టాలు పడి, కొంచెం దూరం ఎక్కి, యింక ఎక్కలేక దబదబమని కిందకు జారిపోయింది.

చిక్కుడుగింజ కూడా దొర్లిపోయింది.

'నేను ముందే అనుకోలా... అసాధ్యం' అనుకున్నాడు తైమూరు రాజు.

చీమ మళ్లీ గింజను వెతుక్కుని, దానిని వీపు మీద వేసుకొని మళ్లీ రాయి ఎక్కడం మొదలుపెట్టింది.

తైమూరు రాజు మళ్లీ నోరెళ్లబెట్టుకుని చూస్తున్నాడు. అది యీసారి సగానికంటే ఎక్కువ దూరం ఎక్కి, ఆ తర్వాత పట్టుతప్పి జర్రున కిందకు జారిపోయింది.

'చెప్పాగదా... నీవల్ల కాదు' అనుకున్నాడు తైమూరు రాజు.



చీమ మళ్లీ బయలుదేరింది గింజను తీసుకొని. ఈసారి అది జారలేదు. నానా అవస్థలు పడి, నానా శక్తులు కూడదీసుకొని గింజతోపాటుగా రాయి ఎక్కేసింది.

తైమూరు రాజుకు కళ్లు తెరుచుకున్నాయి.

సూదిమొనంత ఉన్న చీమకే అంత పట్టుదల వుంటే చెట్టంత మనిషిని నాకెంత పట్టుదల ఉండాలి... ధైర్యం సాహసం పట్టుదల ఉంటే మనకంటే పదింతల బలవంతుడినైనా మట్టి కరిపించవచ్చు అనుకొని గుహ నుంచి బయటపడి నేరుగా మహలుకెళ్లి అతితక్కువ మంది సైన్యంతోనే శత్రువుని ఎదిరించి గెలుపును చేజిక్కించుకున్నాడు.

ఆ తర్వాత ఆయన వంశంలోనే అక్బర్ వంటి మహాచక్రవర్తులూ, షాజహాన్ వంటి కళాపోషకులూ ఉద్భవించారు.

✪ ఈ కథ మా యిళ్లలో చెప్పుకుంటారు. చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కి ఉంది.



# యా బలఖ్ యా బాషా

బలఖ్ అనే రాజ్యాన్ని ఇబ్రహీం అధుమ్ అనే రాజు పరిపాలించేవాడు. ఆయన పేరు అధుమే అయినా అందరూ ఆయన్ని 'బలఖ్ కా బాషా' అని పిలిచేవారు. ఆయన మహా విలాస పురుషుడు. షోకిల్లా మనిషి. రోజుకి ఏడు జతల బట్టలు తొడిగి ఏడు జతల బట్టలు విడిచేవాడు.

అందుకనే యిప్పటికీ 'అధుమ్ అంతటి రాజు లేడు. ఆయన చేసినంతటి షోకు లేదు' అని సామెత.

అట్లాంటి అధుమ్ రాజు ఒకరోజు రాత్రి హంసతూలికా తల్పం మీద వాలి ఆలోచనలో పడ్డాడు.

'ఏమిరా నా జీవితం. రాజ్యమూ ప్రజలూ షోకులూ షికార్లూ అని చూసుకుంటున్నానే తప్ప దైవచింతన అనేదే చేయడం లేదుకదా. యికమీదట కొద్దోగొప్పో దైవచింతన కూడా చేయాలి' అని అనుకున్నాడు.

అలా అనుకున్న వెంటనే ఆయన ఎదుట ఒక మనిషి నిలబడి కనిపించాడు. అర్ధరాత్రి వేళ, పహారా వేళలో, రాజుగారి ఆంతరంగిక మందిరంలో ఒక ఆగంతకుడు ప్రత్యక్షమవడం చూసి అధుమ్ రాజుకి మతిపోయింది.

'ఏయ్. ఎవరు నువ్వు. ఈ వేళలో ఏం చేస్తున్నావ్? అసలు ఎవరు నిన్నిక్కడకు రానించింది?' అని గద్దించాడు.

అప్పుడా మనిషి 'మహారాజా. మన్నించండి. నా ఒంటె ఒకటి తప్పిపోయింది. మీ మందిరం పైకప్పులో వుందేమోనని వెతుక్కుంటూ వచ్చాను' అన్నాడు.

'ఓయ్ పిచ్చివాడా. ఏం మాట్లాడుతున్నావ్? అంత పెద్ద ఒంటె నా మందిరం పైకప్పులో ఉంటుందా? వెళ్లు వెళ్లు. ఈ పిచ్చితనం మాని వెళ్లు' అన్నాడు అధుమ్ రాజు.

'మహారాజా. పైకప్పులో ఒంటె ఉండటం ఎంత అసాధ్యమో హంసతూలికా తల్పం మీద పడుకున్న మనిషిలో దైవచింతన వుండటం అంత అసాధ్యం' అని ఆ మనిషి అదృశ్యమైపోయాడు.

అధుమ్‌రాజు కళ్లు తెరుచుకున్నాయి. ఈ రాజ్యం, ఈ భోజ్యం వున్న నేను ఎన్నటికీ దైవానికి చేరువ కాలేను అనుకొని అప్పటికప్పుడు రాజ్యాన్ని వదిలేసి ఒక చాప, ఒక దిండు, ఒక చెంబు తీసుకుని అడవులకు బయలుదేరారు.

కొంతదూరం వెళ్లాక ఆయనకు ఒక మనిషి తల కింద చేయి పెట్టుకుని నిద్రపోతూ కనిపించాడు. దేవుడు యిచ్చిన చేయి ఉండగా దిండు ఎందుకు అని దిండు పారేశాడు రాజు. మరికొంతదూరం వెళ్లాక ఒక మనిషి కటిక నేలమీద పడుకుని కనిపించాడు. దేవుడు యిచ్చిన నేల



ఉండగా ఈ చాప ఎందుకు అని దాన్ని కూడా పారేశాడు. మరికొంత దూరం వెళ్లాక ఒక మనిషి దోసిళ్లతో నీళ్లు తాగుతూ కనిపించాడు. దైవం ఇచ్చిన చేతులు వుండగా ఈ చెంబు ఎందుకు అని దాన్ని కూడా పారేశాడు.

అలా వెళ్లి వెళ్లి వెళ్లి ఒక ఔలియా (గురువు) దగ్గర చేరి అనేక ఏళ్లపాటు దైవచింతనలో గడిపాడు రాజు. అయినప్పటికీ ఆయనకు గురుస్థానం రాలేదు.

ఒకసారి ఔలియా గారి భార్య ఔలియాతో 'ఏమండీ. అధుమ్ రాజు అన్నేళ్లుగా సర్వం త్యాగం చేసి దైవచింతనలో వున్నాడు గదా. మరి ఆయనకు దక్కవలసిన స్థానం ఆయనకు యివ్వరా?' అని అడిగింది.

అప్పుడు ఔలియా నవ్వి 'నువ్వు వెనుక నుంచి వెళ్లి నీ మోకాలితో ఆయన వీపు మీద ఒక తాపు తన్నిరా' అన్నారు.

కిందకూర్చుని ఏదో చదువుకుంటున్న అధుమ్‌రాజును వెనుకవైపుగా వెళ్లి మోకాలితో ఒక్కతోపు తోసింది ఔలియాగారి భార్య.

ఆ తోపుకి కిందపడిన అధుమ్‌రాజు అప్రయత్నంగా 'యా బలఖ్ యా బాషా' అన్నాడు.

అంటే 'బలఖ్ రాజ్యానికి రాజంతటివాణ్ణి. నన్ను మోకాలితో తంతావా?' అని భావం.

అప్పుడు ఔలియాగారు తన భార్యతో 'చూశావా? ఇన్నాళ్లూ ఆయన మన దగ్గర వున్నా యింకా రాజన్న సంగతి మర్చిపోలేదు. ముందు రాజు నుంచి మనిషి కావాలి. మనిషి నుంచి దైవప్రియుడు కావాలి' అన్నారు గురువు.

అధుమ్‌రాజు ఆ తర్వాత ఒకటి కాదు రెండు కాదు మొత్తం నలభై ఏళ్లపాటు ఒక కొండ మీద ఏకాంతంగా దైవధ్యానం చేస్తూ జీవించాడు. ఆయన రోజూ ఒక షావుకారు దగ్గరకు వెళ్లి తనకు కావాల్సిన సరుకులు తెచ్చుకుని వండుకుని తినేవాడు.

ఒకరోజు ఆయన షావుకారు దగ్గరకు వెళ్ళి ఖర్జూరాలు కొన్నాడు. అవి తూకం వేసి యిస్తున్నప్పుడు ఒక ఖర్జూరం కింద పడి కనిపించింది. అది తనదే ఏమో అనుకొని దానిని కూడా కలుపుకొని వచ్చేశాడు అధుమ్‌రాజు.

కొండమీదకు చేరుతుండగా 'అయ్ అధుమ్. నలభై ఏళ్లుగా దైవచింతన చేసినందుకు నీకు దక్కిన ఫలం అంతా వృధా అయ్యిందిపో' అనే వాణి వినిపించింది.

అధుమ్ రాజుకు మతిపోయింది. నేనేమి తప్పు చేశాను అని వెర్రివాడిలా ప్రశ్నిస్తుంటే 'పరుల సొమ్మును సొంతం చేసుకున్నావు' అని సమాధానం వచ్చింది.

యింక అధుమ్ రాజుకు ఏం చేయాలో పాలుబోలేదు. అయ్యో ఎంత తప్పు చేశాను ఎంత తప్పు చేశాను అని తపించిపోయాడు. వెంటనే కొన్ని ఖర్జూరాలు తీసుకెళ్లి షావుకారుకు సంగతి చెప్పి ఒకటికి రెండు వాపసు చేయబోయాడు. షావుకారు చాలా ఆశ్చర్యపోయాడు.

'అయ్యా. మీరు మహానుభావులు. నాకు తెలియకుండా నా ఖర్జూరం తినడమే నాకు మహా ప్రసాదం. అలాంటిది మీరు ఒకటికి రెండు వాపసు చేస్తారేమిటి?' అన్నాడు.

'కాదు కాదు. పరుల సొమ్ము అయాచితంగా ముట్టకూడదు. నువ్వు వాపసు తీసుకుని నన్ను క్షమిస్తేనే నేను యిక్కడి నుంచి వెళ్లేది' అన్నాడు.

అలాగే అని క్షమించాడు షావుకారు.

అప్పుడు పైనుంచి 'అయ్ అధుమ్. నలభై ఏళ్లుగా దైవచింతన చేసినందుకు నీకు దక్కాల్సిన ఫలం తిరిగి దక్కిందిపో' అనే వాణి వినిపించింది.

అలా జీవించి జీవించి ఆయన వృద్ధాప్యంలో మక్కాకు చేరాడు. అక్కడే చివరి రోజులు గడుపుతూ వుంటే ఒకసారి బలఖ్ రాజ్యపు యువరాజు అక్కడకు వచ్చాడు. బలఖ్ రాజ్యపు యువరాజంటే ఎవరు? మన అధుమ్‌రాజు కుమారుడే. రాచదుస్తులలో ఎంతో ఠీవిగా ఎంతో సౌందర్యంగా వస్తున్న తన కుమారుణ్ణి చూసుకుని ఒక్క నిమిషం ఆయనలోని తండ్రి మనసు చలించింది.

'అబ్బా. నా కుమారుడు ఎంతటి వాడయ్యాడు' అనుకున్నాడు.

వెంటనే పైనుంచి వాణి వినిపించింది - 'అయ్ అధుమ్. నీకు నేను ప్రియమా? నీ కుమారుడు ప్రియమా?' అని.


అధుమ్ కంగారుపడి 'ప్రభూ. నాకు నువ్వే ప్రియం. నీవు తప్ప నాకు ప్రియమైనది మరేదీ లేదు' అన్నాడు.

'కాదు బాగా ఆలోచించుకో. నీకు నీ కుమారుడు కావాలా? నేను కావాలా?' అని వినిపించింది వాణి.

'ముమ్మాటికీ నువ్వే కావాలి ప్రభూ' అన్నాడు అధుమ్ రాజు.

ఎప్పుడైతే ఆయన ఆ మాట అన్నాడో వెంటనే ఆయన కుమారుడు చనిపోయాడు.

భోగంలో మునిగిన ఆ రాజు అలా చివరి వరకూ అనేక త్యాగాలు చేసి, పరీక్షలకు నిలబడి దైవానికి చేరువ అయ్యాడు.



# ఎంత చేసుకుంటే అంత

గొడ్డుమేకా పిల్లాజెల్లా ఉన్న ఒకామె ఒకరితో పెట్టుకోదు. ఒకరికి పెట్టదు. నేనూ నా వాళ్లూ, నేనూ నా యిల్లూ, నేనూ నా డబ్బు... యిదే ఆమె వాటం. పాలు అమ్ముతుంది. పిడకలు అమ్ముతుంది. అంతే. ఎవరితో ఏ ములాజా పెట్టుకుంటే ఏం సాయం అడుగుతారో అని దూరం దూరంగా వుంటుంది.

ఒకరోజు ఆమె గడప ముందుకు ఒక ఫకీర్ వచ్చాడు.

'అమ్మా. ఖైరాత్ (ధర్మం) చెయ్యి' అని అడిగాడు.

ఆ టైములో ఆమె పేడాగీడా అంతా పోగేసి పిడకలు చేస్తోంది.

'ఖైరాత్ లేదు గీరాత్ లేదు. పోయిరా పో' అంది.

ఫకీర్ కదల్లేదు. 'అమ్మా. దేవుని పేరున ఖైరాత్ చెయ్యి' అన్నాడు మళ్లీ.

'యింట్లో వంట కాలేదు. నేను పనిలో వున్నాను. చేతులు ఖాళీ లేవు. పోయిరా పో' అందామె.

ఫకీర్ కదల్లేదు. 'ఆకలిగా వుంది. ఖైరాత్ చెయ్యి' అన్నాడు వదలకుండా.

పిడకలామెకు ఒళ్లు మండిపోయింది. 'ఆకలిగా వుందా? అయితే ఇది తిను' అని పిడకగా కొట్టబోతున్న పేడముద్దను తీసి ఫకీరు మీదకు విసిరింది. అది వెళ్లి ఫకీరు బొచ్చెలో పడింది.

'నువ్వు యిచ్చిందే తింటా' అని ఫకీరు వెళ్లి బావి దగ్గర కూర్చుని ఆ పేడముద్దని శుభ్రంగా కడిగాడు. కడగగా కడగగా అందులోంచి ఒక పెసలగింజ బయటపడింది. దానిని నోట్లో వేసుకుని తిన్నాడు.

ఏళ్లు గడిచాయి. పిడకలామె ప్రాణం వదిలింది. పైకి వెళ్లింది. పైలోకాలు చాలా బాగున్నాయి. అక్కడ చాలామంది ఉన్నారు. వాళ్లు కలిసి మెలసి ఉన్నారు. అందరూ అన్నీ పంచుకొని తింటున్నారు. కాని పిడకలామెతో ఎవరూ మాట్లాడడం లేదు. ఎవరూ పలకరించడంలేదు. ఈమెను దూరంగా ఒంటరిగా ఒక పెసల చెట్టు కింద వదిలేశారు.

ఆమెకు ఎవరితోనైనా మాట్లాడాలని వుంది. కానీ భూలోకంలో ఆమె ఎవరితోనైనా మాట్లాడి వుంటేగదా. ఆమెకు వాళ్లు తింటున్నది పంచుకొని తినాలని వుంది. కాని భూలోకంలో ఎవరితోనైనా పంచుకొని తిని వుంటే గదా. ఆమెకు వాళ్లతో తన కష్టసుఖాలు చెప్పుకోవాలని వుంది. కానీ భూలోకంలో ఒకరి కష్టసుఖాలు విని వుంటేగదా.

అందరికీ పంచభక్ష్య పరమాణ్ణాలు వస్తుంటే, ఈమెకు మాత్రం పళ్లెంలో ఒక్క పెసలగింజ మాత్రమే వస్తా వుంది.

'యా ఖుదా? యిదేం న్యాయం' అని అనుకుంది పిడకలామె.

అప్పుడు ఒక దూత వచ్చి ఆమెతో యిలా చెప్పాడు. 'చూడమ్మా. బతికినన్నాళ్లు నువ్వు ఎవ్వరికీ ఏ సాయమూ దానమూ చేయలేదు. నువ్వు చేసిందంతా ఒక ఫకీరుకు ఒక పెసలగింజ దానమే. అందువల్ల నీ పేరున యిక్కడ అల్లా ఈ పెసలగింజను నాటాడు. దీనికి ఎంత కాస్తే అంతే నీ తిండి. దీని నీడే నీ యిల్లు. అనుభవించు' అని వెళ్లిపోయాడు.



# భర్రున ఎగిరిపోయిందోచ్

ఒకూర్లో ఒక ఆడపిచ్చుకా, ఒక మగపిచ్చుకా వున్నాయి. ఒకరోజు వాటికి 'ఖిచిడీ' తినాలనే కోరిక పుట్టింది.

'సరుకులెట్లా' అంది ఆడపిచ్చుక.

'అదెంత పని' అంది మగపిచ్చుక.

అని, వెంటనే వెళ్లి కోమటిశెట్టి అంగట్లోని పెసలపప్పు మూటలో నాలుగుసార్లు ముక్కు ముంచి పెసలపప్పు తీసుకొనొచ్చింది. నెయ్యి డబ్బాలో నాలుగుసార్లు ముక్కు ముంచి నెయ్యి తీసుకొనొచ్చింది. టమేటాల మీద వాలి టమేటాలు ఎత్తుకొనొచ్చింది. పచ్చి మిరపకాయల మీద ఎగిరి పచ్చిమిరపకాయలు తన్నుకొచ్చింది. యింక ఏమేమి కావాలో అవన్నీ తీసుకొచ్చి 'యింక వండు' అంది ఆడపిచ్చుకతో.

ఆడపిచ్చుక వంట మొదలుపెట్టింది. వాసనలు గమగమమని వస్తా వున్నాయి. వాటిని పీలుస్తుంటే కడుపులో నుంచి ఆకలి తన్నుకొస్తా ఉంది మగపిచ్చుకకి. గబగబా ఖిచిడీ తినాలనే కోరికతో 'నేను నదికి వెళ్లి రెండు చెంబుల నీళ్లు పోసుకొని వస్తా. త్వరగా వంట పూర్తిచెయ్యి' అని స్నానానికి వెళ్లిపోయింది.

వంట పూర్తిచేసింది ఆడపిచ్చుక. ఎట్లాగూ పూర్తయిపోయింది గదా ఉప్పు చూద్దాం అని కొంచెం ఖిచిడీ తీసుకొని నోట్లో వేసుకుంది. దాని రుచికి 'ట్ట' అని లొట్ట వేసింది. మళ్లీ కొంచెం ఉప్పు చూసింది 'ట్ట' అని లొట్ట వేసింది. యింకోసారి ఉప్పు చూసింది 'ట్ట' లొట్ట వేసింది. అట్లా 'ట్టట్టట్ట' అంటా అంతా అవజేసింది.

యిప్పుడు మొగుడొస్తే తంతాడు నెపం ఎవరి మీద తోయాలా అని ఆలోచిస్తా వుంటే రోజూ స్నానానికి ఆ దోవన పోయే ఏనుగు కనిపించింది.

ఆడపిచ్చుక వంట చేయడం, ఉప్పు చూసే వంకన అంతా తినేయడం అప్పటికే ఏనుగు చూసేసింది. చూసినా ఊర్లో గొడవ మనకెందుకులే అని స్నానానికి వెళ్లిపోయింది.

కాసేపటికి యింటికొచ్చింది మగపిచ్చుక. వస్తే ఏముంది తలకి పట్టీ కట్టుకుని ముక్కుతూ మూల్గుతూ మంచానికి అడ్డంగా పడుకొని వుంది ఆడపిచ్చుక.

'ఏమైంది ఏమైంది' అని అడిగింది మగపిచ్చుక.

'ఏమయ్యేదేముంది? మనం కష్టపడి వండుకున్న ఖిచిడి ఆ మాయదారి ఏనుగొచ్చి తినేసిపోయింది. నా మొగుడికి కొంచెం, నా మొగుడికి కొంచెం అని ఎంత బతిమాలినా కొంచెం కూడా మిగల్చలేదు. నువ్వు గనుక యిప్పుడు పోయి ఆ ఏనుగు తొండాన్ని పొడిచి దాని రక్తం తెచ్చి నా నెత్తికి రాస్తేగాని నేను లేచి కూర్చోను' అంది ఆడపిచ్చుక.

మగపిచ్చుకకి కోపం వచ్చి భర్రున ఏనుగు దగ్గరకు పోయి దాని తొండం మీద వాలింది పొడుద్దామని. ఒక్క విదిలింపు విదిల్చి ఎత్తి అల్లంత దూరంలో విసిరేసింది దాన్ని ఏనుగు.

'ఒరే పిచ్చుక నాయాలా. నువ్వు నన్నేం చేయగలవు గానీ వెళ్లి నీ పెళ్లాం మీద చూపించరా నీ ప్రతాపం. అది భలే కుట్నీ ఆడది. మీ యిద్దరికని వండుకున్న ఖిచిడి అంతా అదొక్కటే దొబ్బి తినేసింది' అంది ఏనుగు.

మగపిచ్చుక కోపం అంతా సప్పంగా చల్లబడిపోయింది.

'మరి ఎలా ఏనుగు మామా. నా భార్య పొగరు ఎలా అణిచేది?' అని అడిగింది.

'ఏముందిరా, అలా షికారుకు పోదామని పిలువు. ఒక బావి దగ్గరకు తీసుకుపో. పుచ్చుదారంతో ఒక ఉయ్యాల మంచిదారంతో ఒక ఉయ్యాల వెయ్యి. పుచ్చుదారం మీద దాన్ని కూర్చోపెట్టు. మంచిదారం మీద నువ్వు కూర్చో. ఇద్దరూ ఊగండి. పుచ్చుదారం పుటుక్కున తెగి అది బావిలో పడి చస్తుంది' అంది ఏనుగు.

సరేనని వెళ్లింది మగపిచ్చుక. మంచానికి అడ్డంగా పడుకుని నాటకాలాడుతున్న ఆడపిచ్చుకతో 'అగే. అగే. జరిగిందేదో జరిగిపోయింది. నీ మనసు యిప్పుడు బాగున్నట్టు లేదు. అలా షికారుకు పోయేసొద్దాం' అని దానిని తీసుకొని ఒక బావికి వెళ్లింది.

ఆ బావి గిలకకి పుచ్చుదారంతో ఒక ఉయ్యాల మంచి దారంతో ఒక ఉయ్యాల కట్టింది. పుచ్చుదారం ఉయ్యాల మీద ఆడపిచ్చుకను కూర్చోబెట్టి, మంచిదారం ఉయ్యాల మీద అది కూర్చుంది.

రెండు కలిసి ఊగాయి. పుచ్చుదారం పుటుక్కున తెగి దబ్బున బావిలో పడిపోయింది ఆడపిచ్చుక.

'నీ మోసం తెలిసింది. నీ పాపం పండింది. మునిగి చావు మునిగి చావు' అని ఎగిరెళ్లిపోయింది మగపిచ్చుక.

బావిలో కుయ్యోమొర్రో అంటా వుంది ఆడపిచ్చుక. అప్పుడే ఒక అవ్వ బొక్కెన తీసుకొని బావి దగ్గరకు వచ్చి చేద దించింది.

'అవా అవా. నన్ను పైకి లాగు. కమ్మగా ఉంటాను కోసుకొని తిందూగానీ' అంది ఆడపిచ్చుక.

అబ్బా, మాంసం తిని చాన్నాళ్లయ్యింది అని ఆశపడ్డ అవ్వ అలాగే అని ఆడపిచ్చుకని పైకి లాగింది.

అప్పటికే అది తడిసి ముద్దయి ఉంది. తడిసిన రెక్కలతో ఎగిరిపోలేదు గదా. అందుకని అదనుకోసం చూస్తా వుంది.

'పట్టు. నిన్ను కోస్తా' అంది అవ్వ.

'అవా. తడిసి ముద్దయి వున్నా. యిప్పుడు కోస్తే ఏం బాగుంటాను. నా రెక్కలు ఆరబెట్టు' అంది ఆడపిచ్చుక.

సరేగదా అని ఆ దుగ్గు ఈ దుగ్గు వేసి మంట పెట్టి రెక్కలు ఆరబెట్టింది అవ్వ.

రెక్కలైతే ఆరాయిగాని ఎగిరి పారిపోయే శక్తి యింకా రాలా.

'పట్టు. నిన్ను కోస్తా' అంది అవ్వ.

'అవా అవా. నన్ను యిట్లాగే కోసి తింటే ఏం బాగుంటాను. కాస్త ఉప్పు కారం తగిలిస్తే గదా రుచి. పోయి అవి తెచ్చుకో' అంది ఆడపిచ్చుక.

అదీ నిజమేగదా అనుకున్న అవ్వ ఆ డబ్బా గెలికి, ఈ తపేలా గెలికి ఉప్పు, కారం తెచ్చుకుని 'పట్టు. నిన్ను కోస్తా' అంది.

'యిదిగో. నన్ను కొయ్యి' అని కారం మీద ఉప్పుమని ఊదింది ఆడపిచ్చుక.

గాలికి కారం ఎగిరి అవ్వ కంట్లో పడింది. ఆమె లబోదిబోమంటుంటే భుర్రున ఎగిరిపోయింది ఆడపిచ్చుక.



# మనుషుల కథ పిల్లినే అడగాలి

పట్నవాసం చేసిన పిల్లి చాలారోజుల తర్వాత చుట్టాల్నీ పక్కాల్నీ చూసి పోదామని అడవికి బయలుదేరింది.

తల మీద పైట కప్పుకుని, వంటికి దుప్పటి చుట్టుకొని, నోటికి ఆకువక్క వేసుకొని ఖరీదాగా ఖాయిదాగా అడవిలోకి వస్తున్న పిల్లిని చూసి ఎదురుగా వస్తున్న తోడేలు 'సలాములేకుమ్ ఖాలాబీ (పెదమ్మా)' అని సలాము చేసింది.

'వాలేకుం సలామ్ నాయనా. ఎలా ఉన్నావు?' అని అడిగింది పిల్లి.

'ఏదో అట్టట్ట ఉన్నాములే పెదమ్మా. నువ్వు ఎలా వున్నావో చెప్పు. చాన్నాళ్ల తర్వాత మాబోటి వాళ్లని దారి తప్పి చూడ్డానికి వచ్చావు. నీకేమి? పట్నవాసంలో పాలకూడు, పెరుగుకూడు తినే భోగం. నౌకర్లు, చాకర్లు ఉంటారు. నీకు ఏది కావాలంటే అది నిన్ను పెంచుకునేవాళ్లు అందిస్తారు. అది కదా బతుకంటే. మాకూ ఉంది బతుకు. దేనికి? పురుగూ పుట్రా తిని చచ్చిన గొడ్డూ బతికిన పిట్టా నమిలి హీనపు బతుకు బతుకుతున్నాము. మనుషులు మమ్మల్ని దగ్గరకు తీస్తే గదా. మీ పిల్లిజాతి పెట్టి పుట్టిందమ్మా' అన్నది తోడేలు కడుపులోని అక్కసంతా తీర్చుకుంటూ.

'ఒహోహో. బాగా చెప్పావు. నీకేమి తెలుసు నాయనా పట్నవాసం సంగతి. మనుషుల సంగతి' అని, బొడ్లో నుంచి సంచి తీసి ఆకువక్కని మళ్లా నోట్లో వేసుకుంది పిల్లి.

'అదేమిటి పెదమ్మా అలా అంటావు. మనుషుల గురించి మేమంతా కథలు కథలుగా చెప్పుకుంటామే. వాళ్లు చాలా గొప్పోళ్లంటగదా. మంచీ శబరా పాపం పుణ్యం ఎరిగిన వాళ్లంట గదా. ఈ భూమండలాన వాళ్లను మించినవాళ్లు లేరంట గదా' అంది తోడేలు.

'ఎవరు నాయనా నీకు చెప్పింది. వాళ్లకు ఒక మంచి తెలియదు. ఒక చెడ్డ తెలియదు. నా సంగతే తీసుకో. వాళ్ల నోళ్లలో పడ్డాక నా బతుకు బతుకు కాదు. ఎంతసేపటికీ నన్ను 'పిల్లిముండా' 'పిల్లిముండా' అని పిలుస్తారు గానీ పిల్లి అని ఒక్కరు కూడా పిలవరు. యింట్లో ఏ ఒక్క పాలు పోయినా, ఏ ఒక్క పెరుగుపోయినా, ఉట్టినగట్టిన ఏ ఒక్క ఎండుచేప పోయినా 'యింకేముంది పిల్లిముండ తినేసుంటుంది. పిల్లిముండ కాజేసుంటుంది' అని నన్ను ఆడిపోసుకుంటారు. నేను తిన్నానా లేదా యిది సత్యమా కాదా అని ఎవ్వరూ విచారించరు. విచారించకపోతే పోయారు యీ 'ముండ' అనే పిలుపు ఏంది? ఏం? మాకు పెళ్లిళ్లు కావా? మేము ముత్తయిదువులుగా కాపరాలు చేసుకోవడం లేదా? పిల్లల్ని కనడం లేదా? ఎంతసేపటికీ 'ముండా' 'ముండా' అని తిట్టడమే...




'సరే అదట్టాపోనీ. నన్ను పెంచుతారు. పెంచినచోట పరిశుభ్రంగా ఉంచాలా వద్దా? ఉంచరు. ఆ గడ్డి పెంచుతారు. ఈ గాదం పెంచుతారు. అటకల మీద' మూల గదుల్లో చెత్తాచెదారం పోస్తారు. పోస్తే ఎలుకలు చేరతాయి గదా. వాటిని తినమంటారు. నేను తింటాను. పాపం ఆ ఎలుక ఏం చేసింది. అది కూడా నాలాగా నాలుగుకాళ్ల జీవే. ఒక నాలుగు కాళ్ల జీవిని మరో నాలుగుకాళ్ల జీవి తినడం ఎంత పాపం. ఆ పాపాన్ని నా చేత చేయిస్తున్నారే ఈ మనుషులది యింకెంత పాపమోకదా' అంది పిల్లి.

తోడేలు ఆ అని నోరు తెరుచుకొని చూస్తోంది.

'నాయనా. నువ్వు నిజం అనుకో అబద్ధం అనుకో. తిండి మీద నాకు యావ లేదు. అది పాలా పెరుగా పలావా అనేది చూడను. కళ్లు మూసుకొని తినేస్తాను. తాగేస్తాను. అట్లా చేయడం వల్ల ఆ వస్తువు నా కొరకు ఉంచిందో యితరుల కొరకు వుంచిందో నాకెలా తెలుస్తుంది. అట్లా తెలియక చేసిన తప్పుని తెలిసి చేసిన తప్పుగా మాట్లాడుతారు మనుషులు. పైగా నేను యింటిని అంటిపెట్టుకుని వుంటే మొరగడం కరవడం తప్ప యింకేమీ చేతగాని కుక్కకి విశ్వాసం అంటగడతారు. వీళ్ల భలే కఠినాత్ములబ్బా' అంది పిల్లి.

'అరె. యివన్నీ మాకు తెలియదు పెదమ్మా' అంది తోడేలు.

'అసలైనది చెబుతా చూసుకో. నువ్వెవరివి? తోడేలువి. నేనెవరిని? పిల్లిని. మనం ఏనాడైనా ఒక తోడేలు యింకో తోడేలుని, ఒక పిల్లి యింకో పిల్లిని చంపుకోవడం చూశామా? ఆఖరికి ఒక సింహం యింకో సింహాన్ని చంపడం చూశామా? ఈ మనుషులు అలా కాదు నాయనా. ఒక మనిషి యింకో మనిషిని చంపుతాడు. ఒక మనిషి యింకో మనిషిని దోచుకుంటాడు. ఒక మనిషి యింకో మనిషిని పీడిస్తాడు. ఒకడు మంచి చేస్తే యింకొకడు దాన్ని చెడ్డ అంటాడు. ఒకడు చెడ్డ చేస్తే యింకొకడు దాన్ని యింకాస్త చెయ్యి అంటాడు. అట్టాంటి రెండుకాళ్ల హీనపు జాతి నాయనా అది. అట్టాంటి జాతి చేతుల్లో పడని మీ తోడేళ్లు ఎంతో అదృష్టవంతులు' అని, లేచి బంధువులను కలవడానికి వెళ్లిపోయిందంట ఆ పట్నవాసపు పిల్లి.



# రాకడ? పోకడ?

ఒక మౌల్వీగారు మహా అహంకారి. చదువు గిదువూ వచ్చేసిందని బలే పొగరు. చదువు రానోళ్లని అసలకి లెక్కచేసేవాడు కాదు. ఒకసారి ఆయన పుస్తకాల్నీ గిస్తకాల్నీ ఒంటె మీద వేసుకొని యింటికి బయలుదేరారు. దారిలో ఒక ఊరు తగిలింది. ఒకామె కోడిని చేతబట్టుకొని వెళుతూ కనిపించింది.

మౌల్వీగారు ఆమెను ఆపి 'ఏమమ్మా. ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగారు.

'సాహెబ్. మా ఊర్లో ఒక సాయెబు ఉన్నాడు. వాడి పేరు బిస్మిల్లా సాయెబు. వాడికి చదువూ గిదువూ లేకపోయినా బిస్మిల్లా చేయడం తెలుసు. వాడికి ఆ డబ్బులే ఆధారం. అందుకని నా కోడిని కోయించుకుందామని వాడి దగ్గరకు వెళుతున్నాను' అంది.

'అమ్మా... ఈ మాత్రం దానికి ఆ తెలిసీ తెలియని సాయెబు దగ్గరకు వెళ్లడం ఎందుకు? వాడికి ఏం తెలుసని? ఈసారికి నేను బిస్మిల్లా చేసిస్తాలే' అని, బిస్మిల్లా చేసి తిరిగి బయలుదేరారు మౌల్వీగారు.

ఈ సంగతి బిస్మిల్లా సాయెబుకి ఎలాగో తెలిసింది. వెంటనే అతడు అడ్డదారిలో గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి మౌల్వీగారు వెళుతున్న దండుబాట మీద చేతికర్రతో అడ్డంగా ఒక గీత గీశాడు.

ఆ రోజుల్లో ఎవరి దారికైనా ఎవరైనా అడ్డంగా ఒక గీత గీస్తే యింక అక్కడ సవాల్ జవాబ్ (ప్రశ్న జవాబు) ఉందని అర్థం. ఆ గీతను చూసి ఒంటె ఆగిపోయింది. ఒంటె మీదున్న మౌల్వీగారు బిస్మిల్లా సాయెబుని ఏమిటి సంగతి అన్నట్టు చూశారు.

'నీ దోవన నువ్వు పోకుండా నా పనిలో జోక్యం చేసుకున్నావు కాబట్టి నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పి కదులు' అన్నాడు బిస్మిల్లా సాయెబు.

'ఏమిటా ప్రశ్న?' అన్నాడు మౌల్వీ.

'ఎక్కడ నుంచి రాకడ? ఎక్కడికి పోకడ? ఎక్కడ నీ శాశ్వత నిలకడ?' అని అడిగాడు బిస్మిల్లా సాయెబు.

ఈ ప్రశ్నకు మౌల్వీగారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. తెల్లమొఖం వేశాడు.

'చెప్పవయ్యా పెద్దమనిషి. పెద్ద పెద్ద చదువులు చదివానని విర్రవీగడం కాదు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు' అన్నాడు బిస్మిల్లా సాయెబు.

మౌల్వీగారు ఓటమి అంగీకరించి ప్రశ్నకు సమాధానం చెప్పమని వేడుకున్నారు.

అప్పుడు బిస్మిల్లా సాయెబు ఆ ప్రశ్నకు సమాధానంగా-

'మక్కా నుంచి రాకడ మదీనాకు పోకడ ఖబరస్తాన్ నీ శాశ్వత నిలకడ' అని చెప్పాడు.

మౌల్వీ బిక్కమొకం వేసేసరికి అప్పుడు ఇలా వివరించాడు:

'ఓ మౌల్వీగారూ. అల్లాకు ఎంతో ప్రియమైనవాడు, మహా పురుషుడు మన ప్రవక్త. అట్లాంటి ప్రవక్తే తను పుట్టిన మక్కాను కొన్ని కారణాల వల్ల వదిలిపెట్టక తప్పలేదు. మదీనాకు వెళ్లిపోకా తప్పలేదు. అదే మదీనాలో పరమపదించి అంతిమంగా ఖబర్‌లోకి చేరకా తప్పలేదు. అంతటి పుణ్యపురుషునికే జనన మరణాలు తప్పనప్పుడు నువ్వెంత? నేనెంత? నాలుగు పుస్తకాలు చదవగానే నాలుగు డబ్బులు సంపాదించగానే అంతా మనమే అని మిడిసిపడతాము. ఈ మిద్దెలూ ఈ మేడలూ శాశ్వతమనుకుంటాము. చివరకు యివన్నీ పోయి అందరం సమానమై చేరేది ఖబరస్తాన్‌కే గదా. అక్కడే కదా మనం శాశ్వతంగా పడి ఉండేది' అని విడమర్చాడు.

మౌల్వీగారు ఆ సమాధానానికి సిగ్గుపడి అప్పటి నుంచి ఎవరి కంటే కూడా ఎక్కువ అని అనుకోలేదు.

కథా నిలయం
55.64
శ్రీకాకుళం



# మఛిలీ బందర్ బాషా

## చేప రాకుమారుడు

ఒక రాజా రాణీ వున్నారు. అల్లా వాళ్లకు సంతానం యివ్వలేదు. ఎందుకు మాకు సంతానం యివ్వలేదు అని వాళ్లు రోజా దిగులు పెట్టుకుంటా వుండేవాళ్లు.

ఒకరోజు రాణి రాజుతో 'ఏమండీ ఏమండీ. నా మనసేమీ బాగుండడం లేదు. అట్లా సముద్ర విహారానికి పోయొద్దాం రండి' అంది.

పోనీలే పాపం, అట్లా సముద్రానికి వెళితే మనసు కాస్త తేలిక పడుతుంది కదా అని రాణిని సముద్రానికి తీసుకువెళ్లాడు రాజు.

అక్కడ రాణి 'దూర్‌బైన్' (బైస్కోపు) తీసుకొని సముద్రంలోకి చూస్తా కూర్చుంది. ఆమెకు రకరకాల చేపలు, రకరకాల సముద్రజీవులు కనిపిస్తా ఉన్నాయి. మందలు మందలుగా ఉన్న ఆ జీవులన్నింటినీ చూసి రాణి మనసు కష్టపెట్టుకుంది. 'యాల్లా. సముద్రంలో యిన్ని లక్షల చేపల్ని పుట్టించావే. ఆఖరకు యిట్లాంటి ఒక చేపనైనా నా కడుపులో వేయకపోతివి కదా' అనుకుంది.

యిట్లా అనుకోగానే ఆమెకు గర్భం నిలిచి తొమ్మిది నెలలు నిండాక చేపపిల్ల పుట్టింది.

యిదేమిటి చేప పిల్ల పుట్టింది అని మొదలు ఆశ్చర్యపోయినా పోనీలే దేవుడు యిదైనా ప్రాప్తం చేశాడు అనుకొని ఒక నీళ్లతొట్టెలో ఆ చేపను వదిలి దాని పాలనా పోషణా చూడటం మొదలుపెట్టారు రాజు, రాణి.

ఆ చేపపిల్ల ఆ తొట్టిలోని నీళ్లలో మునుగుతూ, తేలుతూ, కాసేపు ఆగుతూ, కాసేపు కదులుతూ కేరింతలతో రాజుకీ రాణికీ చాలా సంతోషం కలిగించేది. పుట్టింది మఛిలీ (చేప) కాబట్టి, దానిని తొట్టిలో 'బంద్' చేసి ఉన్నారు కాబట్టి ఆ చేపకు 'మఛిలీబందర్‌బాషా' అని పేరు పెట్టారు.

కాలంతోపాటు మఛిలీబందర్‌బాషా కూడా పెరిగి పెద్దవాడై యింత పొడుగూ యింత లావూ అయ్యాడు. అయితే ఒకరోజు ఉన్నట్టుండి అతను మేత తినడం మానేశాడు. ఏమేమి వండిపెట్టినా తినడం లేదు. కేరింతలు కొట్టకుండా గోడకు అంటుకొని ఒక మూలన గమ్ముగా ఉంటున్నాడు.

రాజుకూ రాణికీ యీ సంగతి తెలిసి హైరానా హైరానా అయిపోయారు. చచ్చిపోయే ముందు కొన్ని చేపలు అట్లా మేతా గీతా లేకుండా మెత్తబడిపోతాయి గదా. అందువల్ల మఛిలీబందర్‌బాషా కూడా చచ్చిపోతాడో ఏం పాడో అని గొల్లుగొల్లుమంటున్నారు వాళ్లు.

అప్పుడు ఆ మహల్‌లో పనిచేసే ఒక ముసలామె యిదంతా చూసి 'రాజా. యిది జబ్బూ కాదు పాడూ కాదు. అబ్బాయికి పెళ్లి వయసు వచ్చింది. పెళ్లి చేసేయండి' అంది.



ఎప్పుడైతే ఆ మాట విన్నాడో మఛిలీబందర్‌బాషా హుషారు హుషారుగా పల్టీలు కొట్టడం మొదలుపెట్టాడు.

యింకేమి చేస్తాడు రాజు అలాగే అని చెప్పి 'ఫలానా మఛిలీబందర్ బాషాకి ఎవరైతే అమ్మాయిని యిచ్చి పెళ్ళి చేస్తారో వాళ్లకు బస్తా బంగారం బహుమానం' అని దండోరా వేయించాడు. అయితే ఎంత బంగారం యిచ్చినా కన్నబిడ్డని ఎవరు చేప ముఖాన కొడతారు? అందువల్ల సంబంధం కుదరలేదు. రాజభటులేమో బస్తా బంగారం తీసుకొని ఊరూరా తిరుగుతున్నారు పిల్లకోసం.

సరే ఒకూళ్లో ఒక అమ్మాయి ఉంది. ఆ అమ్మాయికి సవతి తల్లి. సవతిబిడ్డని నానా బాధలు పెడుతోందా సవతితల్లి. రాజభటులకి యీ సంగతి తెలిసి ఆమె దగ్గరికి వెళ్లి 'నీ సవతి బిడ్డను యివ్వు. ఈ బంగారం తీసుకో' అన్నారు. బస్తా బంగారం చూసేసరికి బంగారం లాంటి పిల్లని చేప నోటికి అందించడానికి సిద్ధమైపోయిందా సవతితల్లి.

ఈ సంగతి తెలిసి సవతిబిడ్డ చాలా బాధపడింది. 'సరే... ఈమె చేతిలో బాధలు పడటం కన్నా మఛిలీబందర్‌బాషా చేతిలో చిక్కి చావడం మేలు' అనుకొని భటులతో బయలుదేరబోయింది.

సవతి తల్లి అప్పటికీ వదలకుండా 'అమ్మా. పోయేదానిని ఎలాగూ పోతా ఉన్నావు. పోయే ముందు ఒక బిందె నీళ్లు తెచ్చిచ్చిపో' అంది.

ఆ మాటకు ఆ అమ్మాయి ఏడ్చుకుంటూ ఏడ్చుకుంటూ బిందె తీసుకుని నీళ్లకు బయలుదేరింది. సరిగ్గా అప్పుడే ఒక పాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోతూ పారిపోతూ ఈ అమ్మాయి దగ్గరకు వచ్చి ఆగింది.

'అమ్మాయీ. నన్ను ఒక పాములోడు తరుముకుంటూ వస్తున్నాడు. నీ బిందెలో దాచిపెట్టి నాకు కాస్త సాయం చేయి' అని అడిగింది పాము.

ఎట్లాగూ సవతితల్లితో బాధలు పడుతున్నాను, రేపు మఛిలీబందర్‌బాషా చేతిలో బాధలు పడతాను, ఈలోపు ఈ పాము పాలబడి ప్రాణాన్ని విడుద్దాము అనుకొని ఆ పామును ఎత్తి బిందెలో వేసుకుందా అమ్మాయి. పాములోడు వెళ్లిపోయాడు. అప్పుడా పాము బిందెలో నుంచి బయటికొచ్చి మనిషి రూపం దాల్చింది.

'అమ్మా. నీ బాధ నాకు తెలుసు. నువ్వు పెళ్లాడబోయే మఛిలీబందర్ బాషా సంగతి కూడా తెలుసు. పెళ్లికి నువ్వు భయపడకు. యిదిగో ఈ మట్టిని మంత్రించి యిస్తున్నాను. రేపు మఛిలీబందర్ బాషా నీ దగ్గర ఏకాంతంగా వుండగా అతని మీద చల్లు' అని చెప్పేసి వెళ్లిపోయాడు.

పెళ్లి జరిగిపోయింది. తొలిరాత్రి పెళ్లికూతురిని సింగారించి, సవారించి గదిలో భయపడుతూ భయపడుతూ పంపారు రాజు, రాణి. ఆ గదిలో పెద్ద నీళ్ల తొట్టె. అందులో మఛిలీబందర్ బాషా. పెళ్లికూతురు ఆ గదిలోకి వెళ్లాక తలుపులు మూసి పాము యిచ్చిన మట్టిని తీసి చేప మీద చల్లింది. అంతే. అంతవరకు శాపవశాన వున్న ఆ చేపకు పలపలమని పొట్టురాలి చర్మం వొదులయ్యి, యింత అందంగా యింత సౌందర్యంగా ఉన్న ఒక పరా (గంధర్వుడు) అందులో నుంచి బయటికొచ్చాడు.

'నన్ను మనిషిని చేసి ప్రాణం పోశావు. నా కంఠంలో ప్రాణం వుండగా నిన్ను వదులుకోను' అన్నాడు మఛిలీబందర్ బాషా.

అది చూసి అతని భార్య ఎంతో సంతోషించింది. ఆ రాత్రి వాళ్లిద్దరూ హాయిగా గడిపారు.

మరుసటి రోజు పొద్దున రాజు, రాణి, భటులు గిటులూ అందరూ గది ముందు నిలబడ్డారు. యింకేముంది మఛిలీబందర్ బాషా ఆ అమాయకురాలిని తినేసుంటాడు అనుకుని తలుపు తెరిస్తే ఏముంది కళ్లెదురుగా యువరాజు, యువరాణి.

జరిగింది తెలుసుకుని, అత్తగారు మామగారు పరమానంద భరితులై, కోడల్ని నెత్తిన పెట్టుకొని చూసుకోవడం మొదలుపెట్టారు.

కోడలికి గర్భం నిలిచింది. నెలలు నిండాయి. ఈలోపు ఊళ్లోని సవతితల్లి దగ్గర అమ్మలక్కలు చేరారు.

'నువ్వు నీ సవతి బిడ్డను మఛిలీబందర్ బాషాకు యిచ్చి వదిలించుకోవాలని చూశావు. అక్కడ ఆ చేప మనిషి రూపు దాల్చింది. నీ సవతిబిడ్డేమో పట్టమహిషి అయ్యి రాజ్యాలను ఏలుతోంది' అని వెక్కించారు.

సవతితల్లికి యింక మంట బయలుదేరింది.

దీని అంతు చూడాలని చెప్పి స్వీటు, కారా చేసుకుని కూతుర్ని చూడడానికి వెళ్లింది. వెళ్లి కల్లబొల్లి ఏడుపంతా ఏడ్చి తొలిచూలు కాన్పు పుట్టింట్లోనే జరగాలని చెప్పి, కూతుర్ని తీసుకొని యింటికి వచ్చింది. అప్పటికే అక్కడకు సవతితల్లి సొంత కూతురు కూడా కాన్పుకు వచ్చింది. యిద్దరికీ కాన్పు జరిగింది. మగబిడ్డలు పుట్టారు. సవతి కూతురు కొడుకేమో సుందరంగా కళగా రాజసంగా ఉంటే సొంత కూతురి కొడుకేమో కళతప్పి, పాలిపోయి, వికారంగా ఉన్నాడు.

'మతిలేనిదాన్ని. నిన్ను తీసుకెళ్లి మఛిలీబందర్ బాషాకు అప్పగించాల్సింది. ఆ దరిద్రపు సవతికూతుర్ని యిచ్చి కట్టబెట్టి రాణిని చేశాను' అని బాధపడింది సవతితల్లి, సొంతకూతురి దగ్గర.

'యిప్పుడైనా ఏమయ్యిందమ్మా. దానిని పాతిపెట్టి దాని స్థానంలో నేను వెళతాను. మాకు కొంచెం పోలికలు కలుస్తాయి కదా' అంది సొంతకూతురు. ఇద్దరూ కలిసి అందుకు తగినట్టుగా పథకం వేశారు.

ఒకరోజు వాళ్లు సవతి కూతురుకి మంచిమాటలు చెప్పి వనవిహారానికి తీసుకెళ్లారు. అక్కడ అటు తిప్పుతూ, యిటు తిప్పుతూ ఒక పాడుబడిన బావి దగ్గరకు తీసుకువెళ్లి, ఆమెనీ, ఆమె బిడ్డనీ తోసి వచ్చేశారు. యిప్పుడు ఆమె స్థానంలో సొంత కూతురు మహల్‌కు వెళ్లింది. ఆమె బిడ్డ స్థానంలో తన కొడుకుని చూపెట్టింది.

యిటు చూస్తే ఆ బావిలో ఏముంది? ఒక బిలం వుంది. ఆ బిలంలో ఆ రోజు బిందెలో దాక్కున్న పాము కాపురం వుంటోంది. ఈ పాము ఈ అమ్మాయినీ, ఈ బిడ్డనూ చూసి 'అమ్మా. నువ్వు నా కూతురు లాంటి దానివి. పరిస్థితులు నాకు తెలుసు. అవి చక్కబడేవరకూ నా దగ్గరే వుండు' అని ఉంచుకుంది.

అక్కడ రాజ్యానికి చేరిన దొంగభార్యను చూసి మఛిలీబందర్ బాషా మనసు మనసులో లేదు.

'యిదేమిటి కాన్పుకు పోయిన నా భార్య యిలా తయారైవచ్చింది. ఆమెది ఈ రూపు కాదే. ఈ రంగు కాదే' అని లోలోన అనుకున్నాడు. అతను ఆమెను తాకడం లేదు. బిడ్డను ముద్దాడడం లేదు. మహల్‌లోని వాళ్లు కూడా పైకి ఈ మాట చెప్పలేక లోలోన మల్లగుల్లాలు పడుతున్నారు.

అయితే దొంగభార్య మాత్రం 'కాన్పు వల్ల నా ఆరోగ్యం దెబ్బతింది. నా రంగు నా రూపూ పోయాయి' అని ఏవో నాటకాలు ఆడి రోజులు నెట్టుకొస్తూ వుంది.

యిక్కడ యిలా వుంటే, అక్కడ అడవిలో ఒకరోజు ఒక గాజులతను 'గాజులో గాజులో' అని పోతూ వున్నాడు. బావిలో వున్న మఛిలీబందర్ బాషా భార్యకు ఆ కేకలు వినిపించి గాజులు వేయించుకోవాలనిపించింది.

'అబ్బా... నాకు గాజులు వేయించండి' అంది పాముతో. పాము ముసలాయన రూపు దాల్చి గాజులవాణ్ణి యింట్లోకి తీసుకువచ్చింది.

గాజులతను ఆమె చేతులకు గాజులు ఎక్కిస్తుంటే దూరంగా రాచకళ ఉట్టిపడుతున్న ఆమె కొడుకు బురద నీళ్లలో ఆడుకుంటూ వున్నాడు. అది చూసి ముసలాయన 'అమ్మా. పిల్లాణ్ణి చూడు. బురదలో ఆడుకుంటున్నాడు' అన్నాడు.

అప్పుడు మఛిలీబందర్ బాషా భార్య విసుక్కుంటూ 'ఎక్కడికి పోతాయి మఛిలీబందర్ బాషా బుద్ధులు. నీళ్లలో బురదలో ఆడటమేగా వాడి పని' అంది.

ఆ మాటలు గాజులతను విన్నాడు. వాడి గుండెలో బేజారు పుట్టింది. 'యిదేమిటి? మఛిలీబందర్ బాషా మా రాజు. యీవిడ ఈ మాటలు అంటా వుందంటే ఈ బిడ్డ మఛిలీబందర్ బాషా బిడ్డనా?' అని అనుమానం వచ్చింది.

గాజులు ఎక్కించాక ఆ అనుమానం తీరడానికి నేరుగా రాజ్యానికి వచ్చి, మహల్ చుట్టూ తిరుగుతూ 'గాజులో గాజులో' అని కేకలు వేస్తున్నాడు. ఈ కేకలు మహల్‌లోని దొంగభార్య చెవిన కూడా పడ్డాయి.

ఆమె మఛిలీబందర్ బాషాను పిలిచి 'ఏమండి నాకు గాజులు వేయించండి' అని అడిగింది. అతను గాజులవాణ్ణి పిలిపించాడు.

గాజులతను లోపలికి వచ్చి, దొంగభార్యను మార్చి మార్చి చూస్తూ చేతికి గాజులు ఎక్కిస్తున్నాడు. అప్పుడే దొంగభార్య కొడుకు కూడా దూరంగా బురదనీళ్లలో ఆడుకుంటూ వున్నాడు. అది చూసి మఛిలీబందర్ బాషా తన దొంగభార్యతో 'పిల్లాణ్ణి చూడు బురదలో ఆడుకుంటున్నాడు' అన్నాడు.

అప్పుడు దొంగభార్య కూడా ముద్దుగా 'ఎక్కడికి పోతాయి మఛిలీబందర్ బాషా బుద్ధులు. నీళ్లలో బురదలో ఆడటమేగా వాడి పని' అని విసుక్కుంది. ఆ మాటలకి గాజులతను ఫక్కున నవ్వాడు.

మఛిలీబందర్ బాషా ఆ నవ్వు చూశాడు. అయితే ఏమీ అనలేదు. తర్వాత వాడిని పక్కకు పిలిచి 'ఎందుకు నవ్వావు చెప్పు' అని గద్దించాడు. గాజులతను భయపడిపోయి 'మహారాజా. నాకు ప్రాణభిక్ష పెడితే ఎందుకు నవ్వానో చెబుతాను' అన్నాడు.

'నీ ప్రాణానికి అభయం. ఎందుకు నవ్వావో చెప్పు' అన్నాడు మఛిలీబందర్ బాషా.

'బాషా జహాపనా. యిలా నేను అడవిలో ఒకచోట ఒకామెకు గాజులు ఎక్కించాను. ఆమెకు ఒక కుమారుడు వున్నాడు. వాడు చాలా అందంగా చాలా గొప్పగా వున్నాడు. వాడు బురదనీళ్లలో ఆడుకుంటుంటే - ఎక్కడికి పోతాయి మఛిలీబందర్ బాషా బుద్ధులు అని వాళ్లమ్మ విసుక్కుంది. యిక్కడ మహల్‌లో కూడా అవే మాటలు వినిపించాయి. కానీ ఆమెకూ ఈమెకూ ఎక్కడా పోలిక? ఆ బిడ్డకూ ఈ బిడ్డకూ ఎక్కడా పోలిక? అందుకని నవ్వొచ్చింది' అన్నాడు.

మఛిలీబందర్ బాషాకు వెంటనే జరిగింది అర్థమైంది. గాజులతనితో ఆఘమేఘాల మీద వెళ్లి భార్యనూ బిడ్డనూ చేరుకున్నాడు. భార్య ఏడ్చి, బిడ్డను ఒళ్లో ఒదిలి 'యిట్టిట్టా సంగతి. మా సవతితల్లి యిలా చేసింది' అని చెప్పింది మఛిలీబందర్ బాషాతో.

బాషా ఏమీ మాట్లాడకుండా గమ్మున యిల్లు చేరుకున్నాడు. ఇల్లు చేరుకుని దొంగభార్యతో 'యివాళ నాకు చాలా సంతోషంగా వుంది. మహల్‌లో వున్న వాళ్లందరికీ పలావు వండించి పెడదాం' అన్నాడు. 'అలాగేనండీ' అంది దొంగభార్య.

పెద్ద పలావుదేక్షా పెట్టి వంట మొదలుపెట్టారు. ఖత్‌ఖత్‌ఖత్‌మని అన్నం ఉడుకుతూ వుంది. రాజు దొంగభార్యని పిలిచి 'ఉప్పు చూద్దాం పద' అన్నాడు. 'అలాగే' అని వచ్చింది దొంగభార్య. రాజు ఉప్పు చూస్తున్నట్టు నటిస్తా ఆమెను ఎత్తి పలావు దేక్షాలో పడేశాడు. ఆమె కుయ్యోమొర్రో అంటూ చేసిన తప్పులు ఒప్పుకుని ప్రాణాలు విడిచింది.

అప్పుడు మఛిలీబందర్ బాషా, ఆమె భార్యా, కుమారుడు హాయిగా కలకాలం జీవించారు.

ఆయన పాలనలో నెలకు మూడు వర్షాలు కురిసి పంటలు బాగా పండేవంట.



# ఎవరు పైల్వాను?

ఒకూర్లో ఒక పైల్వాన్ వున్నాడు. వాడో పెద్ద ఎచ్చులుపుడింగి.

'నా కంటే పెద్ద పైల్వాను ఈ చుట్టుపక్కల ఎవడూ లేడు' అని చెప్పుకుంటూ, తొడలు కొడుతూ తిరుగుతుండేవాడు.

ఆ దారిన పోతూ, వీడి ఎచ్చులు చూసిన ఒక పెద్దాయన 'అబ్బాయ్. నువ్వే కాదు పైల్వాన్‌వి. నీ కంటే పెద్ద పైల్వాను ఫలానా ఊర్లో ఉన్నాడు. కావాలంటే చూసుకోపో' అని ఒక చురకేసి పోయాడు.

అది విని పైల్వాన్‌కు కోపం వచ్చేసింది.

'ఐట్. అట్లెట్ల ఉంటాడు? వాణ్ణి చంపేస్తాన్ నరికేస్తాన్ మింగేస్తాన్' అని బయలుదేరాడు.

అక్కడకు వెళ్లేసరికి ఆ పైల్వాను యింట్లో లేడు. వాడి చెల్లెలు మాత్రం ఒక ఏనుగుని చంపి, దానిని చీపిరి కట్ట మీద వేసుకొని, పేడదిబ్బ మీద పారేయడానికి వెళుతూ ఎదురొచ్చింది. యింతలో ఆమె అన్న నలభై శేర్ల పలావు దేక్షాని చిటికెన వేలి గోరు మీద పెట్టుకొని ఆ బరువు వెంట్రుకతో సమానంగా మోస్తూ యింటికొచ్చాడు.

వీళ్లిద్దరినీ చూసేసరికి ఈ పైల్వానుకి పైప్రాణాలు పైన్నే పోయాయి.

అయినాసరే 'ఎట్లాగూ రానే వచ్చాము చస్తే చస్తాము' అని 'ఒరే పైల్వాన్‌గా. ఈ చుట్టుపక్కల యిలాఖాలో నువ్వు నన్ను మించిన పైల్వాన్ అని అందరూ అంటా ఉన్నారు. అదేగనక నిజమైతే నాతో పోటీకి రా' అని కుస్తీకి పిలిచాడు.

'అలాగే పా' అని ఆ పైల్వాను ఒప్పుకున్నాడు.

ఇద్దరూ కలిసి అడవిలో చేరి కుమ్ములో దుమ్ముగా కుస్తీ ఆడారు. కానీ ఎంతసేపటికీ ఎవరు గెలిచారో తేలడంలా.

అప్పుడే అటువైపుగా, నడుం వంగిపోయిన ఒక పండు ముసలామె సద్ది మూట కట్టుకొని పోతా ఉంది.

పైల్వాన్లిద్దరూ ఆమె వెంటపడ్డారు.

'అవా అవా. మేమిద్దరం పైల్వాన్లమి. మేము కుస్తీ ఆడుతాము. ఎవరు గెలిచారో నువ్వు చెప్పాలి' అన్నారు.

అప్పుడా ముసలామె 'నాయనలారా. యిట్లాంటి వాటికి యిప్పుడు నాకాడ టైము లేదు. నా మనవడు చిన్న తప్పు చేశాడని పొద్దున



మందలించాను. అందుకు వాడు అలిగి యింటికి రాకుండా పరగడుపుతో ఒంటెల్ని కాయడానికి అడవిలోకి పోయాడు. వాడికి సద్ది తినిపిస్తేనే నా కడుపు చల్లబడేది. మీకు అంత తొందరగా వుంటే చెరొకరు నా భుజాల మీద కూర్చోని కుస్తీ ఆడండి. నా మనవణ్ణి చేరే లోపల ఎవరు గెలిచారో చెబుతాను' అంది.

ఆ మాటలతో ఈ పైల్వాన్లిద్దరికీ మాట పోయింది.

'ఓరి నాయనో. యీమె మనకంటే పెద్ద పైల్వాను లాగుందే' అనుకొని చెరో భుజాన ఎక్కారు. వాళ్ల కుస్తీ ఆడుతుంటే ఆ ముసలామె పైట చెంగుతో సమానంగా వాళ్లను మోస్తూ ముందుకు నడుస్తూ వుంది.

ఆమెనీ, ఆమె భుజాల మీద వున్న పైల్వాన్లనీ చూసి ఒంటెలు కాస్తున్న మనవడు దూరం నుంచే దడుచుకున్నాడు.

'అమ్మబాబోయ్ తిట్టింది చాలక నన్ను కొట్టించడానికి మా అవ్వ పైల్వాన్లని వెంటబెట్టుకొని వస్తా వుంది' అనుకొని, వాడు మేపుతున్న పన్నెండు వందల ఒంటెల్ని ఆదరాబాదరా మూటగట్టి నెత్తిన బెట్టుకొని పరుగు మొదలెట్టాడు.

వాడు అట్లా పరిగెడతా పరిగెడతా వుంటే ఒక గద్దొచ్చి వాడి నెత్తి మీదున్న మూటను తన్నుకుపోయింది. అది పోతూ పోతూ ఒకచోట దానిని జారవిడిచింది.

సరిగ్గా అదే సమయానికి ఆ దేశపు రాజుగారి కూతురు వాళ్ల మేడ మీదెక్కి జుట్టు ఆరబోసుకుంటూ వుంది. ఆమె కళ్లెత్తి పైకి చూసేసరికి ఈ మూటొచ్చి ఆమె కుడి కంట్లో పడింది. కన్ను చురుక్కుమంది.

'కంట్లో నలక పడింది. కంట్లో నలక పడింది' అంది రాజుగారి కూతురు.

అప్పుడు చెలికత్తె వచ్చి, కంట్లోకి చూసి, 'ఆహా. నయాపైసా ఖర్చులేకుండా పన్నెండు వందల ఒంటెలు దొరికే మార్గం కనిపించింది' అని సంబరపడి 'ఏమీ లేదు షహజాదీ గారూ. ఏదో నలక' అని నాలిక చివరతో ఆ నలకను తీసి, నేరుగా యింటికి వెళ్లి ఆ పన్నెండు వందల ఒంటెల్నీ దొడ్లో కట్టేసుకుంది.

ఆ రాత్రి ఆ చెలికత్తె కూతురికి పాస్ వచ్చింది.

వాళ్లమ్మను లేపి 'అమా అమా. ఒంటేలు' అంది.

వాళ్లమ్మ నిద్రలో 'దక్షిణం వైపు పోయబాక. ఉత్తరం వైపు పోసుకో' అంది.

అయినాగానీ ఆ పెడద్రపు కూతురు వినకుండా దక్షిణం వైపునే పాస్ పోసింది.

ఆ ధారకి ఆవైపు దొడ్లో వున్న ఒంటెలన్నీ కొట్టుకుపోవడం మొదలుపెట్టాయి. అవి మునుగుతూ తేలుతూ కుయ్యోమొర్రో అని గుడ్లు తేలేస్తూ ఉంటే ఆ దోవన పోతున్న ఒకాయన 'అరెరె ఏంటిది? ఒంటెలన్నీ చచ్చేట్టున్నాయే' అనుకొని, కంటిరెప్పలోని ఒక వెంట్రుకను పీకి ప్రవాహానికి అడ్డం వేశాడు.

దెబ్బతో ప్రవాహం ఆగి ఆ ఒంటెలన్నీ బతుకు జీవుడా అని బయటపడ్డాయి.

యీ కథ యింకా ఉందిగానీ యిప్పటివరకూ లెక్కతేలిన పైల్వాన్లలో అందరికంటే పెద్ద పైల్వాను ఎవరు?

అది తేలితేనే తర్వాతి కథ. లేకుంటే లేదు.

✪ ఈ కతను నెల్లూరు వెంకటేశ్వర పాలెంలో ఒక పదేళ్ల పాప చెప్పింది. ఈ కతను చెప్పాక కతను విన్న వాళ్లంతా ఒక్కొక్కరు ఒక్కో పైల్వాన్ పక్షం తీసుకుంటారు. నా పైల్వాన్ గొప్ప అంటే నా పైల్వాన్ గొప్ప అనుకుంటారు. అదో ఆట.

# షర్ఫుద్దీన్



ఒకమ్మకు ఒక్కడే కొడుకు. ఆ అమ్మకు ఆ కొడుకు తప్ప యింకెవరూ లేరు. ఆ కొడుక్కి కూడా ఆ అమ్మ తప్ప యింకెవ్వరూ తెలియదు. అతని పేరు షర్ఫుద్దీన్. షర్ఫుద్దీన్‌కు చిన్నప్పుడే దైవం మీద మక్కువ కలిగింది. జీవితాన్ని దైవానికే అంకితం చేయాలని అనుకున్నాక తల్లి దగ్గరకు వెళ్లి - 'అమ్మా. నేను దైవమార్గాన్ని కనుగొనడానికీ, కనుగొని అనుసరించడానికీ, గురుస్థానం పొంది ఆ మార్గాన్ని నలుగురికీ చూపించడానికి వెళుతున్నాను. నేను దీనిని సాధించాక తిరిగి వస్తాను. నన్ను ఆశీర్వదించు' అన్నాడు.

అయ్యో నాకున్నది ఒక్కగానొక్క బిడ్డ కదా వీడు వెళితే నా మంచిచెడ్డలు ఎవరు చూసుకుంటారు అని ఆ తల్లి అనుకోకుండా 'అలాగే నాయనా. వెళ్లిరా' అంది.

షర్ఫుద్దీన్ దైవమార్గం కనుగొనడానికి వెళ్లాడు. ఎన్నో ఏళ్లు ఎక్కడెక్కడో తిరిగాడు. ఎందరో గురువులకు సేవలు చేశాడు. గడ్డాలు మీసాలు పెరిగాయి. వెంట్రుకలు తెల్లబడ్డాయి. ముసలివాడు అయిపోతున్నాడు. అయినప్పటికీ ఆయనకు అసలు దైవమార్గం అంటే ఏమిటో తెలుసుకోవడమే సరిపోతోంది గానీ గురుస్థానం దక్కడం లేదు.

ఇదంతా చూసీచూసీ మనసు కష్టపెట్టుకున్న షర్ఫుద్దీన్ ఒకసారి గురువుగారితో 'హజ్రత్. నేను చేసిన పాపమేమి? ఎన్నో ఏళ్లుగా మీకు సేవలు చేశాను. మీ బోధనలు విన్నాను. పవిత్ర గ్రంథాలను పారాయణం చేశాను. దైవస్మరణ తప్ప మరో పని నేను ఎరగను. అయినా గానీ నాకు గురుస్థానం దక్కడం లేదు. నిజమైన దైవమార్గం తెలిసినవాడిగా నన్ను ఎవరూ పరిగణించడం లేదు. ఇందుకు చాలా బాధగా వుంది' అన్నాడు.

గురువు అంతా విని 'నాయనా. అమ్మ ఇంటి దగ్గరే వుంది' అన్నారు. అంతే. అంతకు మించి ఏమీ మాట్లాడలేదు.

ఎప్పుడైతే ఆయన ఆ మాట అన్నాడో షర్ఫుద్దీన్‌కు ఒక్కసారిగా తల్లి గుర్తుకొచ్చింది. దైవమార్గం కనుగొని తిరిగి వస్తాను అని తను చెప్పిన మాట గుర్తుకొచ్చింది. ఆమె నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది గదా అనే తలంపు కలిగేసరికి ఎక్కడలేని దుఃఖం పొంగుకొచ్చి తల్లి దగ్గరకు ఆఘమేఘాల మీద బయలుదేరాడు.

అతను వచ్చేసరికి తల్లి మంచాన పడి వుంది. బిడ్డ కడగొట్టు చూపుల కోసం ప్రాణాలు ఉగ్గబట్టుకొని ఉంది. చూసే ఆలనాపాలనా లేదు. తల్లి అవస్థ చూసి 'అమ్మా అమ్మా' అని అలమటించిపోయాడు షర్ఫుద్దీన్. మూడు రోజులపాటు ఆమెకు సేవలు చేశాడు. మలమూత్రాలు ఎత్తిపారేశాడు. ఆమె మాసిన బట్టలు ఉతికేశాడు. తిండితిప్పలు స్వయంగా వండిపెట్టాడు.

మూడోరోజున ఆమె 'నాయనా మంచినీళ్లు' అంది. వెంటనే షర్ఫుద్దీన్ వెళ్లి మంచినీళ్లు తెచ్చేసరికి ఆమె నిద్రపోయింది. 'అయ్యో. మా అమ్మ నీళ్లు అడిగి నిద్రపోయిందే. ఏ అపరాత్రో లేచి దాహానికి యిబ్బంది పడదు కదా' అనుకొని, నీళ్లు పట్టుకొని ఆమె తల దగ్గరే నిలుచున్నాడు.

తెలతెల్లగా తెల్లవారుతుండగా ఆమె కళ్లు తెరిచింది. ఎదురుగా కొడుకు నిలబడి వున్నాడు. ఆమెను చూసి 'అమ్మా నీళ్లు' అన్నాడు.

ఆమె తృప్తిగా ఆ నీళ్లు తాగి ఎంతో సంతోషంగా 'నాయనా. యివాళ నేను నిన్ను మనస్ఫూర్తిగా మన్నించాను. నిజమైన దైవమార్గాన్ని యివాళ నువ్వు కనుగొన్నావు' అని చెప్పి కన్ను మూసింది.

షర్ఫుద్దీన్ ఎక్కడెక్కడో తిరిగి ఎందరెందరికో సేవలు చేసి గురుస్థానం పొందాలని చూశాడు. కానీ అది ఆయనకు దక్కలేదు. మూడు రోజులపాటు తల్లికి సేవ చేయగానే ఆయనకు ఆ స్థానం దక్కింది. ఆ తర్వాత ఆయన గురువుగా ఎందరికో నిజమైన దైవమార్గం చూపించాడు.



# మిఠ్ఠూరాజా

ఒక చెల్లికి ఏడుగురు అన్నలు. అమ్మా నాన్న లేని పిల్లగదా అని ఆ అన్నలు ఆ చెల్లిని గారాబంగా సాకడం మొదలుపెట్టారు.

ఏడుగురు అన్నలకూ ఏడుగురు భార్యలు వచ్చారు. వచ్చి 'యింకా ఎంతకాలం మీ చెల్లెల్ని గుండెల మీద పెట్టుకుని సాకుతుంటారు. గారాలు చాలించి పెళ్లి చేయండి' అన్నారు.

ఆ చెల్లిని చేసుకునే వరుడంటే మాటలా? ఎంత అందంగా వుండాలి? ఎంత యోగ్యుడుగా వుండాలి? అందుకని ఏడుగురు అన్నలూ ఏడు దిక్కులకు వెళ్లి వెతికీ వెతికీ ఒక అందమైన రాజకుమారుణ్ణి పెళ్లికొడుకుగా ఎంపిక చేశారు. ధూమ్‌ధామ్‌గా పెళ్లి జరిగిపోయింది.

ఆ రోజుల్లో యిప్పటిలాగా పెళ్లయిన వెంటనే పిల్ల అత్తగారింటికి వెళ్లేది కాదంట. అందుకని ఆ పిల్ల భర్తతోపాటే పుట్టింట్లో మూడు నిద్దర్లు చేసింది. నాలుగో రాత్రి కొత్త దంపతులిద్దరూ ఆరుబయట సనజాజుల పందిరి కింద ప్రేమగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటే ఆకాశాన ఏడుగురు అప్సరసలు పల్లకీలో వెళుతూ కింద ఈ కొత్త పెళ్లికొడుకుని చూశారు. వాళ్లకి చెప్పలేనంత మోహం కలిగింది.

'అబ్బా. అందగాడే' అంది ఒక అప్సరస.

'ఎత్తుకు పోదామే' అంది యింకో అప్సరస. 'యిప్పుడే దిగుదామే' అంది మరో అప్సరస.

వెంటనే ఛమ్ ఛమ్ ఛమ్ అని రెక్కలు ఆడిస్తూ నేలకు దిగి ఒక్క ఉదుటున రాకుమారుణ్ణి చిలకగా మార్చుకుని 'పద మిఠ్ఠూరాజా (చిలకరాజా)' అంటూ ఎగిరిపోయారు.

నిమిషాల మీద జరిగిపోయిన ఈ పనిని చూసి కొత్త పెళ్లికూతురు స్పృహ తప్పిపోయింది. అన్నలు లబోదిబోమని తలోదిక్కుకు పరిగెత్తారు. ఎక్కడా మిఠ్ఠూరాజా జాడ దొరకలేదు.

'చెట్టంత కొడుకే మాకు కాకుండా పోయాక యీ కోడలు ఎందుకు?' అని మిఠ్ఠూరాజా అమ్మా నాన్నా పుట్టింట్లోనే కోడల్ని వదిలేసి ముక్కు చీదుకుంటూ తమ దేశం వెళ్లిపోయారు.

సరిగ్గా ఆ సమయానికే శత్రుదేశపు రాజు దండెత్తి వచ్చేసరికి ఏడుగురు అన్నలు యుద్ధానికి వెళ్లాల్సి వచ్చింది.

వాళ్లు యుద్ధానికి వెళుతూ వెళుతూ భార్యలతో 'మా ఏడుగురి ప్రాణాలూ మా చెల్లెలే. అసలే అది భర్తకు కాకుండాపోయి దుఃఖంలో ఉంది. దాని మనసు కష్టపెట్టబాకండి' అని చెప్పేసి వెళ్లారు.



'సరే సరే' అన్నారు భార్యలు.

కానీ వాళ్లను వెళ్లనిచ్చి చెల్లెలి వెనకపడ్డారు.

ఒక వొదినొచ్చి 'ఏమమ్మా మహారాణి. పొద్దెక్కింది లే' అంటుంది.

ఒక వొదినొచ్చి 'చీపిరి తీసుకుని యిల్లు చిమ్మవే తల్లీ' అంటుంది.

'అంట్లు పడున్నాయి. యింకెప్పుడు తోమేది' అంది యింకో వదిన నోరు చేసుకుంటుంది.

యిట్లా తలా ఒక మాట అని చెల్లిని పీక్కుతింటున్నారు.

యిది చూసీ చూసీ కడుపు కాలిపోయి చెల్లెలు ఒకరోజు మహల్ విడిచిపెట్టడానికి నిశ్చయించుకుంది. ఉత్తిగా మహలు విడిచిపెట్టడం

కాదు. ఏడుగురు వదినల్ని పిలిచి ఒక సవాలు చేసింది. ఏమని?

'యిప్పుడు నేను దిక్కులేని దానిని. ఒకరోజు మీరు కూడా దిక్కులేని వాళ్లవుతారు. అప్పుడు నేను కరన్‌ఫూల్ చీర కట్టి, ఆమ్‌ఫూల్ రవిక తొడిగి, నా బిడ్డడైన జమ్రుత్ బాషాను తోడు తీసుకొని, నా పెనిమిటైన మిర్థూరాజాను వెంటబెట్టుకుని, రత్నాల నెయ్యి గిన్నెలో ముత్యాల చెమ్చాను ముంచి, కూటికి గతిలేక మీరంతా అన్నదాన సత్రంలో కూర్చుని వున్నప్పుడు - తినవమ్మా వదిన పిల్లి అని మీకు వడ్డించకపోతే నా పేరు మిర్థూరాజా పెళ్లామే కాదు' అని సవాలు వినిపించి అడవికి వెళ్లిపోయింది.

అడవికి వెళ్లి, అక్కడ కాసే నేరేడుపండ్లను కోసి చుట్టుపక్కల తిరిగి 'పండ్లమ్మా పండ్లు, నేరేడు పండ్లు, మిర్థూరాజా యిష్టపడే తియ్యతియ్యటి పండ్లు' అని అమ్మడం మొదలుపెట్టింది.

యిట్లా ఈమె అమ్మడం ఒక ముసలామె చూసింది.

ఆమెని పిలిచి 'ఏమమ్మా. నువ్వు చెప్పే మాట వింటుంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. నువ్వు అంటున్నావే 'మిర్థూరాజా' అనే మాట... ఆ మాటను నేను యిప్పటికి రెండుసార్లు విన్నాను. ఒకసారి అడవిలో. ఒకసారి నీ దగ్గర. అడవిలో ఫలానా చోట ఒక నీటిచెలమ వుంది. అక్కడికి వారం వారం ఏడుగురు అప్సరసలు స్నానానికి వస్తుంటారు. వాళ్లతోపాటు ఒక చిలుక కూడా వుంటుంది. ఆ చిలుకను వాళ్లు మిర్థూరాజా మిర్థూరాజా అని పిలుస్తూ వుంటారు. కావాలంటే నువ్వు వెళ్లి చూడు. యీరకంగా వెళితే ఆ చెలమకు చేరుకోవచ్చు' అని దారి చెప్పింది.

యింక ఆ మాటతో మిర్థూరాజా భార్య చస్తామా బతుకుతామా అన్నట్టుగా అడవిలోని ఆ చెలమ దగ్గరకు పరిగెత్తింది. అక్కడ కొంతదూరంలో ఒక చమేలీకా మండ్వా (సనజాజుల పందిరి) వేసుకొని మొగుడికోసం ఎదురుచూస్తూ ఉంది.

ఏడురోజులు గడిచాయి. ఏడో రోజున ఏడుగురు అప్సరసలూ మిర్థూరాజాతో పాటు కిందకు దిగారు. వాళ్లు మిర్థూరాజాను చెట్టుమీదకు వదిలి స్నానానికి వెళ్లారు. మిర్థూరాజా అటు ఎగురుతూ యిటు ఎగురుతూ సనజాజుల పందిరి దగ్గరకు వచ్చాడు. అక్కడ ఆత్రంగా తననే చూస్తున్న భార్యను చూశాడు. అతడికి సంతోషమూ దుక్కమూ కలిగాయి.

గబగబ వెళ్లి ఒక పుల్ల తెచ్చాడు.

'ఈ పుల్ల నా చుట్టూ తిప్పు. మనిషినవుతాను' అన్నాడు. ఆమె తిప్పింది. వాడు మనిషయ్యాడు. యిద్దరూ కాసేపు ఏడ్చుకున్నారు.

'నేను పూర్తిగా వాళ్ల పాలబడిపోయాను. దినానికి ఒకరు నన్ను పంచుకుంటున్నారు. ఒకరోజు నన్ను చిలకను చేస్తారు. ఒకరోజు పండుని చేస్తారు. ఒకరోజు పువ్వుని చేస్తారు. ఒకరోజు ఉంగరంగా వేలుకి తొడుక్కుంటారు. వాళ్లకు అవసరమైనప్పుడే నన్ను మనిషిని చేస్తున్నారు. పరిస్థితులు చక్కబడేవరకు మనం యిలా కాపురం చేయాల్సిందే' అన్నాడు.

అప్పటి నుంచి అప్సరసలు స్నానానికి వచ్చినప్పుడల్లా వాళ్లు కలవడం మొదలుపెట్టారు. సనజాజులపందిరి వాళ్ల యిల్లయ్యింది.

కొన్నాళ్లకు మిర్థూరాజా భార్యకు గర్భం నిలిచి నెలలు నిండాయి.

'నువ్వు యింక మా యింటికి వెళ్లు. మా అమ్మా నాన్నకు సంగతి చెప్పు. పిల్లాడు పుట్టాక ఫలానా రోజున అడవికి వచ్చి ఈ సనజాజుల పందిరి కింద బారసాల ఏర్పాటు చేయి. అప్పుడు ఈ పందిరిని పెద్దపెద్ద దీపాలతో అలంకరించు. అవి ఎంత పెద్ద దీపాలుగా వుండాలంటే వాటి వెలుగుకి అడివంతా వెలిగిపోవాలి' అని ఆ తర్వాత ఏం చేయాలో పథకం చెప్పాడు.

సరే అని అత్తామామల దగ్గరకు చేరింది మిర్థూరాజా భార్య. ఆమెకు అందచందాల పిల్లాడు పుట్టాడు. వాడికి 'జమ్రుత్ బాషా' అని పేరుపెట్టారు. మిర్థూరాజా చెప్పినట్టుగానే ఫలానా రోజున అడవికి వచ్చి సనజాజుల పందిరి కింద బారసాలకు ఏర్పాట్లు చేశారు.

ఆరోజున పందిరికి యిట్లాంటి దీపాలు వేశారంట యిట్లాంటి దీపాలు వేశారంటా ఆ వెలుగుకి అడివంతా వెలిగిపోతూ ఉందంట.

సరిగ్గా అప్పుడే అప్సరసలు అడవికి దిగి దీపాలను చూశారు. వాళ్లకు కుతూహలం కలిగింది.

'అక్కా. ఎవరిదో బారసాల జరుగుతున్నట్టుగా ఉంది. వెళ్లి చూద్దామే' అంది ఒక అప్సరస. సరే అన్నారు అందరూ.

ఎందుకో తెలుసా? అప్సరసల్లో వెయ్యేళ్లకు ఒక అప్సరస చనిపోయి వెయ్యేళ్లకు ఒక అప్సరస పుడుతుంటుంది. అంటే వాళ్లలో చిన్నపిల్లలు తక్కువ. అందుకని వాళ్లకు చిన్నపిల్లలంటే చాలా యిష్టం. మిర్థూరాజా కొడుకు చాలా అందంగా ఉన్నాడు కదా వాణ్ణి చూసి ఎంతో యిష్టంతో ముత్తయిదువులుగా వేషం కట్టి పందిరి కిందకు వచ్చారు. ఆ రోజున మిర్థూరాజా వాళ్ల చేతిలో గులాబి పువ్వుగా మారి ఉన్నాడు.

వాళ్లు లోపలికి రావడంతోటే మిర్థూరాజా భార్య గుర్తుపట్టేసింది. వెంటనే ఉయ్యాలలో ఉన్న జమ్రుత్ బాషా పిర్రను గట్టిగా గిల్లింది. ఆ

వెంటకి వాడు ఏడ్వడం మొదలుపెట్టాడు. అది చూసి వచ్చిన అప్సరసలు బిత్తరపోయి వాణ్ణి సముదాయించబోయారు. వాళ్లే కాదు ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా వాడు ఏడుపు ఆపడం లేదు.

తల్లి గిచ్చేకొద్దీ ఏడ్చి ఏడ్చి వెక్కిళ్లతో ఊదారంగుకు మారిపోతున్నాడు.

అది చూసి అప్సరసలు యింకా కంగారుపడి 'ఏమిటమ్మా ఈ పసివాడు యిలా ఏడుస్తున్నాడు' అని అడిగారు,

యిదే సందని 'ఏముందమ్మా. వీడు పట్టిన పంతం వదిలే రకం కాదు. మీ చేతిలో గులాబీపువ్వు వుంది కదా. అది కావాలని అడుగుతున్నాడు. అందుకని ఏడుపు' అంది మిర్జారాజా భార్య.

అప్సరసల గుండెల్లో రాయి పడింది.

'మేము యివ్వం మేము యివ్వం' అన్నారు ఒకే గొంతుతో.

వాళ్లకు తెలియకుండా మళ్లీ గట్టిగా గిచ్చింది మిర్జారాజా భార్య. యింకా పెద్దగా ఏడుస్తున్నాడు జమ్రుత్‌బాషా.

అప్సరసలు చూసీ చూసీ ఇంకేమీ చేయలేక 'అయితే తీసుకో' అని కోపంగా ఆ పువ్వుని నలిపి బిడ్డడి మీద పారేసి వెళ్లిపోయారు.

వెంటనే పుల్ల తిప్పింది మిర్జారాజా భార్య. ముందు కాస్త కమిలినట్టు కనబడినా కాసేపటిలోనే మామూలు మనిషయ్యాడు మిర్జారాజా.

కళ్లముందు నిలిచిన కొడుకూ, కోడల్ని చూసి వాళ్లను గుండెలకు అదుముకున్నారు రాజు, రాణి.

యిక యీవైపు చూస్తే ఏముంది? యుద్ధానికి వెళ్లిన ఏడుగురు అన్నలూ ఓడిపోయారు. తుఫాను వచ్చి వాళ్ల కొంప కూల్చింది. అందరూ బుక్కా ఫకీర్లయి కూటికి గతిలేక దేశంమీద పడ్డారు.

వాళ్లు తిరిగి తిరిగి మిర్జారాజా దేశానికి వచ్చారు. అక్కడ సత్రంలో అన్నదానం జరుగుతుంటే వెళ్లి కూర్చున్నారు. వేగులు వెళ్లి ఈ సంగతి చెప్పారు మిర్జారాజా భార్యకి.

ఆమెకి తన సవాలు గుర్తుకొచ్చింది.

వెంటనే ఆమె కరన్‌ఫూల చీరగట్టి, అమ్‌ఫూల్ రవిక తొడిగి, బిడ్డడైన జమ్రుత్‌బాషాను వొళ్లో తీసుకొని, పెనిమిటైన మిర్జారాజాను వెంటబెట్టుకొని, రత్నాల నెయ్యి గిన్నెలో ముత్యాల చెమ్చా ముంచి అన్నదానం జరుగుతున్న చోటుకి వెళ్లి, మొదటి పంక్తిలో కూర్చుని, మొదటగా అన్నం తింటున్న పెద్ద వదిన దగ్గర నిలబడి 'తినవమ్మా వదిన పిల్లి' అని నెయ్యి వడ్డించింది.

ఆ మాట వినగానే వాళ్లు తలెత్తి చూసి ఆడబిడ్డ కాళ్ల మీద పడ్డారు.

ఆమె వాళ్లని క్షమించింది.

అప్పటినుంచి అందరూ అక్కడే ఉండి కలిసి మెలిసి హాయిగా జీవించారు.



# కొంచెం అంటే ఎలా కుదురుతుంది

ఒక మౌల్వీగారు ఊరూరా తిరుగుతూ, మతం సంగతులు చెప్పుకుంటూ, వాళ్లా వీళ్లా యిచ్చే నాలుగు డబ్బులు సంపాదించుకుంటూ బతుకుతూ వుండేవారు.

ఆయన ఒకసారి ఒక ఊరికి వెళ్లి, ఖురాన్‌లోని సంగతులు చెప్పి, 'అయ్యా మంచిగ బతకండి' అని హితబోధ చేయాలి.

కానీ ఆ ఊర్లో అందరూ తాగుబోతులే.

మతంలోని సంగతులు చెప్పాల్సి వచ్చినప్పుడు 'తాగుడు హరాం, మానండి' అని కూడా చెప్పాలి గదా. కానీ అలా చెబితే తాగుడికి బానిసలైన ఆ ఊరి వాళ్లు ఆదరిస్తారా? నాలుగు డబ్బులు యిస్తారా? అనే సందేహం వచ్చింది మౌల్వీగారికి.

దీనికేదైనా మినహాయింపు ఉందేమో చూద్దాం అని ఖురాన్ అంతా వెతికారు. ఎక్కడా మినహాయింపు కనిపించలేదు.

సరే, కనబడకుంటే కనబడకుండా పోయింది, మనమే మినహాయింపు యిద్దాం 'సారాయి రోజూ తాగకండి. కావాలంటే ఎప్పుడైనా కొంచెం తాగండి' అని చెబుదాం అనుకున్నారు.

అలా అనుకున్న మరు నిమిషంలోనే మౌల్వీగారికి దప్పిక మొదలయ్యింది. నాలిక ఉండచుట్టుకుపోతా వుంది. కాసేపటిలో నీళ్లు తాగకపోతే ప్రాణాలు పోతాయా అన్నట్టు అల్లాడిపోతున్నారు మౌల్వీగారు.

ఇంతలో దూరంగా ఒక నాలుగు గడపల యిల్లు కనిపించింది. మౌల్వీగారు గబగబా ఆ ఇంటి దగ్గరకు వెళ్లి ఒక గడప దగ్గర ఆగారు. అక్కడొక మనిషి నిలబడి ఉన్నాడు.

'భాయీ. దప్పికతో నా ప్రాణం పోతా ఉంది. కాస్త నీళ్లు యిప్పించు' అన్నారు ఆ మనిషితో.

ఆ మనిషి వెంటనే లోపలికి వెళ్లి సారాయి సీసాను తీసుకొచ్చి 'అలాగే యిస్తాను. ముందు కొంచెం సారాయి తాగండి. తర్వాత నీళ్లు యిస్తాను' అన్నాడు.

'తోబా తోబా. నేను సారాయి తాగడం ఏమిటి? మతం సంగతులు చెప్పాల్సిన నేను సారాయి తాగితే అల్లా నన్ను కాల్చి బూడిద చేస్తాడు' అని అక్కడి నుంచి రెండో గడప దగ్గరకు వెళ్లారు మౌల్వీగారు. అక్కడ యింకో మనిషి నిలబడి వున్నాడు.

'భాయీ. దప్పికతో ప్రాణం పోతా ఉంది. కాస్త నీళ్లు యిప్పించండి' అన్నారా మనిషితో.

ఆ మనిషి లోపలికి వెళ్లి కాల్చిన పంది మాంసం తెచ్చి 'ముందు యిది కొంచెం తిను. ఆ తర్వాత మంచినీళ్లు యిస్తాను' అన్నాడు.

ఆ మాటలు వినగానే చెవులు మూసుకున్నారు మౌల్వీగారు. ముసల్మానులకు హరాం అయిన పంది మాంసం తినడం కంటే చావడం మేలు అనుకొని మూడో గడప దగ్గరకు వెళ్లారు. అక్కడొక మనిషి నిలబడి వున్నాడు.

'భాయీ. కొంచెం మంచినీళ్లు...' అనగానే ఆ మనిషి లోపలికెళ్లి నాలుగైదేళ్ల ఒక పసివాణ్ణి తీసుకొచ్చి 'అలాగే యిస్తాను. కానీ ముందు యీ పిల్లాణ్ణి చంపు' అన్నాడు.

మౌల్వీగారికి మాట పోయింది. ముక్కుపచ్చలారని ఆ పిల్లాణ్ణి ఉత్తపుణ్యానికి చంపితే వచ్చే పాపాన్ని తలచుకొని ఆఖరి గడప దగ్గరకు వెళ్లారు.

అక్కడికి వెళ్లి నీళ్లు అడిగేసరికి ఆ గడప దగ్గరున్న మనిషి ఒక ఆడామెను తీసుకొచ్చి 'అలాగే నీళ్లు యిస్తాను. ముందు యీమెను పాడుచెయ్యి' అన్నాడు.

పరాయి స్త్రీ సోదరితో సమానం, ఆమెను పాడుచేయడం ఏమిటి అని అక్కడి నుంచి బయటపడ్డారు మౌల్వీగారు.

దప్పిక ఆయన్ని నిలవనీయలేదు. స్పృహ తప్పేలా వుంది. ప్రాణం పోయేలా ఉంది.

మౌల్వీగారు గబగబా ఆలోచించారు. పందిమాంసం తినలేను. పసివాణ్ణి చంపలేను. పరాయి ఆడదాన్ని పాడుచేయలేను. సారాయే గదా కొంచెం తాగితే సరిపోతుంది ఆ తర్వాత మంచినీళ్లు తాగి ప్రాణాలు నిలుపుకోవచ్చు అనుకొని మొదటి గడప దగ్గరున్న మనిషి దగ్గరకు పోయి 'భాయీ. నా ప్రాణం నిలబెట్టుకోవడానికి నీ కోరిక మీద కొంచెం సారాయి తాగుతాను. అది కూడా నాలుగు చుక్కలు. అంతే' అని సీసా అందుకున్నారు.

ఆది తాగారు. రుచి నచ్చింది. యింకొంచెం పొయ్యి అన్నారు. మళ్లీ తాగారు. యింకా తాగారు. మత్తు నెత్తికెక్కింది.

నంజుకోవడానికని వెళ్లి పందిమాంసం తిన్నారు. ఆ తర్వాత ఒళ్లు స్వాధీనం తప్పి పసిపిల్లవాణ్ణి చంపారు. కైపు నిలవనీయక పరాయిస్త్రీని పాడుచేసి ఇక అన్నిరకాలుగా నాశనం అయ్యారు.

అంతా అయిపోయాక అయ్యో నేనెంత తప్పు చేశాను అల్లాకు ముఖం ఎలా చూపేది అని వెక్కివెక్కి ఏడుస్తుంటే మౌల్వీగారికి మెలకువ వచ్చింది. ఆయన అడవిలో చెట్టు కింద వున్నాడు. పక్కనే సెలయేరు పారతా వుంది. అప్పటివరకూ జరిగిందంతా మాయ అని తెలిసొచ్చింది.

చెంపలు వాచిపోయేలా లెంపలేసుకున్నారు మౌల్వీగారు.

'జన్మలో బుద్ధుంటే యింకెప్పుడూ సారాయి తాగడం లాంటి తప్పుడు పనులకి మినహాయింపులు వెతకను. ఏ తప్పుడు పనైనా కొంచెంతో ఆగుతుందా? ఆగదు. యింకా పెద్ద తప్పుడుపని దాకా తీసుకుపోతుంది. యిది దేవుడు నాకు తెలియజేసిన సత్యం' అనుకొని, ఆ సెలయేటిలోని చల్లటి నీళ్లని దప్పికతీరేలా తాగి ఖురాను ప్రకారం హితబోధ చేయడానికి ఆ ఊరికి బయలుదేరి వెళ్లారు.



# భాయ్ ఖీర్

ఇద్దరు తోడికోడళ్లు. చిన్నామె మంచిది. ఇంటిపనీ వంటపనీ చేసుకుంటా పెద్దవాళ్లని గౌరవించుకుంటా ఒకరిని ఒక మాట అనకుండా ఒకరితో ఒక మాట అనిపించుకోకుండా కాపరాన్ని చేసుకుంటా వస్తా ఉంది. పెద్దకోడలికి యిది నచ్చలా. ఎలాగైనా దీన్ని ఏపక తినాలని కాసుకోని ఉంది.

ఒకసారి చిన్నామెను చూసిపోదామని ఆమె అన్న వచ్చాడు. వాడు వర్తకుడు. బిడారు తీసుకొని పోతూపోతూ దారిలో కాసేపు చెల్లెల్ని చూసుకొని పోదాము కదా అని ఆగాడు. వాడికి ఖీర్ (పాయసం) అంటే యిష్టం. రాకరాక వచ్చాడుగదా అన్నకు ఖీర్ వండి పెడదాం అని చెల్లెలు ఎంతో ఉబలాటపడింది.

'కూర్చో భాయ్. ఖీర్ వండిపెడతాను. తినిపోదువుగానీ' అంది అన్నతో.

'యిప్పుడెందుకులేమ్మా. టైములేదు' అన్నాడు అన్న.

'ఎంతసేపు భాయ్. కూర్చో' అని, బయట నులక మంచం వేసి కూర్చోబెట్టింది.

కూర్చోబెట్టనైతే కూర్చోబెట్టిందిగానీ ఆమెకు పాయసం వండను వస్తేగదా. గబగబా తోడికోడలి దగ్గరికి పరిగెత్తింది.

'అపా అపా. మా అన్న వచ్చున్నాడు. వాడికి ఖీర్ వండిపెట్టాలి. ఎలాగో చెప్పవా?' అని అడిగింది.

అమ్మా దొరికిందిరా యిది అనుకున్న తోడికోడలు 'ఏముంది చెల్లెలా. బియ్యాన్ని పాలతో కడిగి నేతితో ఉడికించు' అని చెప్పింది. వాస్తవానికి బియ్యాన్ని నేతితో కడిగి పాలతో ఉడికించాలి పాయసం చేయాలంటే. తోడికోడలు తిరగేసి చెప్పింది.

పాపం ఆ చెల్లెలు యింటికి వెళ్లి బియ్యాన్ని పాలతో కడగనూ, నేతితో ఉడికించనూ, నెయ్యిలో ఆ బియ్యం నల్లగా మాడిపోనూ.

ఒకసారి చేయనూ, బయటకి రానూ 'అయిపోతోందన్నా కూర్చో' అని అన్నతో చెప్పనూ. మళ్లీ చేయనూ మళ్లీ రానూ అన్నతో చెప్పనూ. ఎన్నిసార్లు చేసినా బియ్యం మాడిపోతున్నాయి గానీ పాయసం తయారుగావడంలా.

యింక యిలా కాదని నేరుగా సవతి దగ్గరకు పరిగెత్తింది. 'అకా అకా. మా అన్న వచ్చున్నాడు. ఖీర్ చేసిపెడదామని మా తోడికోడలిని అడిగితే 'పాలతో కడిగి నేతితో ఉడికించు' అని చెప్పింది. అట్లా చేస్తే ఎంతకీ పాయసం తయారుగావడం లేదకా' అంది.

ఎంత సవతైనా యిట్టాంటి టైములో తిరకాసు జరిగితే పోయేది తన మొగుడి ఇంటి పరువేగదా అనుకొని 'అలా కాదమ్మా. బియ్యాన్ని నేతితో కడిగి పాలలో ఉడికించాలి' అని బదులు చెప్పింది.

చెల్లెలు పరిగెత్తుకుంటా పోయి అప్పటిదాకా వండినదంతా పారేసి గబగబా బియ్యాన్ని నెయ్యిలో కడిగి పాలలో ఉడికించి పాయసం తయారుచేసి అన్నకు పెడదామని బయటికొచ్చి చూసింది. అన్న ఉంటేగదా. చూసీ చూసీ వెళ్లిపోయాడు.

అయ్యో యింత కష్టపడి చేసిన పాయసాన్ని అన్న తినకుండానే పోయాడే అనుకున్న చెల్లెలు గబగబా పోయి కాలేకాలే ఆ పాయసం



దబరను చటుక్కున నెత్తిమీద పెట్టుకొని 'భాయ్ ఖీర్. భాయ్ ఖీర్' అంటూ అన్నకోసం బయలుదేరింది. ఎంత వెతికినా అన్న దొరకలేదు. చెల్లెలు వెతకడం మానలేదు.

అలా వెతుకుతూ వెతుకుతూ ఉండగా దబర వేడికి ఆమె ఒళ్లు కాలిపోయింది. ఆ తర్వాత ఆమె పక్షిలా మారిపోయింది. అప్పట్నించి ఆకాశంలో ఎగురుతూ 'భాయ్ ఖీర్. భాయ్ ఖీర్' అని ఆరాటంగా కూస్తూ ఉండిపోయింది.

✪ ఈ కథ మా యిళ్లల్లో చాలా ప్రసిద్ధమైనది. అన్నాచెల్లెళ్ల ప్రేమని చెప్పటానికి యీ కథను చెబుతుంటారు. 'భాయ్‌ఖీర్' అని కూతవేస్తూ ఎగిరే పక్షి ఉందనీ, దాని కూత విన్నప్పుడు అన్నలున్న చెల్లెళ్లు కొన్ని నీళ్లు గాలిలో ఎగరేయాలనీ, అలా చేస్తే కాలే గుండెల ఆ చెల్లెలి మనసు చల్లబడుతుందని అంటారు. అంతేగాక యీ కథను చెబుతూ చెబుతూ 'సవతుల పప్పయినా ఉడుకుతుందేమో గానీ తోడికోడళ్ల పప్పు ఉడకదు' అనే సామెతను చెబుతారు. అంటే సవతులైనా కలుస్తారుగానీ తోడికోడళ్లు ఎప్పటికీ కలవరంట.



# ఖలీఫాగారికి ఒకటవ పాఠం

ఇస్లామీయ సామ్రాజ్యానికి ప్రతినిధిని 'ఖలీఫా' అంటారు. ఇస్లాంను ఆరాధించే ప్రజల బాగోగులన్నీ ఆ ఖలీఫానే చూడాలి. మహమ్మద్ ప్రవక్త తర్వాత ఈ పదవిని మొదటగా చేపట్టింది హజ్రత్ ఉమర్‌గారు. ఈయన గొప్ప పరిపాలనాదక్షుడు. ఈయనంటే ముస్లిం ప్రజానీకంలో అపార భక్తిశ్రద్ధలు వున్నాయి. ఈయన గురించి అనేక కథనాలు మా యిళ్లల్లో ప్రచారంలో వున్నాయి.

ఖలీఫాగారు ఒకసారి సిరియాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. రాత్రయ్యింది. దారిలో బిడారు ఆగింది. దూరంగా ఎడారిలో కొన్ని గుడిసెలు కనిపించాయి. ఎలాగూ ఇక్కడ ఆగాంకదా వీళ్ల కష్టసుఖాలు తెలుసుకుందాం అని ఖలీఫాగారొక్కరే అక్కడకు వెళ్లారు. అక్కడొక గుడిసెలో ఒక ముసలామె చెంపకు చేయి ఆనించి విచారంగా కూర్చుని వుంది.

ఖలీఫాగారు ఆమెకు సలాము చేసి, 'అవ్వా. నీకు ఉమర్ ఖలీఫాగారు తెలుసా?' అని అడిగారు.

'ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం నాకేమిటి?' అందామె కోపంగా.

ఉమర్ ఖలీఫాగారు ఆశ్చర్యపోయారు.

ఒక్కక్షణం తటపటాయించి 'అదేమిటి? ఆయన మీ ఖలీఫా గదా. ఆయన్ను అందరూ మెచ్చుకుంటారే? నువ్వేమిటి వుల్లవిరుపుగా మాట్లాడుతున్నావ్?' అని అడిగారు.

ముసలామెకి యింకా కోపం వచ్చింది.

'ఏమయ్యా. నువ్వేమైనా ఆ ఖలీఫాగారి తోకవా? నెత్తిన పెట్టుకొని మాట్లాడుతున్నావు. ఆయన అంత గొప్పవాడైతే కావచ్చుగానీ నాకు మాత్రం కాదు. పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి యిక్కడే వున్నాను. ఎంతో పేదరికం అనుభవించాను. ఎన్నో కష్టాలుపడ్డాను. ఏనాడైనా నా గురించి ఆయన పట్టించుకున్నాడా? యిదిగోమ్మా యీ డబ్బును అవసరానికి వాడుకో అని పంపించాడా? యిప్పుడు కాదులే ఆయన సంగతి. పైకి వెళ్లాక దేవుడి ముందు చెబుతాను' అంది ముసలామె.

ఖలీఫాగారు కంగారు పడ్డారు.

'ఏమమ్మా. నువ్వు యీ పరిస్థితుల్లో వున్నావని ఆయనకు ఏనాడైనా చెప్పుకున్నావా?' అన్నారు.


'చెప్పుకోవాల్సిన ఖర్మ నాకేంటయ్యా?' అని దబాయించిందామె.



'అదేమిటి. ఆయన ఎక్కడో రాజధానిలో వుంటాడు గదా. నీ బాధ ఆయనకు ఎలా తెలుస్తుంది?'

'ఎక్కడో ఉండేవాడు ఈ మారుమూల పల్లె వరకు ఆయనగారి సామ్రాజ్యాన్ని ఎందుకు విస్తరించాలి? ప్రజల కష్టసుఖాలు ఎంతదూరం వరకు పట్టించుకోగలడో అంతవరకే రాజ్య పరిమితిని పెట్టుకోవచ్చు గదా. పెద్ద పుణ్యాత్ముడిలాగా నా పల్లె వరకు విస్తరించినప్పుడు చచ్చినట్టు నా కష్టం తెలుసుకొని తీరాలి. ఆయన సామ్రాజ్యంలో ప్రజలకు వేరే ఏ పనిలేదా? వాళ్లొచ్చి మొరపెట్టుకునేదాకా యీయన వినడా?' అందా ముసలావిడ.

ఖలీఫా గారు మరేం మాట్లాడలేదు. ఇదాయనకు జీవితంలో ఎన్నటికీ మరచిపోలేని పాఠం. 'ఎంతవరకు చూసుకోగలడో అంతవరకే రాజ్య పరిధిని ఉంచుకోవాలి' అనే మాటను ఆయన చివరివరకూ గుర్తుపెట్టుకొని, ప్రజలు తన వద్దకు వచ్చే అవసరం లేకుండా తనే ప్రజల వద్దకు వెళుతూ పరిపాలన చేశాడు.



# ఏడుగురు అన్నలకు ఒకే చెల్లెలు

ఒక అడవిలో ఒక చెల్లెలు. ఆ చెల్లెలికి ఏడుగురు అన్నలు. వాళ్లందరూ ఒక పెద్ద భవంతిలో సంతోషంగా కాలం గడిపేవాళ్లు. వాళ్లింట్లో వాళ్లతోపాటు ఒక కుక్క వుండేది. ఒక పిల్లి వుండేది. వాళ్ల గుమ్మం ముందు కాపలాకు ఒక గంధం చెట్టు వుండేది.

ఈ ఏడుగురు అన్నలు ఏడాదిలో ఆరు నెలలపాటు వర్తకానికి దేశాల మీదకి వెళ్లేవాళ్లు. వాళ్లు వెళ్లాక చెల్లెలు తలుపు తీయడానికి వీల్లేదు. ఆరు నెలల తర్వాత అన్నలు వచ్చాకనే తలుపు తెరవాలి. అప్పుడు కూడా వచ్చింది అన్నలే అని పోల్చుకొని మరీ తలుపు తీయాలి.

ఆ పోలిక ఎట్లా తెలుస్తుంది? వాళ్లు ఒక పాట పాడతారు. ఏమని?

**నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ**
**నీకు పండ్లూ పూలు తెచ్చారూ తెచ్చారూ**
**తలుపు తీయవే చెల్లెలా...** అని.

అప్పటికీ తలుపు తీయడానికి వీల్లేదు. ఏమో. ఆ పాట పాడుతున్నది అన్నలు కాదేమో. అప్పుడు గుమ్మం ముందున్న గంధం చెట్టు కూడా పాడుతుంది.

**నీ ఏడుగురు అన్నలూ వచ్చారూ వచ్చారూ**
**నీకు పండ్లూ పూలు తెచ్చారూ తెచ్చారూ**
**తలుపు తీయవే చెల్లెలా....**

అట్లా గంధం చెట్టు కూడా పాడాకనే చెల్లెలు తలుపు తెరుస్తుంది. యిట్లాగే ఏళ్లు గడుస్తున్నాయి. ఆ ఏడాది కూడా అన్నలు వర్తకానికి దేశాల మీదకు వెళ్లే వేళయింది.

వాళ్లు వెళుతూ వెళుతూ చెల్లెల్ని పిలిచి 'అమ్మా. పొయ్యిలో నిప్పు ఆరిపోకూడదు. లాంతరులో దీపం మలిగిపోకూడదు. కుక్కకు పాలకూడు పెట్టకూడదు. పిల్లికి నెయ్యి కూడు పెట్టకూడదు. మేము వచ్చేంతవరకు నువ్వు తలుపు తీయకూడదు' అని జాగ్రత్తలు చెప్పి, గంధం చెట్టుని కాపలాకు వుంచి వెళ్లిపోయారు.

ఆ మరుసటిరోజే చెల్లెలు ఏదో ఏమరుపాటులో పిల్లికి నెయ్యికూడు, కుక్కకు పాలకూడు పెట్టేసింది. అవి వాటిని తినకుండా అలిగెళ్లి పడుకున్నాయి. ఆ కోపంతో ఒంటేలు పోసి పొయ్యి ఆర్పేసింది పిల్లి. కిందకు దొర్లించి లాంతరును ఆర్పేసింది కుక్క. యిల్లంతా చీకటి.

ఆ చీకటిలో చెల్లెలు ఏడ్చుకొని, కాసేపటికి ధైర్యం తెచ్చుకొని, బయటెక్కడైనా వెతికితే నిప్పు దొరక్కపోదా అని తలుపు తెరుచుకొని బయటకు వచ్చింది.

వచ్చి, నిప్పు కోసం వెతకడం మొదలుపెట్టింది. అడవిలో పోంగా పోంగా దూరంగా ఒకచోట ఒక గుడిసె కనిపించింది. అందులో ఒక ముసల్ది వంట చేసుకుంటా వుంది. అది సైతాన్. ఆ సంగతి చెల్లెలికి తెలియదు.

అందువల్ల ధైర్యంగా లోపలికి వెళ్లి 'అవా అవా. కొంచెం నిప్పుంటే పెట్టవా' అని అడిగింది.

చెల్లెల్ని చూసి ముసల్ది లోలోపల లొట్టలు వేసింది. పైకి మాత్రం ప్రేమగా ముఖంపెట్టి 'యిస్తాగానీ మనవరాలా! కాసేపు నా తల్లో పేలు చూడవా' అని అడిగింది.

ఆమె పథకం ఏమిరా అంటే ఆమె కొడుకులు వేటకు వెళ్లున్నారుగదా వాళ్లు తిరిగి వచ్చేదాకా చెల్లెల్ని ఆపగలిగితే వాళ్లొచ్చి పట్టుకుంటారులే అని. కానీ చెల్లెలు ఆగకుండా 'కుదర్దవా. త్వరగా వెళ్లాలి. యిస్తే యివ్వు లేకపోతే లేదు' అంది.

'అయ్యో అదేంమాటే మనవరాలా' అని ఒక ముంతలో నిప్పు పోసిచ్చి, ఒక సంచిలో బూడిద నింపి, దానికి చిల్లిపెట్టి 'చూడమ్మా. దీన్ని బొజ్జ్లో దోపుకొని వెళ్లు మంచిది' అని చెప్పింది ముసల్ది.

అలాగే అని బయల్దేరింది చెల్లెలు.

దారంతా సంచిలో నుంచి బూడిద కారి ఆనవాలు నిలిచింది. కాసేపటికి ముసల్దాని కొడుకులు వచ్చారు.

'ఒరే బుద్దిలేని యదవల్లారా. యిప్పుడా వచ్చేది. మంచి లేతమాంసం తప్పిపాయెనే. అయినా పథకం వేశాను. ఆ పిల్ల ఎక్కడికి వెళ్లింటుందో అక్కడిదాకా బూడిద కారి ఆనవాలు నిలుచుని వుంటుంది. వెళ్లండి. వెళ్లి దాన్ని పట్టుకొని రండి' అని చెప్పి పంపించింది.

బూడిద దోవను పట్టుకొని ముసల్దాని కొడుకులు వచ్చారు. దబాదబా తలుపులు తట్టారు. తెరుచుకుంటేగదా. పాట పాడనిదే తలుపులు తెరుచుకోవని వాళ్లకు తెలియదు. ఎలాగైనా సరే లోపలున్న చెల్లెల్ని పట్టుకోవాలి అని బయటే ఆరునెలలపాటు మకాం వేశారు.

ఆరు నెలలు గడిచాయి. వర్తకానికి వెళ్లిన ఏడుగురు అన్నలు తిరిగి వచ్చారు. వచ్చి -

**'నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ**
**నీకు పండ్లూ పూలూ తెచ్చారూ తెచ్చారూ**
**తలుపు తీయవే చెల్లెలా'**... అని పాడారు.

గంధం చెట్టు కూడా పాడింది. తలుపు తెరుచుకుంది. దూరాన వున్న ముసల్దాని కొడుకులకి అన్నలు పాడటమే వినిపించిందిగానీ గంధం చెట్టు పాడటం వినపడలేదు.

ఓహో యిదా సంగతి అనుకున్నారు వాళ్లు. మళ్లీ ఆరునెలలు మకాం వేశారు. ఏడుగురు అన్నదమ్ములు వర్తకానికి వెళ్లాక యింక దొరికిందిరా యిది అనుకొని గబగబా వచ్చి తలుపు తట్టారు. తట్టి -

**'నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ**
**నీకు పండ్లూ పూలూ తెచ్చారూ తెచ్చారూ**
**తలుపు తీయవే చెల్లెలా'**... అని పాడారు.

కానీ గంధం చెట్టు కూడా పాడాలి గదా. అది మాత్రం -

**'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ**
**నీకు పండ్లూ పూలూ తేలేదూ తేలేదూ**
**తలుపు తీయకే చెల్లెలా'** అని పాడింది.

ముసల్దాని కొడుకులు అది చూసి బిత్తరపోయారు. చెట్టేంది పాడటం ఏంది దీనిని నరికిపారేద్దాం అనుకొని నరికిపారేశారు. నరికినా దాంట్లో నుంచి మళ్లీ పాట వచ్చింది.

**'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ**
**నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ**

**తలుపు తీయకే చెల్లెలా'...**

ముసల్దాని కొడుకులకి యింకా కోపం వచ్చింది. దీనిని తగులబెడదాం అప్పుడుగానీ పీడా విరగడ కాదు అనుకొని నరికేసిన చెట్టు మీద నూనెబోసి తగులబెట్టేశారు. తగులబెట్టాక మిగిలిన బూడిదలో నుంచి మళ్లా పాట వచ్చింది.

**'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ**
**నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ**
**తలుపు తీయకే చెల్లెలా'...**

యింక యిలా కాదని చెప్పి ఆ బూడిదను తీసుకెళ్లి సముద్రంలో కలిపారు ముసల్దాని కొడుకులు. సముద్రంలో నుంచి కూడా పాట వచ్చింది.

**'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ**
**నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ**
**తలుపు తీయకే చెల్లెలా'...**

సముద్రాన్ని ఏం చేయాలో తెలియక, ప్రాప్తం లేదనుకొని వెనక్కుమళ్లారు ముసల్దాని కొడుకులు. కోపం వచ్చిన ఒక కొడుకు మాత్రం పోతూపోతూ వాడి దవడలోని ఒక పన్ను పీకి గడప దగ్గర పాతిపెట్టి వెళ్లిపోయాడు.

ఆరు నెలలు గడిచాయి. అన్నలు వచ్చారు. పాట పాడారు. సముద్రంలో నుంచి గంధం చెట్టు కూడా పాట పాడింది. చెల్లెలు తలుపు తీసీ తీయగానే గడపలోని పన్ను ఆమె పాదంలో గుచ్చుకొని అలాగే పడిపోయింది. మళ్లీ లేవలేదు. చెల్లెలు అట్లా పడిపోవడం, గంధం చెట్టు లేకపోవడం యిదంతా చూసిన అన్నలు ఏదో దుష్టశక్తి దాపురించి చెల్లెల్ని చంపేసిందని అనుకున్నారు. ఆమెను చేతులారా పాతిపెట్టడానికి మనసొప్పక, ఆస్తినీ పాస్తినీ, ధనాన్నీ సంపదనీ అలాగే వదిలేసి మతిపోయినవాళ్లలాగా ఏడుస్తూ దేశం పట్టి వెళ్లిపోయారు.

కొన్నాళ్లకు అటుగా ఒక రాజకుమారుడు వేటకు వచ్చాడు. ఈ అడవిలో యింత మంచి భవంతి ఉందేమిటి అనుకొని, ఆగి, లోపలికి వెళ్లి చూశాడు.

లోపల, చెక్కుచెదరని సౌందర్యంతో చెల్లెలు పడుకొని వుంది. ఆమెను చూసేసరికి రాకుమారుడు యింకా ఆశ్చర్యపోయాడు. ఏమి ఈ మాయ, ఎందుకు ఈమె యిలా పడుకొని వుంది అని పరీక్షించాడు.

ఆమె పాదంలో గుచ్చుకుని వున్న పన్ను కనిపించింది. అయ్యయ్యో పన్ను గుచ్చుకున్నట్టుందే అనుకొని దానిని పీకేశాడు.

అంతే, నిద్ర లేచినట్టుగా లేచి కూర్చుంది చెల్లెలు. ఎదురుగా వున్న రాకుమారుణ్ణి చూసి సిగ్గుపడింది. నా అన్నలేరి అని ప్రస్తావించింది. రాకుమారుడు ఆమె సంగతి అంతా విని, ఆమెను తీసుకొని రాజ్యానికి వెళ్లాడు. ఆ తర్వాత అన్నలను వెతికించాడు. వాళ్లు కనిపించాక, వాళ్ల అనుమతితో వాళ్ల చెల్లెల్ని పెళ్లి చేసుకున్నాడు.

ఆ తర్వాత వాళ్లందరూ హాయిగా కాలం గడిపారు.

✪ ఈ కతలో పాట ముఖ్యం. మా పెదమ్మ కరిమున్ పాటను ఇలా పాడింది:

'తెరె సాతో భాయా ఆయెమా ఆయె
తుజె ఖుడా గుడా లాయెమా లాయె
దర్వాజా ఖోల్

# ఖలీఫాగారికి రెండవ పాఠం

మరోసారి యిలాగే రాత్రివేళ నగర పర్యటన చేస్తున్నారు ఖలీఫాగారు.

దారిలో ఊరిచివరన ఒక యింట్లో నుంచి పొగ వస్తోంది. ఇదేమిటి యింత రాత్రివేళ వంట చేసుకుంటున్నారు అని అక్కడకు వెళ్లి చూశారు. అక్కడొకామె వంట చేస్తోంది. ఆమె పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. తల్లి త్వరగా వంట పూర్తి చేస్తే తిందామని చూస్తున్నారు. కానీ ఆ వంట ఎంతకీ పూర్తవలేదు. పిల్లలు ఏడుస్తూనే వున్నారు. ఆమె కూడా ఏడుస్తూనే వుంది.

ఖలీఫాగారు చూసి చూసి 'ఏమ్మా. ఏంటిది? నువ్వు వంట చేస్తున్నావా? వంట నటిస్తున్నావా? పిల్లలు ఆకలితో ఏడుస్తుంటే త్వరగా అన్నం పెట్టక ఏం చేస్తున్నావ్?' అని కోప్పడ్డారు.

'ఈ కోపం నా మీద కాదు వెళ్లి ఖలీఫా మీద చూపించండి' అందామె చురుగ్గా.

ఖలీఫాగారు కంగారు పడ్డారు.


'మధ్యలో ఆయనేం చేశారు?' అని అడిగారు.

'ఆయన చేయకపోతే మరెవరు చేస్తారు? నా భర్త చనిపోయాడు. నాకు వేరే ఆదరవు లేదు. నా పిల్లలను పోషించలేను. అందుకనే పొయ్యి మీద కొన్ని వేడినీళ్లు పడేశాను. పిల్లలు దానినే అన్నం అనుకొని చూసీ చూసీ నిద్రపోతారు. రోజూ నేను చేసే పనే యిది. భర్త చనిపోయిన ఆడవాళ్లు తన రాజ్యంలో ఎలా బతుకుతున్నారో తెలుసుకోవాల్సిన పని ఖలీఫాగారికి లేదా? వారి గురించి వారి పిల్లల గురించీ ఆయన ఎన్నడైనా ఆలోచించారా?' అని అడిగిందామె.

ఖలీఫాగారికి దిక్కుతోచలేదు. కన్నీరు ఆగలేదు.

వెంటనే యింటికి వెళ్లి తిండి పదార్థాలన్నీ ఆమెకు తెచ్చిచ్చి ఆ మరుసటిరోజే ఆమెకు పింఛను మంజూరు చేశారు. అంతేకాదు భర్త చనిపోయిన ఆడవాళ్లందరికీ పింఛను ప్రకటించారు.

ఇస్లాంలో వితంతు పింఛను హక్కు అలా పుట్టిందని చెబుతారు.



# షారమ్మ

షారమ్మ యిల్లూ, కాకి యిల్లూ పక్కపక్కనే.

షారమ్మ యిల్లు కర్రతో కట్టింది. కాకి యిల్లు ఉప్పుతో కట్టింది.

ఒకరోజు షారమ్మ యింటికి బంధువులు వచ్చారు. అన్నంలో ఉప్పు తక్కువైంది.

షారమ్మ వెళ్ళి కాకితో 'ఒరే కాకిగా. మా యింటికి బంధువులొచ్చారు. అన్నంలో ఉప్పు తక్కువైంది. కాస్త ఉప్పు యివ్వరా?' అని అడిగింది.

'అయ్యో. భలేదానివకా. నా దగ్గర ఉప్పెక్కడిది?' అంది కాకి.

'అదేందిరా కాకిగా. నీ యిల్లంతా ఉప్పుతోనే కదా కట్టింది. కాస్త ఆ పందిరిగుంజ తుంచి యివ్వరా చాలు' అంది షారమ్మ.

'అమ్మో. పందిరి గుంజ తుంచితే పందిరి పడిపోతుంది. నేనివ్వను' అంది కాకి.

'కాస్త నీ అరుగు తుంచివ్వరా చాలు' అంది షారమ్మ.

'అమ్మో అరుగు తుంచితే అరుగు విరిగిపోతుంది నేనివ్వను' అంది కాకి.

'కాస్త నీ మూడుకాళ్ల పొయ్యిలో నుంచి ఒక రాయిని తుంచివ్వరా చాలు' అంది షారమ్మ.

'అమ్మో. యిస్తే నా పొయ్యి పడిపోతుంది నేనివ్వను' అంది కాకి.

అట్లా ఎన్నివిధాలుగా అడిగినా అన్నివిధాలుగా లేదని చెప్పింది కాకి. సరే అని ఉప్పు లేని అన్నమే బంధువులకి వడ్డిచ్చింది షారమ్మ.

కొన్నాళ్ళకు తుఫాన్ వచ్చింది. వానొచ్చి అటూ యిటూ కొట్టింది. దెబ్బకి కాకి యిల్లు కరిగిపోయింది. షారమ్మ యిల్లు అలాగే నిలుచుంది.

వానకు తడిసి ముద్దయిపోయిన కాకి నెమ్మదిగా షారమ్మ యింటికి చేరింది. లోపల షారమ్మ వెచ్చగా పడుకొని వుంది.

'షారమ్మా షారమ్మా. నా యిల్లు కరిగిపోయింది. ఈ రాత్రికి నీ యింట్లో తలదాచుకోడానికి చోటివ్వవా?' అని అడిగింది కాకి.

'భలేవాడివిరా కాకిగా. నా యింట్లో చోటెక్కడిది. లేదు లేదు' అంది షారమ్మ.

'అట్లా అనబాక షారమ్మ. కాస్త నీ పందిరి కింద పడుకుంటా' అంది కాకి.

'అమ్మో పందిరి కింద నా బిడ్డలు పడుకొని వున్నారు చోటు లేదు' అంది షారమ్మ.

'కాస్త నీ అరుగు మీద పడుకుంటా' అంది కాకి.



'అమ్మో అరుగు మీద గుడ్డలు ఆరేసున్నాయి. చోటులేదు' అంది షారమ్మ.

'కాస్త నీ మూడుకాళ్ల పొయ్యిలో పడుకుంటా' అంది కాకి.

'అమ్మో పొయ్యిలో మా పిల్లి పడుకుని వుంది. చోటు లేదు' అంది షారమ్మ.

కాకి అట్లా బతిమిలాడి, బతిమిలాడి మొత్తానికి గాదెలో చోటు సంపాదించుకుంది. దాని అదృష్టం బాగుండి షారమ్మ ఆ టైములో గాదెలో సెనగపప్పు మూటలు వేయించి వుంది. వాటిని చూసి అబ్బా దొరికిందిరా మేత అనుకుని కాకి గుట్టుచప్పుడు కాకుండా సెనగపప్పు తినడానికి కూర్చుంది.

మొదటి పప్పు నోట్లో వేసుకుని కొరకగానే 'కటుమ్' అని శబ్దం వచ్చింది.

ఆ శబ్దానికి మెలకువ వచ్చిన షారమ్మ 'ఒరే కాకిగా. ఏం చేస్తున్నావ్‌రా గాదెలోన' అని అడిగింది.

'ఏంలేదు షారమ్మా. మా అత్తగారింటి నుంచి తెచ్చుకున్న వక్కపలుకు నములుతున్నా' అని బదులిచ్చింది కాకి.

మళ్లీ కాసేపటికి 'కటుమ్' అని శబ్దం వచ్చింది.

'ఒరే సచ్చినోడా. మళ్ళీ ఏందిరా ఆ శబ్దం?' అని అడిగింది షారమ్మ.

'ఏం లేదు షారమ్మా. మా అత్తగారింటి నుంచి తెచ్చుకున్న లవంగం నములుతున్నా' అంది కాకి.

అట్లా కటుమ్, కటుమ్ అని మొత్తం సెనగపప్పంతా తినేసి గాదెంతా రెట్టలు పోసి పొద్దున్నే వెళ్లిపోయింది.


షారమ్మ పొద్దున్నే గాదెలో చేయిపెడితే సెనగపప్పు దొరికితే గదా. షారమ్మకు కడుపు కాలిపోయింది. నీ సంగతి యిలా వుందా అని చెప్పి మరుసటిరోజు ఊర్లోని కాకులందరికీ విందు ప్రకటించింది.

కాకుల విందుగదా. ఎందుకు వదులుకోవాలిలే ఛాన్సు అనుకొని దొంగకాకి కూడా వచ్చి వాలింది.

షారమ్మ దానిని గమనించి అందరికీ వడ్డించుకుంటా వడ్డించుకుంటా వచ్చి వేడివేడి చారుని దాని ముఖాన కుమ్మరించింది. దొంగకాకి ఆ వేడికి లబోదిబోమని షారమ్మ కాళ్ళమీద పడింది.

'అట్లా రారా దారికి' అని ఆ కాకిని క్షమించింది షారమ్మ.

✪ ఈ కథను మా యిళ్లల్లో పెద్దలు పిల్లలూ చాలా ఇష్టంగా చెప్పుకుంటారు. యిక్కడ 'షారమ్మ' అనేది పిట్ట. ఏం పిట్టో ఎవరికీ తెలియదు.



# చార్ ఖస్‌రత్ కె ఇన్‌సాన్

## మనుషుల తత్వం నాలుగు రకాలు

ఒకడు పాపం పేదోడు. వాడు ఒక ఉన్నోడి దగ్గర రెండు రూపాయలు అప్పు చేశాడు. చెప్పిన టైముకి తీర్చేసేవాడేగాని ఎందుకనో తీర్చలేకపోయాడు.

అందుకని ఉన్నోడి దగ్గరకు వెళ్లి 'భాయ్ సాబ్. చేతికి డబ్బు అందలేదు. అందిన వెంటనే తీర్చేస్తాను. మన్నించండి' అని చెప్పాడు.

అందుకు ఉన్నోడికి కోపం వచ్చి, టపటపమని నాలుగు దెబ్బలు కొట్టేశాడు పేదోణ్ణి.

పేదోడి కళ్లమ్మట నీళ్లు వచ్చాయి. చెంప మీద చేయి ఆనించుకొని, ఏడ్చుకుంటూ 'నన్ను కొట్టాడు. నన్ను కొట్టాడు' అని బయల్దేరాడు.

దారిన పోతున్న ఒకణ్ణి ఆపి 'నన్ను కొట్టాడు. నన్ను కొట్టాడు' అన్నాడు.

వాడు వినలేదు. ఆగలేదు. 'పో పో రా. నువ్వేదో పుల్ల పెట్టకపోతే ఎవరైనా ఉత్తపుణ్యానికి ఎందుకు కొడతారు. పోపో' అని వెళ్లిపోయాడు.

పేదోడు ఏడుపు ఆపలేదు. దారిన పోతున్న రెండోవాణ్ణి ఆపి 'నన్ను కొట్టాడు. నన్ను కొట్టాడు' అన్నాడు.

వాడు ఆగి, అంతా విని 'పోనీలే బాధపడకు. ఏం చేస్తాం. జరిగిందేదో జరిగిపోయింది. ఊరుకో' అని సానుభూతి పలికి వెళ్లిపోయాడు.

పేదోడు ఏడుపు ఆపలేదు. దారిన పోతున్న మూడోవాణ్ణి ఆపి 'నన్ను కొట్టాడు. నన్ను కొట్టాడు' అన్నాడు.

వాడు ఆగి, అంతా విని 'పోనీలే బాధపడకు. యిదిగో యీ రెండు రూపాయలు తీసుకొని వెళ్లి నీ అప్పు తీర్చేసుకో. నేను చేయదగ్గ సాయం యిదే' అని రెండు రూపాయలు యిచ్చి వెళ్లిపోయాడు.

అయినప్పటికీ పేదోడు ఏడుపు ఆపలేదు. దారిన పోతున్న నాలుగోవాణ్ణి ఆపి 'నన్ను కొట్టాడు. నన్ను కొట్టాడు' అన్నాడు.

వాడు ఆగి 'ఎవర్రా వాడు. ఎందుకు కొట్టాడు?' అని అడిగి, సంగతి తెలుసుకొని 'ఆ అట్టెట్ట కొడతాడు. బాకీ తీర్చకపోతే కొట్టేయడమేనా?' అని పేదోడి చేయి పట్టుకొని తీసుకెళ్ళి, ఉన్నోణ్ణి పట్టుకొని పటపటమని నాలుగు బాది, రెండు రూపాయలు వాడి ముఖాన కొట్టి 'చెల్లుకు చెల్లు. ఇదీ న్యాయం' అన్నాడు.

అప్పుడుగానీ పేదోడి ఏడుపు ఆగలేదు.



# దాల్‌గోట్నీ దెబ్బ

## పప్పుగుత్తి దెబ్బ

ఒకూర్లో ఒక రుస్తుం పైల్వాన్ ఉన్నాడు. చేతికి కడియం, మెడలో తావీజు, దండాలు బస్కీలు తీసి నున్నగా మెరస్తా ఉన్న ఒళ్లు... పైల్వాన్ అంటే ఆయన గదా అని అందరూ అనుకుంటా ఉండేవాళ్లు.

చాలామంది ఆ రుస్తుం పైల్వాను కాడ శిష్యులుగా చేరి మంచి మంచి కుస్తీ పట్లు నేర్చుకొని వాళ్లు కూడా పేరు తెచ్చుకోవడం మొదలుబెట్టినారు.

అయితే ఈ మధ్యనే రుస్తుం దగ్గర ఒక కొత్త శిష్యుడు చేరినాడు. వాడు బలే హుషారు.

పగలు పొద్దస్తం గురువు కాడ చేరి ఆయనకు ఆ మాటలు చెప్తా ఈ మాటలు చెప్తా ఒళ్లు పడతా మాలీష్ చేస్తా మంచిగా ఐసు చేసుకున్నాడు. దాంతో రుస్తుం పొంగిపోయి-

'అబ్బ... నువ్వురా శిష్యుడివంటే' అనేసి ఆయనకు తెలిసిన పట్లన్నీ నేర్పించడం మొదలుబెట్టినాడు.

రుస్తుం భార్య ఇదంతా గమనిస్తా ఉంది. గమనించి గమనించి ఒకరోజు రుస్తుంతో-

'జీ... నీ పద్ధతి నాకేమీ నచ్చడంలా. కొత్తగా వచ్చినోడు అంత సక్కరమైన వాడు కాదని అనిపిస్తా ఉంది. నువ్వేమో మునగచెట్టు ఎక్కినోడి మాదిరిగా నీకు తెలిసిన విద్యలన్నీ కాయలుగా కోసి వాడి జోలీలో పోస్తా ఉన్నావు. కొన్ని నువ్వు కూడా దాచుకో. గురువంటే ఎవరు? శిష్యులకు తెలియనిది ఏదో తెలిసినవాడు. గురువు ఎప్పుడూ గురుస్తానంలో ఉండాల. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. లాకుంటే తర్వాత బాదపడాల్సి ఉంటుంది' అని చెప్పింది.

రుస్తుం వినలా. 'అహె... మావాడు అట్టాంటి వాడు కాదు' అనేసి తనకు తెలిసిన లాస్టు కుస్తీ పట్టు కూడా నేర్పించేసినాడు.

ఎప్పుడైతే లాస్టు పట్టు కూడా తెలిసిపోయిందో అప్పుడే ఆ మినిట్టులోనే ఆ టక్కులమారి శిష్యుడు బజారులోకి వచ్చేసి గోదాలోకి దిగేసినాడు.

బస్తీలో సవాల్. ఇవ్వాల్టి నుంచి ఈ ఊర్లో నేనే పెద్ద పైల్వాన్‌ని. కావాలంటే ఎవరైనా పోటీ పడొచ్చు. వాళ్లందరినీ ఓడిస్తా. ఆఖరికి మా గురువుగారికైనా సరే. బస్తీమే సవాల్. ఓయ్... గురువా... రా దమ్ముంటే" అని రుస్తుంనే సవాలు చేస్తా రంకెలు వేస్తా ఉన్నాడు.

ఈ మాటలు చెవిన పడగానే రుస్తుం బెదిరిపోయి యింట్లోకొచ్చి కూర్చున్నాడు.

గోదాలో దిగితే తను శిష్యుడికి సమానం కాగలడుగానీ పైచేయి మాత్రం కాలేడు. ఎట్టా అని మొకం నల్లంగా పెట్టుకొని కళ్లల్లో నీళ్లు తెచ్చుకున్నాడు. ఇన్నాళ్లు గురుస్థానంలో ఉన్నవాడు ఒక్కసారిగా ఈ అవమానాన్ని తట్టుకోగలడా?

రుస్తుం భార్య ఇదంతా చూస్తానే ఉంది. అప్పుడామె పొయ్యి ముందర కూర్చొని దాల్‌గోట్నీ (పప్పుగుత్తి)తో పప్పు మెదపతా ఉంది.

'నేను చెబితే విన్నావా? వద్దయ్యా వాడికి అన్నీ చెప్పొద్దు అనంటే ఎగురుకుంటా అన్నీ చెప్తివే అనుబవించు' అంది.

గురువు దీనంగా చూసినాడు భార్య వంక.

'అదా.. నువ్వు నాకు చెప్పేమాట. కష్టకాలంలో తోడు నిలవడం భార్య ధర్మం కదా' అన్నాడు ఆమెతో.

గురువు భార్యకు జాలి కలిగింది. మొగుడి మర్యాదే కదా ఇంటి ఇల్లాలి మర్యాదా. అందుకని ఆలోచించి ఆలోచించి చేతిలో ఉన్న పప్పు గుత్తిని చూసి 'ఆ ఐడియా.. ఇదిగో.. ఈ దాల్‌గోట్నీ తీసుకొని నేరుగా గోదాలోకెళ్లి నేల మీద పాతు. అప్పుడు నీ శిష్యుణ్ణి పిలు. రా రా.. చూసుకుందాం.. ఇప్పుడురా.. వచ్చావంటే దాల్‌గోట్నీ దెబ్బ కొడతా అని చెప్పు. దెబ్బకు దడుసుకొని నీ కాళ్ల దగ్గిర పడతాడు' అనంది.

'దాల్‌గోట్నీ దెబ్బ ఏంది? అట్టాంటి పట్టు నాకు తెలియదే' అన్నాడు రుస్తుం అమాయకంగా.

'తెలియబళ్లా. పో. నేను చెప్పినట్టుగా చేయి చాలు' అంది రుస్తుం భార్య.

రుస్తుంకు ధైర్యం వచ్చేసింది. ఛాతీ నిండుగా గాలి పీల్చి, భార్య చేతిలో ఉన్న దాల్‌గోట్నీ తీసుకొని నేరుగా గోదాలోకి పోయాడు.

చేతిలో దాల్‌గోట్నీతో, మొకాన కోపంతో, కండలు పొంగించి వస్తున్న రుస్తుంను చూసి శిష్యుడు కంగారు పడ్డాడు. అయినా పైకి ధైర్యంగా తొడగొట్టి బస్తీమే సవాల్ అన్నాడు.

రుస్తుం నేరుగా గోదాలో దిగి దాల్‌గోట్నీని నేలమీద పాతాడు. పాతి పెద్దగా నవ్వాడు.

'ఒరే.. శిష్యుడుగా.. నీకు నేను అన్ని పట్లు చెప్పేశానని నువ్వు అనుకుంటా ఉన్నావు కదా. లేదురా.. నీలాంటి వాళ్ల కోసం నా దగ్గర దాల్‌గోట్నీ పట్టు దాచి పెట్టుకొని ఉంటా. ఇప్పుడు రా. వచ్చావనుకో.. నిన్ను దాల్‌గోట్నీ దెబ్బ కొడతా. ఎట్టా కొడతానంటే నువ్వు దెబ్బకు ఏడికి యాడ పడతావో నాకే తెలియదు. రారా పుడింగి' అని పిలిచే సరికి శిష్యుడు బిక్కమొకం పెట్టేసినాడు.

ఏమో గురువుకు నిజంగానే దాల్‌గోట్నీ దెబ్బ తెలుసేమో అనుకొని రుస్తుం కాళ్ల మీద పడి 'ఉస్తాద్.. మన్నించు.. ఏదో కుర్ర చేష్టతో వాగాను. నువ్వెక్కడా? నేనెక్కడా? నీ దాల్‌గోట్నీ దెబ్బ తింటే నేనేమైపోదును.. తప్పు కాయి' అంటూ బుద్ధిగా చెంపలు వేసుకున్నాడు.

రుస్తుం హాయిగా నవ్వుకొని ఇంటికి వెళ్లి భార్యకి బోలెడన్ని షుక్రియాలు చెప్పుకున్నాడు.

ఆనాటి నుంచి రుస్తుంను అందరూ దాల్‌గోట్నీ పైల్వాన్ అని పిలుస్తా ఉండేవాళ్లు. ఆయన ఒకప్పుడు ఉదయగిరిలో ఉండేవాడని అంటారు.

✪ ఈ కథను యింకో వెర్షన్‌లో కూడా చెబుతారు. ముస్లింలు నమాజు చదివే ముందు ఒళ్లు శుభ్రం చేసుకోవడానికి 'వజూ' చేస్తారు కదా. 'వజూ' ఇంపార్టెన్స్‌ను తెలియచేయడానికన్నట్టు ఈ కథని మార్చి చెబుతారు. ఈ వెర్షన్‌లో దాల్‌గోట్నీ ఉండదు. బిక్కమొకం వేసుకొని గురువు యింటికి చేరితే, అతడి భార్య 'మరేం పర్వాలేదు. లే.. లేచి వజూ చేసుకో. వజూ నీళ్లతో ఒళ్లు శుభ్రం చేసుకుంటే ఒంట్లో బోలెడంత శక్తి వస్తుంది. మనసుకు ధైర్యం వస్తుంది. వెళ్లి వాణ్ణి ఓడించొచ్చు' అని చెబుతుంది. ఆమె మాట విని గురువు వజూ చేసుకొని వెళ్లి శిష్యుణ్ణి గోదాలో ఓడిస్తాడు.



# ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి

## సముద్రంలో అలలు పుట్టిన కథ

ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి ఉత్‌రో ఉత్‌రోనా
పకాయ్‌సా పక్‌వాన్ బాసీ హోగయ్
బిఛాయ్‌సా దస్తర్ ఉడ్ ఉడ్‌కొ జాతె హై
ఆయ్ సా సగ్గె ఫిర్ ఫిర్‌కొ జాతె హై
ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి ఉత్‌రో ఉత్‌రోనా

దిగవే దిగవే సావల్‌రాణి కిందకు దిగవమ్మ
వండిన వంటలు పాసిపోయే
పరిచిన విస్తళ్లు ఎగిరెగిరిపోయే
వచ్చిన బంధువులు తిరిగి తిరిగి పోయే
దిగవే దిగవే సావల్‌రాణి కిందకు దిగవమ్మా...

ఎంతమంది బతిమిలాడినా ఆ కొత్త పెళ్లికూతురు కిందకు దిగడమే లేదు.

కింద యువరాజైన పెళ్లికొడుకు నిలబడి వున్నాడు. పెళ్లి చేయడానికి వచ్చిన ఖాజీ (పురోహితుడు) నిలబడి వున్నాడు. పెళ్లి చూడడానికి వచ్చిన బంధువులు నిలబడి వున్నారు. పెళ్లికి ఏర్పాట్లు చేసిన మహరాజు నిలబడి వున్నాడు. ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా సావల్‌రాణి దిగిరావడం లేదు. యింకాసేపట్లో పెళ్లనగా చెట్టెక్కి కూర్చుంది.

కారణం ఏమిరా అంటే - వాళ్లమ్మ, అంటే రాణిగారు ఈ పిల్ల కడుపుతో వుండగా వాళ్ల నాన్న, అంటే రాజుగారు యుద్ధానికి వెళుతూ



'మగపిల్లాడు పుడితే పాలిచ్చి పోషించు. ఆడపిల్ల పుడితే ఖబరస్తాన్‌లో పాతిపెట్టు' అని చెప్పేసి పోయాడు.

అప్పటికే రాజుగారికి ఒక కొడుకు కలిగున్నాడు. అయినాగానీ ఆడపిల్లంటే అంత మంటంట ఆ రాజుగారికి. యిదేంది దేవుడా యీయన యింత మాట అనేసి పోయాడు అని రాణిగారు భయంభయంగా రోజులు లెక్కపెట్టుకుంటా వుంటే చివరకు ఖర్మగాలి ఆడపిల్లే పుట్టింది. రాజుగారి మాటల ప్రకారం ఆ పిల్లను తీసుకెళ్లి ఖబరస్తాన్‌లో పాతిపెట్టాలి. కానీ కన్నతల్లికి మనసు రాలేదు. రహస్యంగా ఒక గుహలో పెట్టి, ఒక పరిచారికను పెట్టి కన్నతల్లెవరో, కన్న తండ్రెవరో తెలియకుండా పెంచుకుంటూ వస్తా వుంది.

ఈమెకు ఈసరికే ఒక కొడుకు వున్నాడు కదా. వాడు పెరిగి పెద్దవాడయ్యి పెళ్లీడుకు వచ్చాడు.

ఒకనాడు వాడు వేటకు పోతూ పోతూ ఈ అందాల భరిణెను చూశాడు. ఈమె కూడా వాణ్ణి చూసింది. ఇద్దరూ ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకుందాం అనుకున్నారు.

యువరాజు వెళ్లి ఈ విషయం రాజుగారికి చెప్పాడు. రాజుగారు ఆఘమేఘాల మీద పెళ్లికి ఏర్పాట్లు చేశారు.

రాణిగారికి యీ సంగతి తెలియనే తెలియదు. ఆడవాళ్లకి ఒక మాట చెప్పి చేసే రోజులా అవి? తీరా ఏర్పాట్లు జరిగిపోయి, వంటలు వండేసి, బంధువులు వచ్చేసి సగం పెళ్లి జరిగిపోయాక యింక ఉండబట్టలేక 'నాయనా, ఎవరు పెళ్లికూతురు' అని అడిగారు రాణిగారు.

'అమ్మా. ఫలానా గుహలో వున్న ఫలానా అమ్మాయి. ఆమెకు అమ్మా నాన్నా లేరు. పిల్ల గుణవంతురాలు. చేసుకుంటున్నాను' అన్నాడు యువరాజు.

రాణిగారి వంట్లో రక్తం చల్లబడింది.

తోడబుట్టిన అన్న తోడబుట్టిన చెల్లెల్ని చేసుకుంటే యింకేమైనా ఉందా? ఈ విషయాన్ని కొడుకుతో చెప్పినా, భర్తతో చెప్పినా ఆమె తలా ఆమె కూతురి తలా నరికిపారేస్తారని భయపడి గబగబా పరిగెత్తింది కూతురి దగ్గరకు.

పరిగెత్తి, సంగతి చెప్పి, ఏడ్చి, గుండెలు బాదుకుని 'అమ్మా, నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నీ అన్నతో ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు' అంది.

ఆమె ఆ మాటలు అంటున్న టైముకి ఆ పిల్ల యిత్తడి చెంబులో నీళ్లు తీసుకుని, సవక (సరుగుడు) చెట్టు కింద కూర్చుని, నమాజు కోసం వజూ (కాళ్లూ చేతులూ కడుక్కోవడం) చేసుకుంటోందంట.

ఎప్పుడైతే తల్లి ఈ మాట చెప్పిందో అప్పుడే ఆ చెంబులోని నీళ్లు కింద పారేసి గబగబా సవక చెట్టు ఎక్కి కూర్చుంది. యింక అక్కడి నుంచి కిందకు దిగలేదు.

పెళ్లివారందరూ అక్కడికి వచ్చారు. చెప్పారు. బుజ్జగించారు. కారణం అడిగారు. బతిమిలాడారు.

సావల్‌రాణి మాత్రం కిందకు దిగిరావడం లేదు.  ఆమె ప్రేమలో పిచ్చివాడైపోయిన అన్న యింక చూసి చూసి 'ఉండండి. నేను చెట్టెక్కి లాక్కొస్తాను' అని చెట్టెక్కాడు.

వాడు పైకి రాను. సావల్‌రాణి యింకాస్త పైకి ఎక్కను.


వాడు పైకి రాను. సావల్‌రాణి ఇంకాస్త పైకి ఎక్కను. అలా ఎక్కుతూ ఎక్కుతూ వుండేసరికి - కింద ఈ పిల్ల పారేసింది కదా యిత్తడి చెంబులోని నీళ్లు - అవి సముద్రమయ్యాయి.

కొసాకు వెళ్లిన సావల్‌రాణి ఆ సముద్రంలో దూకి అలగా మారింది. అది మొదటి అల. చెల్లెలి అల.

వెనకే వచ్చిన అన్న కూడా దూకి అలగా మారాడు. అది రెండవ అల. అన్న అల.

ఆనాటి నుంచి ఈనాటి వరకూ సముద్రంలో చెల్లెలి అలను అందుకోవడానికి అన్న అల దబదబమని పరుగు తీస్తూనే వుంది. అయినాగానీ చెల్లెలి అల అన్నకు అందడం లేదు.

ఏనాడైతే ఆ అల ఈ అలకు అందుతుందో ఆ రోజున ప్రళయం వచ్చి లోకం అంతరిస్తుందని పెద్దలు చెబుతారు.



# హసన్ హబ్బాల్

ఒక దేశంలో తాళ్లు పేని జీవించేవాడొకడున్నాడు. వాడి పేరు 'హసన్'. తాళ్లు పేని అమ్మేవాణ్ణి 'హబ్బాల్' అని అంటారు కాబట్టి అందరూ వాణ్ణి 'హసన్ హబ్బాల్' అని పిలుస్తుండేవారు.

వాడు రోజూ ఉదయాన్నే రూపాయి తీసుకొని బజారుకు వెళ్లి నార కొనుక్కుంటాడు. దానితో పశువులకు ముక్కు తాళ్లు, పలుపుతాళ్లు పేనుతాడు. పేని వాటిని రెండు రూపాయలకు అమ్ముతాడు. లాభం ఒక్క రూపాయిని యింటి ఖర్చులకు వాడుకుంటాడు. పెట్టుబడి ఒక్క రూపాయిని మరుసటి రోజు కోసం దాచుకుంటాడు.

యిట్లా వాడు ముప్పయి ఏళ్లుగా బతుకుతున్నాడు. ఈ ముప్పయి ఏళ్లలో వాడి పెట్టుబడి పెరగలేదు. ఆదాయమూ పెరగలేదు. ఊళ్లో అందరికీ ఈ సంగతి తెలుసు.

ఏనాటి నుంచో యితడి వ్యవహారం గమనిస్తున్న యిద్దరు ధనవంతులకి ఈ విషయం మీద ఒకసారి చర్చ జరిగింది.

'చూశావా మిత్రమా హసన్ హబ్బాల్ జీవితం. ముప్పయి ఏళ్లుగా వాడు ఒక్కలాగే బతుకుతున్నాడంటే ఏమనుకోవాలి. తక్దీర్ (అదృష్టం) వాడి తలుపు తట్టలేదనే గదా' అన్నాడు మొదటి ధనవంతుడు.

'కాదు మిత్రమా. తక్బీర్ (కార్యసాధన) ఉంటే ఎవ్వరికీ అదృష్టంతో పనిలేదు. హసన్ హబ్బాల్ మంచి వృత్తి నైపుణ్యం ఉన్నవాడు. కానీ వాడికి కార్యసాధన లేదు. 'వ్యాపారాన్ని పెంచుకోవాలి. బాగా డబ్బు గడించాలి. పైకి రావాలి' అని అతను అనుకోవడం లేదు. అందుకని అలా ఉన్నాడు' అన్నాడు రెండవ ధనవంతుడు.

'నువ్వు చెప్పేది కరెక్టు కాదు మిత్రమా. బాగా సంపాదించాలి, పైకి రావాలి అని అనుకోని మనిషి ఉండడు. అందరూ అలా అనుకుంటారు. కార్యసాధనతో ప్రయత్నాలు చేస్తారు కూడా. అయితే అందరూ ఆ పనిలో సఫలం కాలేరు. హసన్ హబ్బాల్ లాంటి వాళ్లకి టైము కలిసి రావాలి. అదృష్టం తోడు నిలవాలి. అప్పుడే వాళ్లు పైకి వచ్చేది' అన్నాడు మొదటివాడు.

'చూద్దామా పందెం' అన్నాడు రెండవవాడు.

'సరే కానీ' అన్నాడు మొదటివాడు.

మరుసటి రోజు వాళ్లిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకు వెళ్లారు.

కార్యసాధనను నమ్ముకున్న ధనవంతుడు ముందుకు వచ్చి 'ఓయ్ హసన్ హబ్బాల్. ఎంతకాలం యిలా గొర్రెతోక బతుకు బతుకుతావు. నేను నీకు కొంత డబ్బు యిస్తాను. దానితో నీ వ్యాపారాన్ని పెంచుకో. యింకొంత మంది మనుషుల్ని పెట్టుకొని పని చేయించు. బాగుపడు. మళ్లీ మేము రెండు నెలల తర్వాత వస్తాం' అని చెప్పి హసన్ హబ్బాల్‌కు తగినంత డబ్బు యిచ్చి స్నేహితుడితో పాటు వెళ్లిపోయాడు.

ఇది కలా నిజమా అర్థంకాని హసన్ హబ్బాల్ ఎంతో సంతోషంగా ఆ డబ్బు అందుకున్నాడు.

డబ్బు చేతిలో పడ్డాక అతడికి మాంసం గుర్తుకొచ్చింది.

'పాడుబతుకు ముప్పయి ఏళ్లుగా బతుకుతున్నాను. ఒక్కనాడు కూడా కడుపు నిండుగా మాంసం తినలేదు. ఇవాళ యింటికి మాంసం తీసుకెళదాం' అనుకొని కేజీ మాంసం కొనుక్కొని, నెత్తి మీద పెట్టుకొని, ఆ మాంసం కింద ధనవంతుడు యిచ్చిన డబ్బును కూడా పెట్టుకొని యింటికి బయలుదేరాడు.

దారిలో ఒక గద్ద ఆ మాంసాన్ని చూసి సవ్ మంటూ వచ్చి తన్నుకుపోయింది. మాంసంతో పాటు డబ్బులు కూడా పోయాయి.

లబోదిబోమన్నాడు హసన్ హబ్బాల్.

రెండు నెలలు గడిచాయి.

ధనవంతులిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకి వచ్చారు.

రెండు నెలల కిందట ఎలా ఉన్నాడో యిప్పుడూ అలాగే ఉన్నాడు హసన్ హబ్బాల్. రూపాయి పెట్టుబడి. రూపాయి ఆదాయం.

'చూశావా మిత్రమా. నేను చెబితే నువ్వు నమ్మలేదు. వీడికి అదృష్టం కలిసి రాదంతే' అన్నాడు అదృష్టాన్ని నమ్మిన ధనవంతుడు.

'కాదు. యితడు తెలియనితనంతో డబ్బు పోగొట్టుకున్నాడు. యితనికి యింకో అవకాశం యిస్తాను. కార్యసాధనతో కచ్చితంగా పైకివస్తాడు' అని మళ్లీ యింకొంచెం పైకం యిచ్చి 'రెండు నెలల తర్వాత మళ్లీ వస్తాం. ఈసారైనా జాగ్రత్తగా నీ వ్యాపారాన్ని పెంచుకో' అన్నాడు రెండో ధనవంతుడు.

హసన్ హబ్బాల్ చాలా జాగ్రత్తగా అందుకున్నాడు డబ్బుని.

ఈ సంగతి భార్యకు కూడా చెప్పకూడదు అనుకొని జాగ్రత్తగా తీసుకెళ్లి యింట్లోని తవుడుకుండలో దాచిపెట్టాడు.

ఆ రోజుల్లో గుర్రాలు ఉన్న వాళ్లు వీధుల్లో తిరుగుతూ తవుడు కొనుక్కుని వెళ్లేవాళ్లంట.

అలాంటి వాళ్లొచ్చి 'తవుడు కొంటాం. తవుడు కొంటాం' అని తిరుగుతూ ఉంటే హసన్ హబ్బాల్ భార్య వెళ్లి తవుడు కుండని వాళ్లకు అమ్మేసింది. తవుడుతో పాటు అందులోని డబ్బులూ పోయాయి.

మళ్లీ లబోదిబోమన్నాడు హసన్ హబ్బాల్.

రెండు నెలలు గడిచాయి.

మళ్లీ ధనవంతులిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకు వచ్చారు. ముప్పయి ఏళ్లుగా ఎలా ఉన్నాడో యిప్పుడూ అలాగే ఉన్నాడతడు.

కార్యసాధనను నమ్మి రెండుసార్లు పెట్టుబడి యిచ్చిన ధనవంతుడు నిరాశపడ్డాడు.

'నిరాశపడకు మిత్రమా. నువ్వు రెండుసార్లు కార్యసాధనను నమ్ముకొని పెట్టుబడి పెట్టావు. ఈసారి నేను అదృష్టాన్ని నమ్ముకొని పెట్టుబడి పెడ్తాను. చూద్దాం ఏమవుతుందో' అని కేవలం రెండంటే రెండే అణాలు హసన్ హబ్బాల్‌కు యిచ్చి 'హసన్ హబ్బాల్. దీనితో నార కొనుక్కొని నీ వ్యాపారాన్ని పెంచుకో' అని వెళ్లిపోయాడు అదృష్టాన్ని నమ్ముకున్న ధనవంతుడు.

రెండు అణాలకు ఏమొస్తుంది? ఏమీ రాదు.

హసన్ హబ్బాల్ వాటిని తీసుకెళ్లి యింట్లోని గూట్లో పారేశాడు.

హసన్ హబ్బాల్ ఉంటున్నది ఒక బెస్తవాళ్ల యిలాఖా. ఆ బెస్తవాళ్లలో ఒకడు కటిక దరిద్రుడు ఉన్నాడు. వాడు ఆ రోజు చేపల వేటకు వెళుతూ ఉంటే వల చిరిగిపోయి కనిపించింది. కుట్టుకుందామంటే సూది లేదు.

భార్యని పిలిచి 'పెళ్లామా పెళ్లామా. ఎవరినైనా వెళ్లి రెండు అణాలు అప్పు అడిగి రా. సూది కొనుక్కుని వల కుట్టుకుందాం. వాళ్లు అప్పు యిచ్చినందుకు మారుగా మనం వలలో మొదటగా పడిన చేపని వాళ్లకు యిచ్చేద్దాం' అన్నాడు.

బెస్తవాడి భార్య ఎందరెందరి దగ్గరకో వెళ్లి రెండు అణాలు అప్పు అడిగింది. ఎవ్వరూ యివ్వలేదు.

చివరకు హసన్ హబ్బాల్ దగ్గరకు వచ్చింది.

'అదిగో ఆ గూట్లో రెండు అణాలు పడివున్నాయి. అవి నాకు అక్కరలేదు. తీసుకెళ్లు' అని యిచ్చి పంపేశాడు హసన్ హబ్బాల్.

మరుసటి రోజు బెస్తవాడు వచ్చి ఒక పెద్ద చేపను హసన్ హబ్బాల్‌కు యిచ్చాడు.

'మీరు యిచ్చిన రెండు అణాలతో సూది కొనుక్కుని వల కుట్టుకున్నాను. మొదటగా ఈ చేప పడింది. యిచ్చిపోదామని వచ్చాను' అన్నాడు.

సరే అని తీసుకెళ్లి దానిని భార్యకు యిచ్చాడు హసన్ హబ్బాల్.

కోసి చూస్తే ఏముంది? లోపల మిలమిలమని మెరిసిపోతున్న రాయి. ఆ రాయి వెలుగుకి హసన్ హబ్బాల్ గుడిసె మొత్తం కాంతితో వెలిగిపోయింది.

'మనం యింట్లో దీపానికి గతిలేని దరిద్రులం. అందుకని దేవుడు ఈ వెలుగురాయి యిచ్చినట్టున్నాడు' అనుకొని రాత్రిపూట దీపానికి మారుగా ఆ రాయిని గంపకింద ఉంచడం మొదలు పెట్టింది హసన్ హబ్బాల్ భార్య.

కొన్నాళ్లకు ధనవంతుల యిలాఖాలోని ఒక ధనవంతుడు రాత్రి పూట మేడ మీద నిలబడి హబ్బాల్ గుడిసెలో నుంచి వస్తున్న కాంతిని గమనించాడు.

'యిదేమిటి? ఈ కాంతి చాలా వింతగా ఉంది' అనుకొని హబ్బాల్ యింటికి వచ్చి చూశాడు.

చూస్తే, యింట్లో అంతులేని విలువైన వజ్రం.

వెంటనే హసన్ హబ్బాల్ కుటుంబాన్ని కూర్చోబెట్టి 'అమ్మా. దీనికి విలువ కట్టేవాళ్లు ఎవరూ లేరు. మీరు ఎంత అడిగితే అంత యిస్తాను. నాకు యిచ్చెయ్యండి' అని బతిమిలాడాడు.

హసన్ హబ్బాల్ అప్పుడు తాను కోరినంత డబ్బు, బంగారం, వెండి అడిగాడు. అన్నీ యిచ్చాడు ధనవంతుడు.

అలా రెండు అణాల పెట్టుబడితో అదృష్టం కలిసొచ్చి హసన్ హబ్బాల్ ధనవంతుడయ్యాడు. ఆ తర్వాత వ్యాపారాన్ని పెంచుకొని ఎందరికో ఉద్యోగాలు యిచ్చాడు.



# నెత్తిమీద గట్టిగా మూడు మొట్లు

ఒకూర్లో ఒకడు ఒంటెల్ని అద్దెకు యిచ్చి బతుకుతూ కాస్త డబ్బు దస్కంతో బాగానే వుండేవాడు. ఒకసారి తుపాను వచ్చింది. ఆస్తులు పోయాయి. ఒంటెలన్నీ చనిపోయాయి. ఒకటి మిగిలింది. యింక అక్కడ వుండటానికి ముఖం చెల్లక ఆ ఒక్క ఒంటెతో యింకో ప్రాంతానికి పోయి బతుకుదామని బయలుదేరాడు.

దారిలో ఒక సాహెబ్ (దైవ ఆరాధకుడు) కనిపించి 'ఆగు నాయనా. ఆగు' అని ఆపాడు ఒంటెలవాణ్ణి.

'నీ ముఖాన ధనము, సంపదా అంతా రాసిపెట్టుంటే ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాడు.

'సాహెబ్. నేను బతికి చెడ్డ వాణ్ణి. యింకా నా ముఖాన ధనము, సంపదా ఎక్కడివి?' అన్నాడు ఒంటెలవాడు.

'కాదు. నీకు తెలియదు నాతో రా' అని చెప్పి, ఆ సాహెబ్ ఆ ఒంటెలవాణ్ణి ఒక కొండ మీది గుహకు తీసుకెళ్లాడు.

'చూడు. యిక్కడ పెద్ద నిధి వుంది. నీకు దారి చూపిస్తాను. వెళ్లి తీసుకురా. చెరి సగం పంచుకుందాం' అన్నాడు సాహెబ్.

సరేనని గుహలోకి వెళ్ళాడు ఒంటెలవాడు. చూస్తే ఏముంది వజ్రాలు, వైఢూర్యాలు, మణులు, మాణిక్యాలు, కళ్ల చాలనంత బంగారం.

మూట కట్టుకోగలిగినంత మూటగట్టుకొని, ఒంటె మీద వేసుకొని బయటికి వచ్చాడు ఒంటెలవాడు. ఇద్దరూ కలిసి ఇక కొండ దిగుతున్నారు.

సగం దూరం వచ్చాక ఒంటెల వాడి మనసు మారింది.

'సాహెబ్. ఈ నిధిలో సగం మీకెందుకు? మీకు యిల్లా వాకిలా పెళ్లాం బిడ్డలా? పావు చాలదా?' అని అడిగాడు.

'అలాగేలే' అన్నాడు సాహెబ్.

యింకాస్త దూరం వచ్చాక మళ్లా మనసు మారింది ఒంటెలవాడికి.

'సాహెబ్. మీరు అల్లా వలీ అంటూ తిరిగే దేవుని మనుషులు. మీకు డబ్బు దస్కం మీద ఏమి మమకారం వుంటుంది. పావు ఎందుకు? మూడు దోసిళ్ల చాలవా?' అన్నాడు.

[illegible] చెప్పితే అలాగేలే' అన్నాడు సాహెబ్.

[illegible] కిందకు దిగాక యింకా మనసు మారిపోయింది ఒంటెలవాడికి.

'సాహెబ్ మీకు మూడు దోసిళ్లు కూడా ఎందుకు? మీరు ఈ లోకంలో ఖాళీ చేతుల్తో వచ్చారు. ఖాళీ చేతుల్తో పోతే సరిపోదా?' అన్నాడు.

సాహెబ్‌కి ఆ ఒంటెలవాడి మీద జాలి కలిగింది.

'నాయనా. నీకు డబ్బాశ చాలా ఉన్నట్టుంది. అలాగైతే నీకు ఈ చిన్నాచితకా నిధులు చాలవు. యింకో ఉపాయం చెప్తాను. ముందు ఈ నిధిని ఎక్కడి నుంచి తెచ్చావో అక్కడ పెట్టిరా' అని చెప్పాడు.

ఒంటెలవాడు హుషారుగా వెళ్లి నిధిని వాపసు పోసి వచ్చాడు.

అప్పుడు సాహెబ్ వింత ద్రవమున్న ఒక చిన్న సీసాను సృష్టించి 'ఈ ద్రవాన్ని కుడి కంట్లో పూసుకో. నీకు నేలలో ఎక్కడెక్కడ నిధులున్నాయో కనబడతాయి. వాటిని తవ్వి తీసుకుని హాయిగా బతుకు. అయితే ఒక్క విషయం. దీనిని పొరపాటున కూడా ఎడమ కంట్లో పూసుకోవాక. రెండు కళ్లూ పోతాయి' అని చెప్పి, వెళ్లిపోయాడు.

ఒంటెలవాడు ద్రవాన్ని తీసి కుడి కంట్లో పూసుకున్నాడు. వెంటనే వాడికి భూమిలో ఎక్కడెక్కడ నిధులున్నాయో, ఎక్కడెక్కడ లంకె బిందెలున్నాయో కళ్లకు అవుపించడం మొదలయ్యింది.


'అరె. ఒక్క కంట్లో పూసుకుంటేనే యిన్ని నిధులు కనిపిస్తున్నాయే రెండో కంట్లో కూడా పూసుకుంటే యింకెన్ని నిధులు కనిపిస్తాయో కదా' అని చెప్పి రెండో కంట్లో కూడా పూసుకున్నాడు. అంతే. దెబ్బకు రెండు కళ్లూ పోయాయి.

ఉన్న ఒక్క ఒంటె పోయి, కొండలో నుంచి తెచ్చిన నిధీ పోయి, భూమిలో దాగిన నిధులన్నీ పోయి, ఆఖరికి రెండు కళ్లూ పోయి బిచ్చగాడయ్యాడు ఒంటెలవాడు.

అప్పట్నించి వాడు సముద్రం ఒడ్డున అడుక్కుంటూ తిరిగేవాడు.

అయితే అట్లా అడుక్కుని తినడంలో వాడిదొక పద్ధతి వుండేది. ఎవడైనా ఏదైనా దానం చేస్తే తీసుకునేవాడు కాదు. తన చేతిలోని కర్రని ఇచ్చి 'ఈ కర్రతో నా నెత్తి మీద గట్టిగా మూడు మొట్టండి. అప్పుడు మీ దానం తీసుకుంటాను' అని అనేవాడు. మూడు మొట్టేదాకా వదిలేవాడు కాదు.

జీవితంలో మళ్లీ ఆశబోతుతనానికి వెళ్లకుండా యిలా మూడు మొట్టించుకుంటూ అదే శిక్షగా బతికాడు ఆ ఒంటెలవాడు.



# పరేస్తాన్ క పరా

గంధర్వరాజు

ఒక సుల్తాన్‌కు ఒక కుమార్తె పుట్టింది. ఆ కుమార్తెకి మాటలు వచ్చాక సుల్తాన్‌తో 'అబ్బాజాన్. మీరు ఎప్పుడు బయటకు వెళ్లినా మూడు మజిలీలే చేయండి. నాలుగోది చేయకండి' అని చెప్పింది. ఆ మాటలు విని రాజు ఆశ్చర్యపోయాడు. ఎందుకైనా మంచిదని 'అలాగే' అన్నాడు.

అప్పటి నుంచి ఎక్కడకు ప్రయాణం చేసినా ఆ సుల్తాన్ మూడు మజిలీలే చేసి, అంటే మూడు తావుల్లో మాత్రమే విడిది చేసి వెనక్కి వచ్చేసేవాడు.

ఒకసారి యిలాగే కూతుర్నీ భార్యనూ తీసుకొని మందీమార్బలంతో షికారుకు వెళ్లి మూడుచోట్ల మూడు మజిలీలు చేశాడు సుల్తాన్. అప్పుడాయనకు కూతురి మాటలు గుర్తొచ్చాయి. ఎప్పుడు చూసినా నా కూతురు మూడు మజిలీలే చేయమని చెబుతోంది నాలుగోది చేస్తే ఏమవుతుందిలే అనుకొని నాలుగో చోటుకు వెళ్లి అక్కడ కూడా విడిది చేశాడు సుల్తాన్.


ఈయన ఈ పని చేస్తున్నప్పుడు రాకుమార్తె మంచి నిద్రలో వుంది.

ఆమెకు మెలకువ వచ్చాక గుడారం నుంచి బయటకు వచ్చి చూసింది. చూస్తే దూరంగా చల్లటి సెలయేరు, పచ్చటి గరిక, అందమైన పిట్టలూ కనిపించాయి. వాటి మీద యిష్టం కలిగి అక్కడకు వెళ్లి కాసేపు గరికతో ఆడుకుందామె. అట్లా ఆడుకుంటూ వుండగా భూమిలో చిన్న రంధ్రం కనిపించింది. ఈ రంధ్రం ఏమిటి అని అందులో వేలు పెట్టింది. అంతే.

ఎప్పుడైతే రాకుమార్తె వేలు భూమి లోపలికి వెళ్లిందో ఆ క్షణానే సెలయేరూ, గరికా, పిట్టలూ అన్నీ మాయమైపోయాయి. తళతళమనే ఎండ పరిగెత్తుకుంటూ వచ్చి ఆకాశాన నిలబడింది. పైనున్న ఎండకు, వేలు ఊడి రానందుకు రాకుమార్తె అల్లాడిపోతా వుంది. ఈ సంగతి తెలిసి సుల్తాను, సుల్తాను గారి భార్య, భటులూ గిటులూ అందరూ పరిగెత్తుకుంటూ వచ్చారు. ఎవరు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా రంధ్రంలో ఇరుక్కున్న రాకుమార్తె వేలు మాత్రం బయటకు రావడం లేదు

అందరూ ఏడుస్తూ వుంటే అప్పుడు ఆకాశాన ఒక పలుకు వినబడింది.

'ఓ రాజా... నీ కుమార్తె వేలును ఫలానా పరేస్తాన్ (గంధర్వలోకం)కు చెందిన ఫలానా పరా (గంధర్వుడు) పట్టుకుని వున్నాడు. నీ కూతుర్ని వాడికిచ్చి పెళ్లి చేస్తానని నువ్వు మాట యిస్తేనే వేలు బయటకు వస్తుంది' అని, ఆ పలుకు మాయమైంది.



సుల్తాన్‌కు చెమటలు పోశాయి. పెళ్లి సంగతి తర్వాత ముందు కూతురు ప్రాణాలు ముఖ్యం అని తలచి, అలాగే పెళ్లి చేస్తాను అని మాట యిచ్చాడు. వెంటనే వేలు విడిపడింది.

గబగబా అక్కడ బిచానా ఎత్తేసి రాజ్యానికి వచ్చి చూస్తే ఏముంది ఒక యింత పొడుగు గడ్డం వున్న ముసలాయన, ఒక యింత పొడుగు కత్తిని చేతబట్టుకొని బయట కూర్చుని వున్నాడు.

సుల్తాన్‌ని, ఆయన కూతురినీ చూసిన వెంటనే లేచి నిలబడి 'రాజా, నా కుమారుడికి నీ కుమార్తెను యిచ్చి పెళ్లి చేస్తానని మాట యిచ్చావు గదా. యిదిగో ఈ కత్తితో నిఖా జరిపించి నాకు నీ కూతుర్ని అప్పగించు. నేను తీసుకెళ్లి నా కుమారుడికి అప్పగిస్తాను' అన్నాడు.

సుల్తాను, సుల్తానుగారి భార్య ఏడుపు మొదలెట్టారు. 'అయ్యా. నా కుమార్తె పసిది. తల్లిదండ్రుల చాటు బిడ్డ. అప్పుడే పెళ్లేమిటి? మా అచ్చటా ముచ్చటా తీరకుండానే మీతో ఎలా పంపేది?' అని బతిమిలాడారు.

'తప్పదు. వెంటనే ఈ కార్యం మీరు నెరవేర్చకపోతే మీ రాజ్యం సర్వనాశనం అవుతుంది' అన్నాడు ముసలాయన. యింక వేరే మార్గం లేక

సరే అన్నారు సుల్తాను, రాణి.

వెంటనే మాయామాయగా ఒక కాగితం ప్రత్యక్షం అయింది. దాని మీద సాక్షి సంతకాలు జరిపించి నిఖా చేసేశారు.

ఆ తర్వాత ఒక పడవ ప్రత్యక్షమయింది. 'ఈ పడవలో మీ అమ్మాయిని కూర్చోబెట్టి సముద్రంలో వదలండి. మా పరేస్తాన్‌కు చేరుకుంటుంది' అన్నాడు ముసలాయన.

'తండ్రీ. మేము మా అమ్మాయికి ఎన్నో కట్నకానుకలు, జవహరీలు యిద్దామనుకున్నాం. వాటిని ఏం చేయాలి?' అని అడిగారు సుల్తాను, రాణి.

'వాటిని సముద్రంలో వెయ్యండి. మా దేశానికి చేరుకుంటాయి' అని వెళ్లిపోయాడు ముసలాయన.

అన్న మాట ప్రకారమే కట్నాలు, కానుకలు, జవహరీలు యింకా ఏమిటేమిటో అన్నీ సముద్రంలో వేశారు సుల్తాను, రాణి.

యింక రాకుమార్తెను పంపాలి.

ఆమెను ఒక్కదాన్నే నావలో కూర్చోబెట్టి పంపడానికి ధైర్యం చాలక ఆమె బాగోగులు చూడమని ఒక బాందీదాన్ని (బానిస స్త్రీ)ను కూడా కూర్చోబెట్టి సముద్రంలో వదిలారు. నావలో వాళ్లిద్దరికీ నిద్ర పట్టేసింది.

మెలకువ వచ్చి చూసేసరికి వాళ్లొక పెద్ద కోటలో వున్నారు. మనుషుల అలికిడి లేదు

'బాందీదానా. ఏమి ఈ మాయ. మనం ఎక్కడున్నాం?' అని అడిగింది రాకుమార్తె.

'ఉండండమ్మా. నేను చూసేసొస్తాను' అని బయలుదేరింది బాందీ.

బయటికి వచ్చాక ఆమెకు ఏడు గదులు కనిపించాయి. ఏడు గదులూ ఒక్కలాగే వున్నాయి. ఆమె ఒక్కో గదినీ ఒక్కోగదినీ చూసుకుంటా వస్తా వుంది. చూసేకొద్దీ వజ్రాలూ, వైఢూర్యాలూ ఆమె కళ్లను మెరిపిస్తున్నాయి. ఒక గదిలో బంగారు సింహాసనం కనిపించింది. యింకో గదిలో ముత్యాల రాశి పోసి వుంది. ఒక గదిలో దేవలోకపు పూలు వున్నాయి. మరో గదిలో మైమరిపించే అత్తర్లు గుబాళిస్తున్నాయి.

ఒక్కోగదిని చూసేకొద్దీ బాందీదాని మనసులో రంగులు మారుతున్నాయి. అలా చూసుకుంటూ చూసుకుంటూ ఐదో గదికి వచ్చిందామె. ఆ గది ఖాళీగా వుంది. లోపల రెండు చిన్నచిన్న సీసాలు వున్నాయి. ఒకదానిలో ఎర్ర రంగు ద్రావణం వుంది. ఒక దానిలో పచ్చరంగు ద్రావణం వుంది. వాటిని అలాగే వుంచి ఏడో గదికి వచ్చింది బాందీ.

అక్కడ నిఖా జరిపించుకొచ్చిన ముసలాయన కూర్చుని వున్నాడు.

ఆయన బాందీదాన్ని చూసి 'యిక్కడ ఏం చేస్తున్నావ్? వెళ్లు వెళ్లి రాకుమార్తెను సింగారించు. రాత్రికి మా అబ్బాయి వస్తాడు' అని అరిచాడు.

బాందీ హడలిపోయింది.

'మన్నించండి ప్రభు. మాకు మీ దేశం కొత్త. అందుకని అన్నీ తిరిగి చూస్తున్నాను. ఒక్కమాట. యిక్కడున్న ఐదవ గదిలో రెండు సీసాలు కనిపించాయి. అవేమిటో మాకు తెలియదు. మా రాకుమార్తె వాటిని పొరపాటున వాడకుండా అవేమిటో సెలవివ్వండి' అంది బాందీ.

'అవి మహిమ సీసాలు. ఎర్రదాన్ని వాడితే స్పృహ పోతుంది. పచ్చదాన్ని వాడితే స్పృహ వస్తుంది' అన్నాడు ముసలాయన.

ఆ ముక్క వినగానే దొరికింది దారి అనుకుంది బాందీ.

గబగబా రాకుమార్తె దగ్గరకు వెళ్లి 'అమ్మా ఇది ఏం దేశమో, ఏం లోకమో, పలకరించడానికి ఒక్క పిట్ట కూడా దొరకలేదు. పదండి. రాత్రవుతూ వుంది. నాలుగు మెతుకులు తిని నిద్రపోదాం' అని తొందర చేసింది.

రాకుమార్తెకు తెలియకుండా ఎర్రరంగు ద్రావణం కలిపిన అన్నాన్ని ఆమెకు పెట్టి, తను మామూలు అన్నం తినింది. ఇంకేముంది? రాకుమార్తె స్పృహతప్పి పడిపోయింది. బాందీ ఏమో రాకుమార్తె అవతారం దాల్చింది.

మంచి అర్ధరాత్రి వేళ, రెక్కలు టపటపలాడే పల్లకీలో ఛమ్ ఛమ్ ఛమ్ అని శబ్దం చేస్తూ పై నుంచి కిందకి 'పరేస్తాన్ క పరా' దిగాడు. అతడు యింత అందగాడంట, యింత అందగాడంట చూడ్డానికే కళ్లు చాలనంత అందగాడంట.

అతణ్ణి చూడగానే బాందీ మనసు యింకా మారిపోయింది. ఈ అందగాణ్ణి ఎలాగైనా సొంతం చేసుకోవాలి అనుకుంది.

పరేస్తాన్‌కి పరా బాందీదాన్ని నఖశిఖం చూసి, ఆవిడదే పెద్ద అందం అని మురిసిపోయి 'నువ్వేనన్నమాట నా రాకుమారివి' అని తెల్లవార్లు కోడి కూసే సమయానికి వెళ్లిపోయాడు.

అతణ్ణి అలా వెళ్లనిచ్చి, రాకుమార్తె వేషం తీసేసి మళ్లీ మామూలుగైపోయింది బాందీ. పచ్చరంగు ద్రావణం చల్లి రాకుమార్తెను లేపి కూర్చోబెట్టింది.

రోజులు యిలాగే గడుస్తున్నాయి. పగటిపూట రాకుమార్తె రాకుమార్తెగా వుంటోంది. రాత్రయితే బాందీలా పడి నిద్రపోతోంది. బాందీ పగటిపూట బాందీలాగే వుంటోంది. రాత్రయితే రాకుమార్తెలాగా అవతారం ఎత్తుతోంది.

ఒకరోజు ఉన్నట్టుండి పట్టపగలు 'పరేస్తాన్ క పరా'కు చెందిన ఏడుగురు అక్కచెల్లెళ్లు ఊడిపడ్డారు. తమ్ముడి భార్యను చూసి పోదామని వాళ్లందరూ తీపితో, మిఠాయితో బిలబిలమని దిగిపోయేసరికి బాందీ కంగారుపడి పక్కకు తప్పుకుంది.

ఏడుగురు అక్కచెల్లెళ్లూ తమ తమ్ముడి భార్యను కళ్లారా చూసుకుని, మెటికలు విరిచి, 'నీ అందం ముందు మా గంధర్వకన్యల అందం ఎంతమ్మా' అని మురిసిపోయి, 'యిదిగో ఈ తీపి తిను' అని రాకుమార్తెకు తినిపించబోయారు.

'నాకు వద్దు' అంది రాకుమార్తె మొహమాటంగా.

'ఏమమ్మా. మా తమ్ముడు తెచ్చినవైతే తింటావా. మేము తెచ్చినవి తినవా?' అన్నారు వాళ్లు పరాచికంగా.

రాకుమార్తె ఆశ్చర్యపోయింది. 'మీ తమ్ముడుగారు రావడం ఏంటి? నాకు పెట్టడం ఏంటి?' అంది విస్తుపోతూ.

ఏడుగురు అక్కచెల్లెళ్లకు అనుమానం వచ్చేసింది. యిక్కడేదో మతలబు వుంది అనుకొని అంజనం వేసి చూస్తే బాందీ కనిపించింది.

'అయ్యో బంగారుతల్లీ... నీతోపాటు వున్న నీ బాందీ నీ మీద నీచానికి ఒడిగట్టి నీ స్థానాన కూర్చుని మా తమ్ముడితో కులుకుతోంది. ఈ విషయంలో మేము నీకేమీ సాయం చేయలేము. అసలు మాకు నిన్ను చూడటానికే యిజాజత్ (అనుమతి) లేదు. దొంగతనంగా వచ్చాము. ఈ విషయంలో జోక్యం చేసుకుంటే మా తలకాయలు లేచిపోతాయి. నిన్ను నువ్వే కాపాడుకొని నీ స్థానం పొందమ్మా' అని నాలుగు ఏడ్పులు ఏడ్చి వెళ్లిపోయారు.

ఓహో యిదా సంగతి అనుకున్న రాకుమార్తె ఆరోజు రాత్రి అన్నం తిన్నట్టుగా నటించి, నిద్రపోయినట్టుగా పడుకుంది. ఆమె నిజంగానే పడుకుందనుకున్న బాందీ గబగబా సింగారించుకుని కూర్చుంది.

కాసేపటికి ఛమ్ ఛమ్ ఛమ్ అంటూ 'పరేస్తాన్ క పరా' వచ్చాడు. బాందీ దానితో నవ్వుకుంటూ కబుర్లకు దిగాడు. అప్పుడు రాకుమార్తె నెమ్మదిగా లేచి వెళ్లి చూసింది. ఆమె గుండెలు కాలిపోయాయి. పిచ్చి కోపం వచ్చింది.

'జహాపనా. బాందీదానికి చెవులు తెగ్గోసే రోజులు దగ్గర పడ్డాయి' అని అరిచింది.

ఆ మాటలు 'పరా'కు వినిపించలేదు. బాందీకి వినిపించాయి. ఓయమ్మో దీనికి రహస్యం తెలిసిపోయింది అనుకొని గబాల్న మంచం మీదకు దొర్లి అడ్డంగా పడుకుంది.

'పరా' కంగారుపడ్డాడు. 'ఏమైంది ఏమైంది' అని అడిగాడు.

'చూశారా నా బాందీదాని మాటలు. నాకు తోడు వుంటుంది గదా అని మా అమ్మా నాన్న పంపితే నేను మీ అంత అందగాడికి భార్య అయ్యాననే కుళ్లుతో 'రాకుమార్తె ముండకు చెవులు తెగ్గోసే రోజులొచ్చాయి' అని అరుస్తోంది. యిక్కడ నేను ఒక్క క్షణం కూడా వుండలేను. పదండి వెళ్లిపోదాం' అంది.

'పరా'కు కోపం వచ్చింది. బాందీదానికి అంత అహంకారమా అని క్షణాల్లో కోటని గీటని మాయం చేసేసి, పల్లకీలో బాందీని కూర్చోబెట్టుకుని ఆకాశమార్గాన బయలుదేరబోయాడు. యింక రాకుమార్తె ఏకాకి గదా. అందుకని ఆమె గబగబా పల్లకీ వెనుకే పరిగెత్తుకుంటూ వెళ్లి అది పైకి ఎగురుతుండగా దాని కాలు పట్టుకుంది.

పల్లకి ఎగిరి ఎగిరి చాలా దూరం ప్రయాణించింది. ప్రయాణించాక 'పరేస్తాన్'కు సమీపించింది. యింక అంతఃపురం వస్తుంది అనగా ఎత్తు తగ్గేసరికి దానికి వేలాడుతున్న రాకుమార్తె గంధం చెట్టుకు తగులుకుని కింద పడిపోయింది.

ఆమె పడినచోట ఒక ముసలామె యిల్లు వుంది. ఆ ముసలామె అంతఃపురంలో పూలు కట్టే ముసలామె.

రాకుమార్తెను చూసి 'ఎవరమ్మా నువ్వు?' అని అడిగింది.

'అవ్వా. నేను ఎవరూ లేని యతీమ్ (అనాధ)ని. నీ దగ్గర నాలుగు నాళ్లు వుంచుకో' అంది రాకుమార్తె. సరే అని ఉంచుకుంది ముసలామె.

సరే రోజులు అట్లట్ల గడుస్తున్నాయి. ముసలామె ఏమో అంతఃపురానికి వెళ్లి బాందీదానికి పూలు యిచ్చి వస్తా వుంది.

ఒకరోజు రాకుమార్తె 'అవా అవా. ఈరోజు నేను పూలు కడతాను. తీసుకెళ్లి మీ మహారాణికి యివ్వు' అంది.

సరే అని రాకుమార్తె అల్లిన పూలని తీసుకెళ్లి బాందీదానికి యిచ్చింది ముసలామె. బాందీకి ఆ పూలు ఎంతో నచ్చాయి.

'ఇవి ఎవరు కట్టారు?' అని అడిగింది.

'దూరదేశం నుంచి నా మనవరాలు వచ్చిందమ్మా. అది కట్టింది' అంది ముసలామె.

'రేపు నీ మనవరాలిని మహలుకు పంపు. నేను జడ కుట్టించుకోవాలి' అంది బాందీ.

వచ్చి ఈ సంగతి చెప్పింది ముసలామె. ఆ అదనుకోసమే ఎదురుచూస్తున్న రాకుమార్తె 'పరేస్తాన్ క పరా' పేరున ఒక ఉత్తరం రాసింది - ఏమని?

'ఓరి అధముడా! నువ్వు 'పరేస్తాన్ క పరా'వి ఎలా అవుతావు? రాకుమార్తె ఎవరో, బానిస స్త్రీ ఎవరో కూడా పోల్చుకోలేని నువ్వు ఒక రాజువేనా? నీకు ఇంగితజ్ఞానం అనేది వుందా? ఏ బానిస స్త్రీ అయినా 'రాకుమార్తె ముండకు చెవులు తెగ్గోసే రోజులు వచ్చాయి' అని చెప్పే సాహసం చేస్తుందా? నేను రాకుమార్తెను. నీ దగ్గర వున్నది నా బాందీ. నన్ను మోసం చేసి నీకు భార్యగా వేషం కట్టింది. అది చూసి కోపంతో నేను 'బాందీదానికి చెవులు తెగ్గోసే రోజులు దగ్గర పడ్డాయి' అని అరిస్తే ఆ ముక్క వినిపించుకోకుండా బాందీదాని మాటలు నమ్మి నన్ను నానా బాధలు పెట్టావు. మగాళ్లలో యింత తెలివితక్కువ వాళ్లు వుంటే వాళ్లను మగాళ్లు అని పిలవాల్సిన పనిలేదు. నువ్వు మగాడివి కావు' అని రాసింది.

మరుసటి రోజు పాత గుడ్డలు వొంటికి చుట్టుకుని, ముఖానికి మసి పూసుకుని, కాస్త కుంటి నడక నడుచుకుంటూ మారువేషంతో మహలుకు పోయింది. అక్కడ బాందీకి జడకుట్టి అందులో ఉత్తరం దాచి ఏమీ ఎరగనట్టుగా ఇంటికి వచ్చేసింది.

ఆ రాత్రి అత్తరుగిత్తరు పూసుకుని ఎప్పటిలాగే బాందీ దగ్గరకు వచ్చాడు పరా. వచ్చి, దగ్గరకు తీసుకుని జడలో వున్న ఉత్తరాన్ని చూశాడు. చప్పుడుకాకుండా దానిని చదువుకున్నాడు.

చదువుకున్న వెంటనే బాందీతో 'యిప్పుడే వస్తానుండు',అనేసి నేరుగా ముసలామె యింటికి వచ్చాడు.

అతడు వచ్చేటప్పటికి, అతడు వస్తాడని ముందే ఊహించిన రాకుమార్తె స్నానం గీనం చేసి, చీరాగీరా కట్టుకుని పూలూగీలూ పెట్టుకొని నిలుచుని వుంది.

ఆమె సౌందర్యానికి మతిపోయింది 'పరా'కు. ఇంత అందగత్తె భార్యను వుంచుకొని, ఇన్నాళ్లు బుద్ధితక్కువై వికారపు బానిస స్త్రీతో కాపురం చేశానే అని కుంగిపోయాడు.

'రాణీ. తప్పయిపోయింది. క్షమించు' అని కాళ్లావేళ్లా పడ్డాడు.

రాకుమార్తె క్షమించలేదు. ఎన్ని మాటలు అనాలో అన్ని మాటలు అని వెనక్కి పంపించేసింది.

దీనికంతటికీ కారణమైన బందీదాని మీద 'పరా'కు చెప్పలేనంత కోపం వచ్చింది. పిడికత్తి చేతబట్టి నేరుగా మహలుకు వెళ్లి, తియ్యటి మాటలు వల్లిస్తూ బాందీదాని రెండు చెవులూ కోసేశాడు. ఆ తర్వాత ఆమెను సున్నపు బట్టిలో పాతరేశాడు.

ఇది తెలిసిన రాకుమార్తె హాయిగా ఆమె అమ్మానాన్న దగ్గరకు చేరుకుంది. ఆ తర్వాత 'పరా' వచ్చి ఆమెను కాపురానికి తీసుకెళ్లాడో లేదో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొందరు తీసుకెళ్లాడని అంటారు. కొందరు తీసుకెళ్ల లేదని అంటారు.



# తెలివి కతలు

ఒకాయన చాలా పెద్ద తెలివిగలవాడినని అనుకునేవాడు. అంతటితో ఊరుకుంటే బాగుణ్ణు. కాని నా భార్య కూడా నా అంత తెలివైనదిగా ఉండాలి లేకుంటే వద్దు అని ఎవరు పెళ్లి చేసుకుంటామని వచ్చినా ఒక షరతు పెట్టేవాడు.

అదేమిటిరా అంటే వండటానికి బియ్యం, పప్పు, ఉప్పు అన్నీ యిచ్చేవాడుగానీ పొయ్యిలోకి కట్టెలకు బదులు చెరుకుగడలు యిచ్చేవాడు. చెరుకు గడలను మండించి వంట చేసిన వారినే పెళ్లి చేసుకుంటా అనేవాడు.

ఈ పోటీకి ఎంత మంది వచ్చినా చెరుకుగడలను ఎలా మండించాలో తెలియక ఓడిపోయేవాళ్లు.

సరిగ్గా అప్పుడే ఒకామె వచ్చింది. 'నువ్వు చెప్పినట్టుగా నేను వండుతాను. కానీ నేను చెప్పినట్టుగా నువ్వు తినాలి. సరేనా' అంది.

'సరే' అన్నాడు తెలివిమీరినవాడు.

అప్పుడామె ఆ దగ్గరలోనే ఆడుకుంటున్న చిన్నపిల్లలను పిలిచి 'ఒరే. ఈ చెరుకు గడలని కసాబిసా నమిలి యిక్కడ ఊయండిరా' అంది. పిల్లలు కొరికేందే సంబరమని సరసరమని గడల్ని నమిలి పిప్పి ఊశారు. దాన్ని ఆమె కాసేపు ఎండబెట్టి నిప్పు రాజేసింది. ఆ మంటలోనే వంట వండ పెట్టింది. అది చూసి నోరెళ్లబెట్టాడు తెలివిమీరినవాడు.

'నువ్వు చెప్పినట్టుగా నేను వండాను. యిప్పుడు నేను చెప్పినట్టుగా నువ్వు తినాలి. ఎలగరా అంటే నువ్వు తినేటప్పుడు నీ దవడ ఆడకూడదు. ఆడించా ఖబడ్దార్' అందామె.

దవడ కదిలించకుండా ఎవరు తినగలరు? ఏం తినాలన్నా తాగాలన్నా దవడ ఆడించాలి గదా. అమ్మా బీబీ క్షమించు అని కాళ్ల మీద పడ్డాడు తెలివిమీరిన వాడు.

అది ఒక కత.

ఇంకో కతలో యింకొకడు కూడా యిలాగే 'నేను తెలివైన వాణ్ణి. తెలివైన వాణ్ణి' అని తిరుగుతా ఉండేవాడు.

వాడు పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. పెళ్లి కూడా యించుమించుగా ఖాయమైపోయింది. అయితే యింతలో వాడు 'పెళ్లికూతురు నా అంత తెలివైనదేనా?' అని మాట జారాడు. ఈ సంగతి పెళ్లికూతురికి తెలిసిపోయింది. ఆయన అంతమాట అన్నాక నా తెలివి కూడా చూపించక తప్పదు అనుకొని, వాణ్ణి పిలిచి 'ఒరే. అడవికి వెళ్లి కోస్తే రక్తం రాని మాంసం తీసుకురారా. అప్పుడే నిన్ను పెళ్లి చేసుకుంటా' అంది.

కోస్తే రక్తం రాని మాంసం ఏంది? కుందేల్ని కోసినా, పొట్టేల్ని కోసినా, జింకని కోసినా, ఆఖరికి కోడిని కోసినా రక్తం వస్తుందే. రక్తం రాని మాంసం ఏందబ్బా అని వాడు తలకాయ బద్దలు కొట్టుకున్నాడు. ఆఖరుకు చేతులెత్తేసి 'అదేమిటో చెప్పు బీబీ' అని కాళ్ల మీద పడ్డాడు.

'ఆ మాత్రం తెలియదా. పుట్టగొడుగులు' అని జవాబు చెప్పింది పెళ్లికూతురు.

'పుట్టగొడుగులది మాంసం రుచి. కానీ వాటిని కోస్తే రక్తం రాదుగా' అని వివరించింది.

'ఈ మాత్రం తెలియనివాడిని పెద్ద పుండింగిలాగా నన్ను చేసుకోవడానికి బయల్దేరావు. వెళ్లు వెళ్లు' అని వాడిని చేసుకోకుండానే పంపించేసింది.



# ముందు పనసకాయ యిలా లేదు

యింతకు మునుపు కాలంలో పనసకాయ యిలా వుండేదిగాదంట. వొళ్లు గరగరమని అనేది కాదంట. లోపల పీచు పీచు వుండేది గాదంట. యిట్లా వొలిస్తే అట్లా సులభంగా తొనలు బయటపడేవంట.

అయితే కాలం ఎల్లకాలం ఒకేలాగా ఉండదు కావున ఒకసారి పనసచెట్టుకి ఒళ్లు కొవ్వెక్కింది. కొవ్వెక్కి పక్కనే ఉన్న అనాస చెట్టుతో 'ఒసే అనాసా? పండ్లల్లో రాజెవరే?' అని అడిగింది.

'యింకెవరకా? మన మామిడిపండు గదా' అంది అనాస.

'చచ్చ. నోర్మూయ్. నేనెక్కడ? ఆ మామిడి చెట్టు ఎక్కడ? దాని పండు యింత బుల్లిది. నా పండేమో యింత పెద్దది. లోకంలో నన్ను మించినంత పండు యింకెక్కడుంది? అందుకని నేనే గదా రాజుని' అంది పనస.

'అట్లెట్ల రాజువవుతావకా? మామిడిపండు రుచి నీకెక్కడిది? నీది నాలిక మీద రుచే. నాలుక దాటితే అంగిటలో నీ రుచి నిలవదు. మామిడిపండు కత అలా కాదు. నోరు నాలుకా గొంతూ చిగుళ్లూ అన్నీ దాని రుచిలో తడిసిపోతాయి. అమృతంగదా అది' అంది అనాస.

ఆ మాటలకి పనసచెట్టుకి కోపం వచ్చేసింది. 'వేలెడంత లేవు. నన్ను అనేంత మొనగత్తెవి అయ్యావా' అని కాలెత్తి అనాస చెట్టుని తొక్కడం మొదలుపెట్టింది.

అనాస చెట్టుకి ఒకే పండు. అది ఒకే చెట్టు. దానిది ఒకే బిడ్డ. అందుకుని అది లబలబలాడిపోయింది. 'ఓయమ్మో. ఓరినాయనో. పనస చెట్టు నా బిడ్డని చంపేస్తా ఉంది. అల్లా రక్షించు. మౌలా రక్షించు' అని ఏడ్చింది.

అప్పటివరకూ అనాస పండుకి ముళ్లతురాయి లేదు. దాని ఏడుపుకీ, ప్రార్థనలకీ దైవికంగా ముళ్లతురాయి మొలుచుకొచ్చి పనసచెట్టు కాల్లో గుచ్చుకుంది. అబ్బా అని దూరం జరిగింది పనసచెట్టు. ఇదే సందని అడివంతా తిరిగి అన్ని పండ్ల చెట్లనీ పోగేసింది అనాస చెట్టు. చెట్లన్నీ కొలువుదీరాయి. పండ్లకు రాజైన మామిడిచెట్టు వచ్చింది. మంత్రయిన కమలా చెట్టు వచ్చింది.

'ఏమిటి సంగతి?' అని అడిగింది మామిడిచెట్టు.

'జహాపనా. పనసచెట్టుకి వొళ్లు కొవ్వెక్కింది. పండ్లన్నింటిలో పెద్దదిగా వుండటం వల్ల అదే రాజని విర్రవీగతా ఉంది. కాదు, మా పాదుషా మీరే అని నేను అన్నందుకు నా బిడ్డను చంపడానికి వచ్చింది' అని చెప్పింది అనాస చెట్టు.

'నేనేం తప్పు మాట్లాడలేదు. నా పండు పెద్దది. అందువల్ల నేనే రాజుని' అంది పనస చెట్టు.

'అవును. పనస చెప్పిన మాట కరెక్టే. నా ఓటు పనసకే' అంది నారింజ చెట్టు. ఎలక్షన్లు జరిగాయి.

ఒక్క నారింజ తప్ప తక్కిన చెట్లన్నీ 'మా రాజు మామిడి. మా మంత్రి కమలా' అని వీటి పక్షాన ఓటేశాయి. వేసి, 'జహాపనా. మీ మీద తిరుగుబాటు చేసినందుకు పనసచెట్టుకి శిక్ష విధించండి' అన్నాయి మామిడి చెట్టుతో.

అప్పుడు మామిడి చెట్టు - 'సరే. ఏ కాయనైతే చూసుకొని అది మిడిసి పడిందో యివాళ్టి నుంచి ఆ కాయకు ఒళ్లంతా గరగరమని ముళ్లు



మొలుస్తాయి. లోపల పీచు మొలచి తొనల్ని అల్లుకుంటుంది. మన పండ్లని తిన్నంత సులువుగా అక్షులు పక్షులు దీని పండుని తినలేనంత కఠినంగా యిది తయారవుతుంది. జంతువులు దీన్ని ముట్టవు. మనుషులు దీనిని కత్తులతో పొడిచి పొడిచి లోపలంతా చీరి చీరి హింసించి హింసించి దీని తొనలను బయటకు తీస్తారు. ఆ హింస యిది పడాల్సిందే. అంతేకాదు. బయటపారేసిన దీని తొక్కల మీద పందులు పొర్లాడుతాయి. ఇది నా శిక్ష' అని శిక్ష విధించింది పనస చెట్టుకి.

మరి తగుదునమ్మా అని నారింజ చెట్టు వంతపాడింది గదా. అందుకని 'పనసకి వంత పాడినందుకు యివాల్టి నుంచి నీ వళ్లంతా పులుపే పో. నువ్వు దేనికీ పనికిరావుపో' అని దానికీ శిక్ష విధించింది మామిడి చెట్టు.

అప్పటినుంచి అది ఆ గతినా, ఇది ఈ గతినా బతుకు లాగుతున్నాయి. అనాసచెట్టు మాత్రం అప్పుడు మొలచిన ముళ్ల తురాయితో యిప్పటికీ తక్కిన చెట్ల నుంచి భయం లేకుండా హాయిగా బతుకుతూ వుంది.



# అమ్మా యింటి బూడిద

ఒక అమ్మాయి చాలా గరీబు. ఎంత గరీబు అంటే వాళ్ల యింట్లో వాళ్ల అమ్మా నాన్నకు ఒంటి మీద ఒక జత ఉంటే ఉతకడానికి ఇంకో జత ఉండేది కాదు.

కానీ ఆ అమ్మాయి చాలా అందమైనది. ఆకాశంలో తారలు ఉంటాయే అలా ఛలక్ ఛలక్ అంటా ఉంటుంది.

అంతటి అందగత్తె ఒకరోజు ఒక రాకుమారుడి కంట పడింది.

రాకుమారుడు అంతటి అందగత్తెను వదులుతాడా? వెంటనే వలచాడు.

ఏడంతస్తుల మేడలో ఉండే రాకుమారుడు చిన్న గుడిసెలో ఉండే ఆ అందగత్తెని నిఖా చేసుకొని రాజమహల్‌కు తీసుకొని వెళ్లాడు.

రోజులు గడుస్తున్నాయి.

గరీబు అందగత్తెకు కాలు నేల మీద పెట్టాల్సిన అవసరం లేకుండా అన్నీ గడిచిపోతున్నాయి. భర్త మంచివాడు. బాగా చూసుకుంటున్నాడు. నెల తప్పిందని తెలిశాక అసలు బయటకు వెళ్లడమే మానుకొని ఆమెనే అతుక్కుపోయి ఉంటున్నాడు.

కానీ ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఆరోగ్యం పాడైపోయింది. అంతుపట్టని రోగం. అది ఏం జబ్బో ఏం మాయదారిరోగమో ఎవరూ చెప్పలేక పోయారు. అమ్మాయి కళ్లల్లో కాంతి తగ్గిపోయింది. మొకంలో కళ తప్పింది.

రాకుమారుడు పరేషాన్ అయిపోయాడు. భార్యను సంతోషపెట్టడానికి ఏమిటేమిటో చేశాడు.

కానీ ఫలితం లేకపోయింది.

'నీకు ఏం కావాలి?' అని అడిగితే అమ్మాయి ఏమీ చెప్పేది కాదు.

భర్తతో నోరు తెరిచి ఏమైనా చెప్పుకునే రోజులా అవి?

అమ్మాయి రోజు రోజుకూ యింకా నీరసించిపోతోంది. కడుపులో బిడ్డ ఉన్న ఆడదాయె.

రాకుమారుడికి చెమటలు పట్టేశాయి. దిగులు కమ్ముకునింది.

రాజమహల్‌లో ఒక ముసలామె ఉంటే వెళ్లి 'అవా. ఏంది సంగతి. నువ్వు ఆడదానివి. లోకం చూసిన దానివి. ఎందుకు నా భార్య ఇలా అయిపోయింది' అని అడిగాడు.

అవ్వ చాలా సేపు ఆలోచించి 'నాయనా. అమ్మాయిని కాస్త వాళ్ల అమ్మగారింటికి పంపించు' అంది.

రాకుమారుడు ఆశ్చర్యపోయాడు.

'అవ్వా. అక్కడ ఏముందని పంపేది. వాళ్లసలే కడుపుకు తిండిలేక మలమలా మాడతా ఉంటారు. అట్లాంటి యింటికి కడుపుతో ఉన్న ఆడదాన్ని ఎలా పంపేది?' అని అడిగాడు.

'లేదు నాయనా. ఒకసారి పంపు' అంది అవ్వ.

రాకుమారుడు ఇక తప్పదన్నట్టుగా భార్యను వాళ్ల అమ్మగారింటికి భటుల తోడునిచ్చి పంపించాడు. కానీ అతడికి మనసు ఊరికే ఉండలేదు. అమ్మగారింటికి పోయి అమ్మాయి ఏం చేస్తుందో చూడాలని అనుకున్నాడు. ఆమెకు తెలియకుండా ఆమె వెనుకనే అనుసరించాడు.

అమ్మాయి నేరుగా అమ్మగారింటికి వెళ్లింది. చాలా రోజుల తర్వాత అమ్మను చూసి గట్టిగా కావలించుకొని ఆమె గుండెల మీద సేదతీరింది. తండ్రిని తృప్తిగా చూసుకొంది. అయినా ఆమె కళ్లల్లో వెలుగు రాలేదు. మొకంలో కళ కూడా రాలేదు.

'కడుపుతో ఉన్న కూతురు యింటికి వచ్చినా ఏమీ పెట్టలేకపోతున్నాం కదమ్మా' అని తల్లి వలవలా ఏడ్చింది.

అమ్మాయి చుట్టూ చూసింది. ఏమీ కనిపించలేదు. పొయ్యి వైపు చూసింది. ఆ పొయ్యిలో మంటపెట్టి ఎంత కాలమయ్యిందో. దగ్గరికి వెళ్లింది. అందులో కాసింత బూడిద కనిపించింది.


అంతే. ముందుకు వంగి చిటికెడు బూడిద తీసుకొని గబుక్కున నోట్లో వేసుకుంది.

క్షణాల్లో ఆమె కళ్లల్లో కాంతి వచ్చేసింది. మొఖంలో కళ వచ్చేసింది. సంతోషం వల్ల వొళ్లంతా మెరసి ఆరోగ్యం వచ్చేసింది. అమ్మాయి మునుపటి అమ్మాయిగా ఛలక్ ఛలక్ మని మెరిసిపోయింది.

కిటికీ నుంచి ఇదంతా గమనించిన రాకుమారుడు గబగబా వెనక్కు వచ్చి రాజమహల్‌లోని అవ్వకు సంగతంతా చెప్పాడు.

'అంతే నాయనా. ఆడపిల్లకు పెళ్లయినా, భర్త దగ్గర ఎంతకాలం కాపురం చేసినా ఆమెకు అప్పుడప్పుడు తల్లిగారింటి నీళ్లు పడాలి. నీళ్లకు కూడా గతిలేకపోతే కనీసం అమ్మగారింటి బూడిదను కాసింత బొక్కినా చాలు. అదొక తృప్తి. ఆడపిల్ల మనసెరిగి ఆమెను అప్పుడప్పుడు అమ్మగారింటికి పంపిస్తుండు నాయనా' అని హితవు చెప్పింది.

అప్పట్నించి రాకుమారుడు అమ్మాయిని అప్పుడప్పుడు అమ్మగారింటికి పంపుతూ ఆమెను సంతోషపెడుతూ అతడూ సంతోషంగా ఉన్నాడు.



# ప్రవక్త చెప్పిన కథ

ఈ కతను మా ప్రవక్త చెప్పేవారంట.

ముగ్గురు స్నేహితులు ఒకరోజు అడవికి వెళ్లి అట్ల తిరుగుతూ యిట్ల తిరుగుతూ ఒక గుహలోకి వెళ్లారు. వెళ్లగానే ఒక బండరాయి దొర్లి దారి మూసుకొనిపోయింది. ముగ్గురూ ఎంతెంత ప్రయత్నించినా రాయి తొలగలేదు. ఏం చెయ్యాలా అని కూలబడ్డారు.

ఒకడన్నాడు. మనం దేవుని విశ్వాసులం. మనం ఎట్టెట్ల జీవిస్తున్నామో దేవుడికి మొరపెట్టుకుందాం. మన జీవనం సత్యమైతే ఈ రాయి తొలుగుతుంది. లేకుంటే తొలగదు అన్నాడు.

సరే అన్నారు ముగ్గురు.

మొదటివాడు యిలా చెప్పాడు: దేవుడా. నేను మేకల్ని కాస్తాను. రోజా సాయంత్రానికి మేకల్ని యింటికి తోలుకుపోతాను. పోయాక పాలు పిండుతాను. మొదట నా తల్లిదండ్రులకి యిస్తాను. తర్వాత నా పిల్లలకు యిస్తాను. ఆ తర్వాత నా భార్యకు యిస్తాను. ఆఖర్న నేను తాగుతాను. ఒకరోజు నేను యింటికి చేరి పాలు పితికే సరికి ఆలస్యమైపోయింది. అప్పటికే నా తల్లిదండ్రులు నిద్రపోయారు. వాళ్లు ముసలివాళ్లు. వాళ్ల బిడ్డగా అందరికంటే మొదట వాళ్ల బాగోగులు చూడాల్సిన బాధ్యత నామీద వుంది. అందుకని ముంతలోనే పాలు పట్టుకొని వాళ్ల తలదగ్గర నిలుచున్నారు. నా బిడ్డలు ఆకలితో వున్నారు. ఏడుస్తున్నారు. నా భార్యా నేనూ కూడా ఆకలితోనే వున్నాము. కానీ మొదట నా తల్లిదండ్రుల కడుపు నిండనిదే మేము కడుపు నింపుకోవడానికి లేదు అనుకొని అలాగే నిలబడ్డాను. వాళ్లు తెల్లారి లేచాక వాళ్లకు పాలు యిచ్చి, ఆ తర్వాత నా బిడ్డలకు యిచ్చి, అప్పుడు నా భార్యకు యిచ్చి, చివరకు నేను తాగాను. ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.

రాయి కొంచెం తొలగింది.


రెండవ వాడు యిలా చెప్పాడు: దేవుడా. నా దగ్గర డబ్బుంది. ఆ డబ్బు మదం చూసుకొని ఒక ఆడపిల్ల మీద కన్నేశాను. కోరినంత డబ్బిస్తాను, నాకు లొంగిపో అని చెప్పాను. ఆత్మాభిమానం గల ఆ అమ్మాయి నాకు లొంగలేదు. కొంతకాలానికి కరువొచ్చింది. తినడానికి ఎండు కర్జూరాలు కూడా దొరకని కాలం. అప్పుడు నేను నూట యిరవై రూపాయలు ఆశ చూపి మళ్లీ ఆ అమ్మాయిని లొంగిపొమ్మని చెప్పాను. ఆ అమ్మాయి నా కళ్ళల్లోకి దయగా చూసి లొంగిపోవడానికి సిద్ధమయ్యింది. ఆ దయకు నేను చలించిపోయాను. ఆమె కాళ్లమీద పడి క్షమాపణ కోరాను. ఆమె అవసరానికి తగినంత డబ్బు యిచ్చి పంపించేశాను. మళ్లీ ఏ పరాయి ఆడపిల్లవైపు కన్నెత్తి చూడలేదు. నేను చేసిన ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.



రాయి మరికాస్త తొలగింది.

మూడవవాడు యిలా చెప్పాడు: దేవుడా. నా దగ్గర చాలామంది పాలేర్లు పనిచేసేవారు. వాళ్లకు ఏరోజు కూలి ఆరోజు యిచ్చేసేవాణ్ణి. ఒకరోజు ఒక పాలేరు నా దగ్గర కూలి చేసి డబ్బులు తీసుకోకుండా వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాలేదు. నేను ఆ కూలి డబ్బులతో ఒక కోడిని కొన్నాను. అది పెట్టే గుడ్లను పొదిగించాను. వాటిని పెంచి పెద్దచేసి వాటి మీద వచ్చే ఆదాయంతో ఒక గేదె కొన్నాను. ఆ గేదె మీద వచ్చే ఆదాయంతో మరికొన్ని గేదెలను కొని అలా వీలైనంత ఆస్తిని సంపాదించాను. చాలా ఏళ్ల తర్వాత ఆ పాలేరు తిరిగి వచ్చాడు. ఆరోజు మర్చిపోయి వెళ్లిన కూలిడబ్బులు అడిగాడు. యిదిగో ఈ ఆస్తంతా నీ కూలి డబ్బే తీసుకెళ్లు అన్నాను. పాలేరు ఆశ్చర్యపోయాడు. వాడి సొమ్ముతో సంపాదించింది వాడిది కాక మరెవరిదవుతుందని బలవంతంగా యిచ్చి పంపాను. ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.

అప్పుడు ఆ రాయి పూర్తిగా తొలగి వాళ్లు బయటపడ్డారు.



# కాన్ కరేలా

## సూర్యచంద్రుల గ్రహణం కథ

ఒక రాణిగారు గర్భంతో ఉంది.

ఒకనాడు మహల్‌లో నిలబడి బయటికి చూస్తూ వుంటే ఒక కాకి బాగా పండిన ఎర్రటి కాకరకాయని తింటూ కనిపించింది. ఆ కాకరకాయ మీద రాణికి మనసుపోయింది. కొంచెం అన్నా మిగులుతుందేమో తిందాము అని చూస్తుండేసరికి కాకి మొత్తం కాకరకాయని తినేసి ఎగిరెల్లిపోయింది.

గర్భంతో వున్న ఆడది. లోన కోరిక పుట్టింది. అది తీరలేదు. అందుకని వొళ్లంతా వాపు వచ్చేసింది.

'మహరాణి మనసులో ఏదో కోరిక పెట్టుకున్నారు. అందుకే వాపు వచ్చింది. వాపు తగ్గకపోతే కాన్పు ప్రమాదం' అన్నారు వైద్యులు.

'రాణిగారూ. ఏంటి సంగతి. మీ కోరికేమిటో నాకు చెప్పండి. ఎంత కష్టమైనదైనా తీరుస్తాను' అన్నాడు రాజు.

రాణిగారు విషయమంతా చెప్పి 'నాకు అలాంటి కరేలా (కాకరకాయ) తినాలని వుంది' అని వెల్లడి చేసింది.

రాజు యింక గుర్రం తీసుకొని బయలుదేరాడు. పోంగా పోంగా చాలా దూరాన ఒకచోట ఒక కాకరపాదు కనిపించింది. దానికి కనీవినీ ఎరగనంతటి రీతిలో ఎర్రటి కాకరకాయలు కనిపించాయి. రాజు వెళ్లి ఒక కాకరకాయను కోస్తుంటే మడుగులో నుండి నాగుపాము వచ్చింది.

'రాజా. ఈ మడుగు నాది. ఈ చెట్టు నాది. నేనడిగింది యిచ్చి నీకు కావలసింది తీసుకుపో' అంది.

'ఏం కావాలి?' అన్నాడు రాజు.

'మగపిల్లాడు పుడితే నీకు. ఆడపిల్ల పుడితే నాకు' అంది పాము.

అప్పటి సంగతి అప్పుడులే అనుకున్న రాజు 'అలాగే' అని చెప్పి కాకరకాయలు కోసుకొని వచ్చేశాడు. రాణి వాటిని తినింది. వాపు తగ్గింది. కాన్పు జరిగింది. ఆడపిల్ల పుట్టింది. రాజుగారి గుండెల్లో రాళ్ల పడ్డాయి. సరే పాము వచ్చినప్పుడు చూసుకుందాంలే అనుకుంటూ వుండగా మళ్లీ కాన్పు జరిగి ఒక అబ్బాయి పుట్టాడు.

అమ్మాయికి పన్నెండేళ్లు రాగానే ఒకరోజు పాము రాజును వెతుక్కుంటూ వచ్చింది. నీ కూతుర్ని యిస్తావా యియ్యవా? అని నిలదీసింది. రాజు యింకేమీ చేయలేక అమ్మాయిని పాము చేతుల్లో పెట్టాడు. పాము ఆ అమ్మాయిని తీసుకెళ్లి మడుగులో కాపురం పెట్టింది.

సరే యీ అమ్మాయికి ఒక తమ్ముడు వున్నాడు గదా. వాడు పెరిగి పెద్దవాడవుతున్నాడు. ఒకరోజు వాడు తోటి పిల్లలతో ఆడుకుంటూ ఎవర్నో తన్నాడు. దాంతో వాడికి కోపం వచ్చి 'యిందుకని గదరా మీ అక్కను పాము తీసుకెళ్లింది' అన్నాడు. ఆ మాటకు తమ్ముడు నోరెళ్లబెట్టాడు. వెళ్లి తండ్రిని సంగతి అడిగాడు.

'అవును నాయనా. ఫలానా సమయంలో ఫలానా విధంగా జరిగింది. ఫలానా రోజు వచ్చి ఆ పాము మీ అక్కను తీసుకువెళ్లింది' అని

[illegible]

'నువ్వు బాధపడబాకు అబ్బూ. నేను అక్కను తీసుకొస్తాను' అని చెప్పి, కత్తులు కటార్లు బాణాలు బరిసెలు తీసుకొని వెళ్లాడు తమ్ముడు. వెళ్లి [illegible] మడుగులో దూకాడు.

అక్కడ అక్క కనిపించింది. 'ఎవరు నాయనా నువ్వు?' అని అడిగింది.

'అక్కా నేను నీ తమ్ముణ్ణి! నిన్ను తీసుకెళ్లడానికి వచ్చాను' అన్నాడు తమ్ముడు.

'నన్ను యింకేం తీసుకెళతావు నాయనా. మీ బావ నాతో కాపురం చేస్తున్నాడు. నేనిప్పుడు గర్భంతో వున్నాను. నన్ను తీసుకెళ్లి కూడా ప్రయోజనం లేదు' అంది అక్క ఏడుస్తూ.

'ఏం పరవా లేదక్కా. నేను నిన్ను తీసుకెళతాను' అని అన్నాడు తమ్ముడు.

'ఆ సంగతి తర్వాత యిప్పుడాయన అన్నానికి వచ్చే టైము' అని చెప్పిన అక్క, తమ్ముణ్ణి బల్లిలా చేసి గోడకు అంటించి కూర్చుంది.

కాసేపటికి ఫన్‌ఫనామంటూ బుసలు కొడుతూ వచ్చింది పాము. వచ్చి పీకల్దాక మెక్కి వెళ్లిపోయింది.

గోడ దిగిన తమ్ముడు 'అక్కా. యిలాకాదు. పొయ్యిలో కట్టెలు రాజేసి వేడినీళ్లు పెట్టు. బాగా మరగనివ్వు. రాత్రికి వాడొచ్చి చుట్టచుట్టుకొని పడుకుంటాడు కదా. దబర తీసుకెళ్లి చుట్ట మీద పెట్టెయ్. చచ్చిపోతాడు' అన్నాడు.

అక్క అలానే చేసింది. రాత్రి పామొచ్చి చుట్టచుట్టుకొని పడుకోగానే కాలేకాలే నీళ్లున్న దబరను తీసుకొచ్చి దాని చుట్ట మీద పెట్టింది.

భగ్గున చుట్ట కాలినా పాము ప్రాణాలు పోలా.

'నేను చచ్చినా రేపు నా బిడ్డలు నిన్నూ నీ తమ్ముణ్ణీ చంపుతారు చూడు' అని ప్రాణాలు విడిచింది. వెంటనే అక్కను తీసుకొని బయలుదేరాడు తమ్ముడు. అడవిదారి. సగానికి వచ్చేసరికి అక్కకు నొప్పులు బయలుదేరాయి. కాన్పు జరిగింది. పాముపిల్ల పుట్టింది. దానిని చంపేశాడు తమ్ముడు. మళ్లీ కొంచెం దూరం వెళ్లాక మళ్లీ నొప్పులు వచ్చాయి. మళ్లీ పాము పిల్ల పుట్టింది. దానిని కూడా చంపేశాడు తమ్ముడు. అలా గడియ గడియకు నొప్పులొచ్చి, గడియ గడియకూ కాన్పు జరిగి పాము పిల్లలు పుడుతుంటే వాటన్నింటిని చంపుకుంటూ వస్తున్నాడు తమ్ముడు.

యింక ఊరు దగ్గర పడ్తోందనగా ఆఖరి కాన్పు అయ్యింది రాణికి. ఆఖరి పాముపిల్ల పుట్టింది. దానిని తమ్ముడు చంపేటంతలో అది సరసరమని పారిపోయింది. తమ్ముడికి చెమటలు పట్టాయి. గునపం తీసుకొని అటూ యిటూ తప్పించే తవ్వుతున్నాడు దానిని చంపడానికి. అది దొరకడం లేదు.

సరిగ్గా అప్పుడే ఆ దోవన అన్నదమ్ములైన సూర్యచంద్రులు పోతా వున్నారు. కింద తమ్ముడు చేస్తున్న ఈ పనిని చూశారు. చూసి కిందకు దిగారు. 'ఏమోయి. ఏమి నువ్వు చేస్తున్న పని?' అని అడిగారు,

తమ్ముడు సంగతంతా చెప్పుకొచ్చాడు. సూర్యచంద్రులు నవ్వారు. నవ్వి 'అది యిప్పుడు పసి పాము. పెరిగి పెద్దదయ్యి నిన్నూ, నీ అక్కనూ చంపడానికి వచ్చినప్పుడు చూసుకుందాం. అప్పటికి కూడా నీకు ప్రమాదం ఏర్పడితే మేము అడ్డుపడతాం పో' అని మాటిచ్చారు.

సరే అని అక్కాతమ్ముళ్లు వెళ్లిపోయారు. పన్నెండేళ్లు గడిచిపోయాయి. ఆఖరి పాము పెద్దదయ్యింది. ఫన్‌ఫనామని బుసలుకొడుతూ పగ తీర్చుకోవడానికి బయలుదేరింది. మళ్లీ ఆ టైములో అటుగా వెళుతున్న సూర్యచంద్రులు యిది చూసి కిందకు దిగి వచ్చారు.

'ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగారు పాముని.

'నేను ఫలానా అక్కాతమ్ముళ్లని చంపడానికి వెళ్తున్నాను. వాళ్లు మా నాన్నను చంపారు' అంది పాము.

సూర్యచంద్రులు ఆ పాముని శాంతింపజేశారు.

'ఓరి పిచ్చివాడా. ఏనాడో జరిగిపోయిన సంగతికి యింకా నువ్వు పగ పెట్టుకొని వున్నావా? మీ నాన్న చేసిన పనికి వాళ్లు అలా బదులు తీర్చుకున్నారు. సరే. యింకా నీకు కోపం వుంటే మా మీద పగ తీర్చుకో. ఏడాదికోసారి మమ్మల్ని మింగు కక్కు. సరేనా' అన్నారు.

సరే అంది పాము.

అప్పటి నుంచి ఆ పాము ఏడాదికోసారి సూర్యుణ్ణి, చంద్రుణ్ణి మింగుతూనే వుంది. అదే సూర్యగ్రహణం, అదే చంద్రగ్రహణం.

✪ ఈ కథను కావలి 'కసాబ్‌గల్లీ'లోని ఖుర్షీద్‌బీ అనే ఆవిడ చెప్పింది. ఆమె సొంత ఊరు కావలికి దగ్గరగా వున్న 'ముంగమూరు'. ఆ ఊరికి ఆమె బాల్యంలో పూసలు అమ్మే 'సుక్క బూబమ్మ' అనే ముసలామె వచ్చేదంట. ఆమె ఆ కథను చెప్పిందంట.

# రెండో పిట్ట

ఒక వర్తకుడు వర్తకానికి బయలుదేరాలి. ఎడారిలో ఎంతో దూరం ప్రయాణించి వ్యాపారం ముగించుకొని రావాలి.

దారిలో తిండి దొరుకుతుందో లేదో తెలియదు. నీళ్లు దొరుకుతాయో లేదో తెలియదు. ఏ ఆపద తరుముతుందో ఏ ముప్పు ముంచుకొస్తుందో ఎవరికీ తెలియదు. ఇవన్నీ ఆలోచించుకున్న ఆ వర్తకుడు నిట్టూర్పులు విడిచి, బతకాలంటే యిన్ని బాదరబందీలుపడాలా అనుకొని - వెళ్ళేముందు ఒక స్నేహితుణ్ణి కలిసి 'మిత్రమా, నేను రావడానికి చాలాకాలం పడుతుంది. వచ్చాక కలుద్దాము. ఖుదాహాఫీస్' అని చెప్పేసి వెళ్లాడు.

వెళ్లిన మూడు రోజులకే మళ్లీ ఆ వర్తకుడు తిరిగి వచ్చేశాడు.

స్నేహితుడు అతణ్ణి చూసి 'ఏమయ్యా, అప్పుడే తిరిగి వచ్చేశావు?' అని అడిగాడు.


'దారిలో ఒక వింత చూశాను. అందుకని వచ్చేశాను' అన్నాడు వర్తకుడు.

'ఏమా వింత?' అన్నాడు స్నేహితుడు.

'ఒకచోట ఒక పిట్ట పడి వుంది. అది గుడ్డిది. రెక్కలు కూడా లేవు. దాని తిండి అది సంపాదించుకోలేదు. ఊరికే అలా ప్రాణాలతో పడివుంది. ఏమిరా దీని జన్మ అని నేను చూస్తూ వుండగా ఎక్కడి నుంచో దూరంగా యింకో పిట్ట ఎగురుకుంటూ వచ్చింది. వచ్చి దానికి ఆహారం పెట్టింది. ఆ తర్వాత నీళ్లు తెచ్చిచ్చింది. ఆ తర్వాత సేవలు చేసింది. అలా ప్రతిపూటా దాని బాగోగులు చూస్తూనే వుంది. ఏదోఒక ఎడారిలో ఏదో ఒక మారుమూలన ఏదో ఒక గుడ్డిపిట్ట పడివుంటే దేవుడు దాని గురించి పట్టించుకొని సమయానికి ఆహారం అందిస్తున్నాడే, నిలువెత్తు మనిషిని మరి నాకు ఆ మాత్రం అందించడా? జానెడు పొట్ట కోసం ఈ ప్రయాణాలు ఎందుకు? ఈ వర్తకాలు ఎందుకు? ఈ దూరభారాలూ కష్టనష్టాలూ ఎందుకు? అన్నిటికీ ఆ దేవుడే వున్నాడు... నాక్కూడా తిండి పెడతాడు అనుకొని వెనక్కి వచ్చేశాను' అన్నాడు వర్తకుడు.


స్నేహితుడు నవ్వాడు.

'ఏమయ్యా ఆ పిట్ట గుడ్డిది. దానికి రెక్కలు లేవు. అందుకని దేవుడు దానికి ఆహారం పెడుతున్నాడు. మరి నీకు ఏమైంది. నీకు కాళ్లూ చేతులూ లక్షణంగా వున్నాయే. కళ్ళు సలక్షంగా కనబడుతున్నాయే. నువ్వు కష్టపడగలవే. పని చేయగలవే. నీ దృష్టంతా ఎంతసేపటికీ మొదటి



పిట్ట మీదే ఉందిగానీ రెండో పిట్టను చూశావా? కాళ్ళూ చేతులూ సక్రమంగా వున్న జన్మెత్తినందుకు అది నలుగురికీ సాయం చేయాలనుకుంటోంది. కష్టపడి బతకాలనుకుంటోంది. మంచి పేరుతో చావాలనుకుంటోంది. మనం ఆ రెండో పిట్ట కావాలి. కష్టపడి మనల్ని మనం పోషించుకోవాలి. చేతనైనంతలో యితరులకి సాయం చేయాలి. అది గదా జన్మంటే' అన్నాడు.

వర్తకుడు యింకేమి మాట్లాడలేదు. మరుసటిరోజే మళ్లీ వర్తకానికి బయలుదేరాడు. ఆ తర్వాత చేతనైనంతలో నలుగురికీ సాయం చేస్తూ బతికాడు.



# బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్

బాగా శాస్త్రాలు చదువుకున్న, అల్లా గొప్పతనం తెలిసిన, ఖురాన్ కంఠోపాఠం వచ్చిన ఒక ముల్లాగారు ఒకసారి ఒక ఊరి నుంచి మరో ఊరికి పోతున్నారు.

మధ్యలో వాగు అడ్డం వచ్చింది. అది పోటులో వుంది.

వెంటనే ముల్లాగారు తన చేతిలో వున్న పెద్ద పెద్ద పుస్తకాలు, గ్రంథాలు అన్నీ కిందపెట్టి ఒడ్డున కూర్చున్నారు.

ఆ తర్వాత లెక్కలు మొదలుపెట్టారు.

'ఇప్పుడు టైము యింతయ్యింది. ఈ టైములో ఈ వాగు యింత పోటులో వుంది. యింత పోటులో వుందీ అంటే యిందులో యింత ఎత్తుకు నీళ్ల ప్రవహిస్తూ వుండొచ్చు. యింత ఎత్తుకు నీళ్ల ప్రవహిస్తూ వున్నాయంటే ఈ వరవడి తగ్గడానికి యింత టైము పడుతుంది. యింత టైము పట్టాక వాగులోని నీళ్లు యింత మట్టానికి కిందకు దిగుతాయి. యింత మట్టానికి దిగాక నేను అడుగు పెడితే అవి ఖచ్చితంగా నా మోకాళ్ళదాకా వస్తాయి. అంతదాకా ఆగాలంటే యింకా నేను రెండు గంటల ముప్పయి రెండు నిమిషాలు యిక్కడే వేచి వుండక తప్పదు' అనుకొని ఈలోపున టైము ఎందుకు వృధా చేయాలి అని, ఏదో పుస్తకం తీసి చదువుతూ కూర్చున్నారు.

ఈలోపు ఒక పల్లెటూరి వాడు కట్టెల మోపును ఎత్తుకొని అక్కడకు వచ్చాడు.

వాడు ఒడ్డు దగ్గర ఆగి దాటబోతుంటే ముల్లాగారు వాణ్ణి ఆపారు.

'ఓయ్. పిచ్చివాడా. యిప్పుడు వాగు మంచి పోటులో వుంది. దీనిలో యిప్పుడు యిన్ని అడుగుల నీరు పారుతూ వుంది. యిది తగ్గాలంటే యిన్ని గంటల యిన్ని నిముషాలు పడుతుంది. అవన్నీ నీకు తెలియవుగానీ ఆగు. లేకుంటే ప్రాణాలు పోగొట్టుకుంటావు' అన్నారు వాడితో.

'అదేంది స్వామీ కొత్తగా చెబుతారు. నేను రోజుకు రెండుసార్లు ఈ వాగు దాటుతాను. ఈ పోటు ఏమిటో ఆ పాటు ఏమిటో నాకు తెలియదు సాహెబ్' అన్నాడు పల్లెటూరి వాడు.

'అవునా? మరి రోజూ ఎట్లా దాటుతున్నావయ్యా?' అని ఆశ్చర్యపోయాడు ముల్లాగారు.

[illegible] యిట్లా అని, పెద్దగా 'బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్' అని జపించి, చకచకా అవతలకి వెళ్లిపోయాడు.



ముల్లాగారి ఆశ్చర్యానికి అవధులు లేవు.

'ఓయ్ పల్లెటూరి వాడా. నీకు నాకంటే ఎక్కువ శాస్త్రాలు తెలిసినట్టున్నాయే' అన్నాడు పెద్దగా.

'కాదండీ. నాకేమీ తెలియదండీ. నాకు కల్మాలుగానీ, నమాజుగానీ, ఖురానుగానీ ఏమీ తెలియవండీ. నాకు తెలిసిందల్లా బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్ ఒక్కటేనండీ. నిజానికి దీని అర్థం కూడా నాకు తెలియదండీ. తమరే మళ్లెప్పుడైనా చెప్పాలి' అనేసి వెళ్లిపోయాడు వాడు.

శాస్త్రాలు తెలిసిన ముల్లాగారు ఏం చేయాలో తోచక అట్లాగే గట్టున కూలబడ్డారు.



# జోమ్‌పూర్ ఖాజీ

జోమ్‌పూర్ అనే ఊర్లో జోమ్‌పూర్‌ఖాజీ అనే ఉస్తాదు (టీచరు) ఉండేవాడంట. ఆయన బలే షేక్‌షిల్లి. మజాక్ మనిషి. ఇస్కూల్లో పాఠాలు బాగా చెప్పినా వాళ్లతో యీళ్లతో చతుర్లు ఆడటంలో ఫస్టు ఉండేవాడంట.

ఒకరోజు పిలకాయలకు పాఠాలు చెప్తా ఉంటే పిలకాయలు అలివిగాకుండా ఆయనను సతాయిస్తా ఉన్నారంట. కొట్టినా తిట్టినా మాట వినే పిలకాయలైతే గదా. ఆయన చూసి చూసి విసిగి పోయి 'ఒరే.. మీలాంటి గాడిదలని ఎంతమందిని మనుషుల్ని చేసేదిరా' అన్నాడంట పెద్దగా.

అప్పుడే ఆ ఇస్కూలు పక్క నుంచి ఒక ధోబీ గాడిద మీద గుడ్డలు వేసుకొని సాకిరేవుకు పోతా పోతా ఆ మాటలు విన్నాడు.

అంతే. లటక్కన ఆగిపోయినాడు. పాపం ఆ ధోబీకి పిలకాయలు లేరు. గాడిదనే పిల్లోడి లెక్కన సాక్కుంటా ప్రాణప్రదంగా చూసుకుంటా ఉన్నాడు. ఇప్పుడు ఖాజీ మాటలు విన్నాక అరెరె ఖాజీసాబు నా గాడిదను కూడా మనిషిగా మారిస్తే బాగుంటుంది కదా అనుకున్నాడు. అనుకుని నేరుగా యిస్కూల్లోకి పోయి ఖాజీసాబుని పిలిచాడు.


'ఏంది?' అని అడిగినాడు ఖాజీ.

'సాహెబ్... మీరు మామూలు మనుషులుకారని వాళ్ల నోటి గుండా వీళ్ల నోటి గుండా ఇన్నాళ్లు వింటా ఉండేవాణ్ణి. ఇవాళ మీ నోటి గుండానే మహిమగల మాట విన్నాక నా మనసు ఆగటం లా. మీరు నాక్కూడా సాయం చేయాల. ఇంతకాలం మీరు చాలా గాడిదలని మనుషులుగా మార్చి ఉంటారు. బాబ్బాబూ.. కాస్త నా గాడిదను కూడా మనిషిగా మార్చండి. పిల్లలు లేనోణ్ణి. కనికరించండి' అన్నాడు.

ఖాజీగారికి పకపకా నవ్వొచ్చేసింది. కానీ దానిని బయటపెట్టకుండా కడుపులోనే నవ్వుకొని ధోబీకి తగిన తమాషా చూపించాలను కొని 'అరె... భాయ్... అదెంత పని. ఇంతకాలం ఈ సంగతి నాకు చెప్పకుండా ఎందుకు ఉన్నావు. గాడిదలని మనుషులుగా చేసే పని మనకి పుట్టినప్పటి నుంచి తెలుసు కదా. సరే.. నీ గాడిదను ఆ గుంజకి కట్టేసి పో. వారం రోజుల తర్వాత రా. మనిషిని తీసుకొని పోదూ గానీ' అన్నాడు.

ధోబీ సంతోషంగా ఆ మాటలు విని, గాడిదకు బుద్ధులు చెప్పి, కళ్లారా చూసుకొని, దానిని గుంజకు కట్టి వెళ్లిపోయినాడు. ఇంటికి పోయి భార్యకు ఆ సంగతి చెబితే ధోబీ భార్య కూడా బలే సంతోషపడిపోయింది.

'పోనీలే. అల్లా ఇన్నాళ్లకైనా మన మొర విన్నాడు. ఖాజీగారు మన గాడిదను మనిషిగా చేస్తే అంతే చాలు' అంది.



వారం రోజులు గడిచాయి. ధోబీ ఆదరాబాదరగా ఇస్కూలు కాడికి పోయినాడు మనిషిగా మారిన గాడిద కోసం.

'ఖాజీసాబూ.. ఎక్కడ నా బిడ్డా? నా వరాల తండ్రి.. సూపించు' అని డిమాండు చేశాడు.

ఖాజీ ధోబీని ఎగాదిగా చూసి కోప్పడి 'ఏమయ్యా పెద్ద మనిషి. ఇప్పుడా రావడం? వారం తర్వాత రమ్మన్నానేగానీ మధ్య మధ్యలో చూసి పోవద్దని చెప్పానా? పాపం మీ గాడిద మనిషిగా మారాక నువ్వు రాక, కడుపు నిండా గడ్డి లేక అల్లాడతా ఉంది. కానీ ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మీ గాడిద బలే తెలివైనది. మనిషిగా మారాక గబగబా చదువు నేర్చేసుకొని ఇప్పుడు నాలాగే పిలకాయలకు పాటాలు కూడా చెప్తా ఉంది. పోయి పక్కన ఆ కిలాసులో పాటాలు చెప్తున్న నీ బిడ్డను చూసుకోపో. పోయే ముందు ఒక్క మాట. ముందు గడ్డి తీసుకొని వెళ్లు. అది తిన్నాక గాని ఏం మాట్లాడకు' అన్నాడు కడుపులో కడుపులోనే నవ్వుకుంటా.

పక్క కిలాసులో ఉండే టీచరుకూ ఈయనకూ పడదు. అందుకని ఆయన మీదకు ధోబీని ఉసిగొలిపినాడన్న మాట.

ధోబీ ఈ సంగతంతా తెలియక గబగబా గంపెడు పచ్చగడ్డి తీసుకొని పక్క కిలాసుకు పోయి కిలాసు బయట దానిని గుమ్మరించి లోపల పాఠాలు చెప్తా ఉన్న టీచరుని చప్పట్లు కొట్టి సైగ చేసి పిలిచాడు.

టీచరు పాఠం ఆపి ధోబీ వంక చూశాడు. ఆయనకు ఏమీ అర్థం కాలేదు.

అవతల ధోబీ ఏమో చప్పట్లు కొట్టిమరీ టీచరుని గడ్డితినమని పిలస్తా ఉన్నాడు.

అసలే ఆ టీచరు కోపం మనిషి. ధోబీ చేస్తున్న సైగలు చూసేసరికి ఆయనకి రేగిపోయింది.

బయటికొచ్చి చేతిలో ఉన్న బెత్తంతో ధోబీని ఉతికి పారేశాడు.

ఆ దెబ్బలకు ధోబీ లబోదిబోమంటూ పరిగెత్తుకొని ఇంటికి చేరి భార్యతో 'ఒసే.. ఒసే.. మనం బలే దెబ్బ తినేసినాము. ఇన్నాళ్లు గాడిదగా ఉన్న బిడ్డ మనం ఏం చెప్తే అది చేశాడు. ఎన్ని కొడితే అన్ని పడ్డాడు. కానీ మనిషిగా మారాక అదంతా కడుపులో పెట్టుకొని నేను కనపడంగానే నన్ను ఉతికి పారేశాడు. అమ్మో... నాకు బలే బయంగా ఉంది.. ఏం చేద్దామే' అన్నాడు ఒళ్లంతా తడుముకుంటూ.

భార్య బెదిరిపోయింది.

'అదేందది.. మనం బిడ్డను కావాలనుకున్నాముగానీ ఇలా తండ్రిని పట్టుకొని తన్నే గొడ్డును కావాలనుకున్నామా. వద్దు నాయనా.. మనకా మనిషి గాడిద వద్దు. ఉత్త గాడిదే చాలు.. అదే పదివేలు.. పోయి ఖాజీసాబు కాళ్ల మీద పడతావో చేతులు పట్టుకుంటావోగానీ మన గాడిదని మళ్లా మన గాడిదలాగే ఇంటికి తీసుకొనిరా' అని చెప్పింది.

ధోబీ ఏడ్చుకుంటా ఖాజీ దగ్గరకు పోయి జరిగింది చెప్పాడు.

ఖాజీ నవ్వి 'భాయ్... నేను చెప్తే నువ్వు వినవని ముందు చెప్పలేదు. మనుషులు బలే పొగరుబోతోళ్లు. ఇయ్యాల రేపు పెద్దలంటే బయపడని వాళ్లు గాడిదల కంటే హీనం గదా. నా మాట విని అట్టాంటి గాడిదల కంటే బంగారం లాంటి నీ గాడిదనే నువ్వు సాక్కో' అన్నాడు.

ఆ తర్వాత లోపల దాచి పెట్టిన గాడిదను తీసుకొని ధోబీకి అప్పగించాడు.

ధోబీ బతికినామురా తండ్రీ అనుకొని తన గాడిదను తీసుకొని పెద్దలంటే భయం భక్తులున్న దానినే బిడ్డలాగా సాక్కున్నాడు.

55.64

phuppujaan kathalu ● mohammad khadeer babu



రాత్రయ్యి, నక్షత్రాలు పూశాక నిద్ర పట్టని
పిల్లలను చుట్టూ కూచోబెట్టుకొని
చందమామలోని అవ్వ చుర్రు చుర్రుమని
కతల దోసెలు మొదలుపెడుతుంది. ఒక్కో
కతా ఒక్కో కమ్మని దోసె. పిల్లలు లొట్టలేస్తూ
విని ఆ కతలను కడుపార తిని... ఇక అప్పుడు
హాయిగా తమ తమ నిద్రాలోకాల్లో విహరిస్తారు.
అనాదిగా జరుగుతున్న పని ఇది. అద్భుతమైన పని.
పిల్లలను నిద్రపుచ్చడానికి, వారికి కతలజోల పాడటానికి, వారికి
మంచిని చెప్పడానికి, చెడును చూపడానికి.. అన్నింటికి మించి వాళ్లను
సంతోషపెట్టడానికి ఏళ్ళకు ఏళ్లుగా మన దాదీలు, నానీలు,
అమ్మీజాన్‌లు, ఆపాజాన్‌లు, ఫుప్పుజాన్‌లు అనేకానేక
కతలను మూటగడుతూనే ఉన్నారు. ఒక తరం నుంచి
మరో తరానికి అందిస్తూనే ఉన్నారు.
ఆ కతలు ఇవి.
అరుదైన కతలు.
ఇవి పిల్లలవి. ఇది వారి పెన్నిధి.